సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక 5-9-2025 ₹30/-

# మత సహనానికి మారుపేరు ప్రవక్త ముహమ్మద్ (స)

సీరతున్నబీ ప్రత్యేక సంచిక

గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి 47 సంచిక: 35 హైదరాబాద్
శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 రూ.30-00
12 రబీఉల్ అవ్వల్ 1447 హిజ్రీ


**తొలిగీటు**

ఏ వ్యక్తి ఒకసారి నాకు
దురూద్ పంపిస్తాడో ఆ
వ్యక్తిపైన దేవుడు పదిసార్లు
తన కారుణ్యాన్ని కురిపిస్తాడు.

*- ముహమ్మద్ ప్రవక్త (స)*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


**మనందరి ప్రవక్త (స)**

కొందరికే కాదోయీ
అందరి వాడాయన
మానవాళికంతటికీ
మార్గదర్శి ఆయన!

తన బోధన వింటేనే
సాఫల్యమిహపరాన
కాదూకూడదు అంటే
వైఫల్యమే నాయన!!

**- యం.డి. ఉస్మాన్‌ఖాన్**

## లోపల...


| | | |
|---|---|---|
| విశ్వ కారుణ్యమూర్తి | ...... | 04 |
| మత సహనానికి మారుపేరు ప్రవక్త ముహమ్మద్(స) | ...... | 05 |
| ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) | ...... | 11 |
| కారుచీకటిలో కాంతిరేఖ | ...... | 14 |
| మహా గొప్ప మానవ సేనాని... | ...... | 16 |
| దైవప్రవక్త (స) దాంపత్య జీవితం | ...... | 20 |
| సర్వమానవాళికి మార్గదర్శి మహాప్రవక్త ముహమ్మద్(స) | ...... | 22 |
| మానవతా విప్లవానికి దీపశిఖ | ...... | 25 |
| సర్వమానవాళికి కారుణ్యం ముహమ్మద్ ప్రవక్త(స) | ...... | 26 |
| మానవతా జ్యోతి ముహమ్మద్ ప్రవక్త(స) | ...... | 30 |
| హృదయాల విజేత ముహమ్మద్ ప్రవక్త (స) | ...... | 32 |
| సంఘ సంస్కర్త | ...... | 33 |
| సమగ్ర జీవితానికి సంపూర్ణ స్వరూపం.... | ...... | 36 |
| అలనాటి ఆయన(స) ప్రవచనాలు నేడూ శిరోధార్యమే | ...... | 39 |
| దైవప్రవక్త(స) తన గృహ సీమలో | ...... | 40 |
| ఆయన(స) జీవితమే సందేశం | ...... | 42 |

# విశ్వ కారుణ్యమూర్తి

**ప్రవక్తా! మేము నిన్ను వాస్తవానికి నిఖిల జగతి వాసుల కొరకు కారుణ్యంగా పంపాము.** (అల్ అంబియా 21: 107)

దేవుని అంతిమ సందేశం అందజేసిన సందేశహరుడు, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్),

ఒక విశ్వాసికి, తన తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, తన ప్రాణం, కడకు జగతి మొత్తం కన్నా ప్రియప్రదమయిన వారు ఆయన(స). ఆయన(స) సచ్చరిత గ్రంథాలను ఎన్ని పర్యాయాలు చదివినా విన్నా తనివి తీరదు. ప్రతిసారి ఓ కొత్త మాధురి, సరికొత్త కాంతి ప్రాప్తమవుతాయి. అదొక అమృతం - మట్టి బొమ్మ మనిషికి అనంత జీవితం, నిరంతర వరప్రసాదాలను అనుగ్రహించే దివ్య శక్తి!

నేటి సకల విధాల మంటలు రేగే కాలంలో ముస్లిమ్ సముదాయానికి అసంఖ్యాక సవాళ్ళు ఎదురవుతున్నాయి. ప్రతీప శక్తులు ఎంతో చాకచక్యంగా, ఎంతో విచ్చలవిడిగా, మరెంతో క్రూరంగా ఇస్లామ్‌ను తుడిచి పెట్టాలని పథక రచనలు చేస్తున్నాయి. దానిగ్గాను వారు ప్రవక్తశ్రీ(స) పట్ల ప్రేమ ముద్రను ముస్లిముల హృదయ ఫలకంపై నుంచి తుడిచివేయాలని, ప్రపంచ అందచందాలు, భౌతిక జీవన శ్రేయోసుఖాలు, అడ్డులేని శారీరక ఆస్వాదనల అవకాశాలు అందజేసి, ముస్లిమ్ యువతను ఆధ్యాత్మిక మాధుర్యానికి దూరం చేయాలని యత్నిస్తున్నారు!

అయితే ఈ పైశాచిక ఆయుధాలకు విరుగుడు, ప్రతి ప్రాణి యదలో ఆయన(స) ఆదర్శ జీవనానికి విధేయతా సంబంధాన్ని, ఆ కారుణ్య స్వరూపుని ప్రేమ బంధాన్ని పటిష్ట తరం చేయడం, ప్రతి హృదయాన్ని ఆయన సచ్చరిత జ్యోతితో ప్రకాశమానం చేయడం, ప్రతి అంతరాత్మకు ఆయన ప్రేమ మాధుర్యాన్ని గ్రోలే ఆవశ్యకతను అవగత పరచడం మాత్రమే! ఇంతే తప్ప మరే శక్తి, మరే ఆయుధం, మరే విధానం లేదు - మనుషుల మనసులను పరివర్తితం చేయడానికి, శక్తి హీనులయిన మనుషుల ఆధీనంలో!!

ప్రవక్త మహనీయులు(స) తన పవిత్ర జీవనిలో తొలి నలభయ్యేళ్ళు తాను పుట్టిన నగర వాసుల మధ్య అమిత గౌరవప్రదంగా, ఎన్నెన్నో మన్ననలతో గడిపారు. ఆ పైన ఆయన ఓ మహత్పూర్వకమయిన అనుభవాన్ని చవి చూశారు. అదొక పరమాద్భుతమయిన మలుపు. అందులో విశ్వ ప్రభువు తరఫున సందేశహరునిగా తన నియామక ఆదేశం పొంది, ఆయన, తాను ఆ మహోజ్వల కార్యాన్ని నిర్వర్తించగలనా అన్న సంశయం వల్ల వణికిపోయారు. ఇక దైవాదేశానికి తలొగ్గి ప్రారంభంలో తన ఆత్మీయులకు, ఆ తరువాత నగర వాసులకు, ఆ పైన సకల మానవాళికి ఆ సందేశం అందజేశారు!

మానవ ఆలోచన, విశ్వాసాలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు, దైనందిన జీవన విధానాలు, తోటి మానవులతో సంబంధాలు- వ్యక్తిగత స్థాయిలోనూ సామూహిక స్థాయి లోనూ- ఒక్క మాటలో సంపూర్ణ జీవితాన్ని సరికొత్త రూపంలో, తమ సృష్టికర్త నిర్ధారించిన రీతిలో మలచు కోవాలన్నదే ఆ సందేశం! ఒక్కొక్క మనిషికి పరిపూర్ణ పరివర్తనా సందేశం అది!! ఇస్లామ్ సందేశం, మానవ జీవన వ్యవస్థలో విప్లవ సందేశం అది!!! ఈ మహత్తర పరివర్తన కొరకు ప్రవక్త మహనీయుల వద్ద ఈ సత్యసందేశం, స్వయంగా తన వ్యక్తిగత ఆదర్శం తప్ప మరే సామగ్రి, మరే సంపదా, మరే అధికారం, మరే సత్తా లేదు!

అయినా మదీనాలో పదేళ్ళ లోపున, అరేబియా ద్వీపకల్పం అంతటా, బహుదైవారాధనలో మునిగి తేలే, తల బిరుసుగల, తగవులమారి తెగల మధ్య, సర్వ సామాన్య స్వీకృతి సాధించింది ఆ సందేశం. వారు పూర్తిగా పరివర్తన చెంది, ఆ జీవనదాయక సందేశ ధ్వజ వాహకులయి, ఆనాటి అగ్ర రాజ్యాలనబడే రోమను, పర్షియన్ సామ్రాజ్యాల్లో, ఆ సందేశ నినాదాలు ప్రతిధ్వనింప జేయగలిగారు! ఆ పైన ఆ సందేశ నినాదాలు, “దేవుడు ఒక్కడే”, “దైవమే సర్వాధికుడు” అన్నవి అటు పడమరన ఆఫ్రికా ఖండం పడమటి తీరాల వరకు, ఇటు తూర్పున చైనా తూర్పు తీరాల వరకు మార్మోగాయి!

ఆనాటి సందేశ స్పృహ, ఆ జనుల భావావేశం, సహనం, త్యాగమే నేటి అవసరం!

ఎస్.ఎమ్. మలిక్




**అబ్దుల్ వాహెద్**

**మతావలంబీకులు గుర్తుంచుకోవలసిన విషయమేమంటే మతపరమైన భేదాభిప్రాయాలు ఖచ్చితంగా ఉంటాయి. ఈ భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవాలి. అందుకే దివ్యఖుర్ఆన్ మంచి చేయడమనే ఉమ్మడి వేదికపై ఏకం కమ్మని కోరుతుంది. విలువలు, నైతిక ప్రమాణాలు... ఇవి మంచిని పెంపొందిస్తాయి. శాంతిని స్థాపిస్తాయి.**

ప్రవక్త ముహమ్మద్ మదీనా వచ్చిన తర్వాత ఎవరినీ ఇస్లామ్ స్వీకరించాలని ఒత్తిడి చేయలేదు. కొత్త సమాజంలో ప్రజాస్వామిక సూత్రాల ప్రాతిపదికన సంబంధాలు పటిష్టపరిచే ప్రయత్నం చేశారు. కాని తర్వాత పోరాటాలు, ఘర్షణల నేపథ్యంలో పరిస్థితి దిగజారింది. యూదు తెగలతో సంబంధాలు దిగజారాయి.

ముస్లిములకు ఒక యూదు తెగకు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ యూదు తెగ మోసానికి పాల్పడుతుందని ముస్లిములు అనుమానించారు. ఈ వాతావరణంలో ఒక ముస్లిమ్ తన దొంగతనాన్ని ఒక యూదుడిపై వేసి తప్పించుకోవాలనుకున్నాడు. ప్రవక్త ముహమ్మద్ ఈ సంఘటనపై ముస్లిమును వెనకేసుకు రాలేదు. వెంటనే విచారణకు ఆదేశించారు. విచారణలో దొంగతనం చేసింది ముస్లిమేనని తేలింది. యూదుడిపై ఆ నేరం నెట్టాడని కూడా తేలింది.

ఈ వ్యవహారంలో ముస్లిములలోని ఒక వర్గం దురభిమానంతో ఆ అపరాధికి వెన్నుదన్నుగా నిలిచి, రాత్రిపూట రహస్య మంతనాలు సాగించడాన్ని కూడా తప్పు పట్టింది.

ఆ తర్వాత ఎనిమిది దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు అవతరించాయి. అవి ఆ ముస్లిమ్ వ్యక్తి పాల్పడిన అపరాధాన్ని తీవ్రంగా ఖండించాయి. యూదుడి నిర్దోషిత్వాన్ని ప్రకటించాయి.

(ఖుర్‌ఆన్ 4:108-115)

“ఎవడైనా ఏదైనా నేరంగాని, లేక పాపంగాని చేసి, ఆ నిందను ఏ నిర్దోషిపైనైనా మోపితే అతడు తీవ్రమైన అపనిందను, ఘోర పాతకాన్ని మూటగట్టుకుంటాడు.”(దివ్యఖుర్‌ఆన్ 4 : 112)

యుద్ధం, పోరాటాల కారణంగా జనించే విద్వేషం వల్ల ముస్లిములు తాము పాటించవలసిన ఇస్లామీయ సూత్రాలను వదులు కోరాదని దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా బోధించింది.

“అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి చేరువైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు”

(దివ్యఖుర్‌ఆన్ 5 : 8)

“వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి.”

(దివ్యఖుర్‌ఆన్ 6:108)

ప్రవక్త ముహమ్మద్ చాలా స్పష్టంగా ఇతరుల పట్ల నాగరికమైన భాష ఉపయోగించాలని చెప్పారు. ఇతరుల దేవతలు, వారి పవిత్ర గ్రంథాలను అవమానించరాదని బోధించారు. ఇతరుల దేవతలను చెడుపేర్లతో పిలవరాదని వారించారు.

“ప్రవక్తా! ఇలా చెప్పు! “గ్రంథప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి.” (దివ్యఖుర్‌ఆన్ 3: 64)

బహుళ మతాలున్న సమాజంలో మత సుహృద్భావాన్ని ప్రోత్సహించడానికి దివ్యఖుర్‌ఆన్ అనేక మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది.

“గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి.”

*(దివ్యఖుర్‌ఆన్ 4 : 171)*

ఇతరుల మతవిశ్వాసాల పట్ల అనుచితంగా మాట్లాడరాదని, వారి దేవుళ్ళను కూడా దూషించరాదని స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

“వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి.”

*(దివ్యఖుర్‌ఆన్ 6 :108)*

ఇలా ప్రకటించు, “ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించేవాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే. నా ధర్మం నాదే.” (దివ్యఖుర్‌ఆన్ 109:1-6)

అన్నింటికీ మించి దివ్యఖుర్‌ఆన్ చెప్పే బోధనేమిటంటే, అన్ని మతాలవారు గమనించవలసిన ఆ బోధన : సమస్తం తెలిసిన వాడు దేవుడు ఒక్కడే.

“ధర్మం విషయంలో బలవంతం లేదు” (దివ్యఖుర్‌ఆన్ 2:256)

దివ్య ఖుర్‌ఆన్ స్పష్టంగా చెప్పిన ఉపదేశమిది. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలో మతసహనానికి సంబంధించిన ఉదాహరణలు కోకొల్లలు.

ముస్లిమేతరులతో సత్సంబంధాలు ఆచరణాత్మకంగా ఆయన జీవితంలో కనబడతాయి. ఒకసారి ఆయన తన సహచరులతో కూర్చుని ఉన్నప్పుడు ఒక మృతదేహం అంతిమయాత్రకు తీసుకువెళుతున్నారు. అది చూసి ఆయన వెంటనే లేచి నిలబడ్డారు. సహచరులు ఆయనతో, ప్రవక్తా! ఆ మృతదేహం ముస్లిముది కాదు అన్నారు. ప్రవక్త జవాబిస్తూ అయితేనేమీ, అది మనిషిదే కదా అన్నారు. పరమత సహనం మాత్రమే కాదు, పర మతస్తుల పట్ల గౌరవానికి ఇంతకు మించి ఉదాహరణేం కావాలి?

మదీనా మస్జిదులో ఒక నల్ల స్త్రీ ఊడ్చే పని చేసేది. ఒకరోజు ఆమె మస్జిదులో కనబడలేదు. వెంటనే ప్రవక్త ఆమె గురించి అడిగారు. ఆమె మరణించిందని తెలిసింది. “ఈ విషయాన్ని నాకెందుకు చెప్పలేదు” అని ప్రశ్నించారు. ఆమె సమాధి ఎక్కడుందో చూపించండని తన అనుచరులతో కలసి ఆమె సమాధి వద్దకు వెళ్ళారు. సమాధి వద్ద నిలబడి ఆమె కోసం ప్రార్థించారు.

ప్రవక్తగా ఆయన మక్కా నగరంలో ఇస్లామ్ ప్రచారం చేస్తున్నప్పుడు ఒక మహిళకు ఆయనపై చాలా కోపం ఉండేది. ప్రతిరోజు ఆయన వీధిలో వస్తున్నప్పుడు ఆయనపై చెత్తాచెదారం పారేసేది. ఇది ప్రతిరోజు జరిగే తతంగం. ఒకరోజు జరగలేదు. ప్రవక్త ఆమె గురించి వాకబు చేశారు. ఆమె జబ్బుపడిందని తెలిసి ఇంటికి వెళ్ళి పరామర్శించి వచ్చారు. తాను వేధించిన వ్యక్తి వచ్చి తనను పరామర్శించడం చూసి ఆమెకు నోటమాట రాలేదు.

ఖైబర్ నుంచి మదీనాకు ప్రవక్త ఆయన అనుచరులు బయలుదేరినప్పుడు జరిగిన సంఘటన మత సహనానికి మరో ఉదాహరణ.

కొందరు యువ ముస్లిములు యూదుల పవిత్రగ్రంథం తోరా కాపీలను యుద్ధసొత్తుగా తమతో తీసుకెళ్ళడాన్ని ఒక యూదు రబ్బీ చూశాడు. దీనిపై రబ్బీ ప్రవక్త ముహమ్మద్ వద్ద అభ్యంతరం తెలియజేశాడు. ప్రవక్త ఇది తెలిసి చాలా ఆగ్రహించారు. వెంటనే తోరా కాపీలన్నింటిని వాపసు ఇవ్వాలని ఆదేశించారు. ప్రవక్త వ్యక్తిగతంగా తన అనుచరుల పనికి క్షమాపణ చెప్పారు.

ఈ సంఘటనపై ప్రముఖ యూదు మేధావి డా.ఇస్రాయీల్ వెల్ఫెన్‌సన్ వ్యాఖ్యానిస్తూ మతగ్రంథం పట్ల ప్రవక్త చూపిన అత్యున్నత గౌరవానికి ఇది నిదర్శనమని అన్నారు.

దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా ఇలా ప్రకటించింది :

“ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు”
*(దివ్యఖుర్‌ఆన్ 16 : 125)*

నజ్రాన్ (ఎమన్) నుంచి 14 మంది క్రయిస్తవ ప్రముఖుల బృందం ప్రవక్త వద్దకు వచ్చి కొత్త మతం గురించి తర్జనభర్జన చేయదలిచింది. వారు కొత్త మతం గురించి, వారి విశ్వాసం గురించి, ఏసుక్రీస్తు విషయంలో ఆయన అభిప్రాయాల గురించి ప్రశ్నించింది. ప్రవక్త వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రెండు సంప్రదాయాలు, ఇస్లామ్, క్రయిస్తవాల మధ్య సంబంధాన్ని సూచిస్తూ ఇస్లామ్ ప్రవక్త ఏసుక్రీస్తు సందేశానికి కొనసాగింపు అన్నారు. ఆయన స్పష్టంగా త్రిత్వ సిద్ధాంతాన్ని తిరస్కరించారు.

క్రయిస్తవ బృందం ఈ మాటలను శ్రద్ధగా వింది. వారి వాదనలను వినిపించారు. వారు ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారు. వెళ్ళే ముందు వారు మస్జిదులో తమ ప్రార్థనలు చేసుకోవాలనుకున్నారు. అక్కడ ఉన్న ముస్లిములు దీనికి ఒప్పుకోలేదు. కాని ప్రవక్త కలుగజేసుకుని వారిని ప్రార్థించుకోనివ్వండి అన్నారు. క్రయిస్తవులు మస్జిదులోనే తూర్పుదిక్కుగా తిరిగి ప్రార్థనలు చేసుకున్నారు.

దివ్యఖుర్‌ఆన్‌లో ఉన్న ‘ధర్మం విషయంలో నిర్బంధం లేదు’ అన్న ఆదేశం వైవిధ్యానికి సంబంధించి ఈ గౌరవప్రదమైన వైఖరినే సూచిస్తుంది. దివ్యఖుర్‌ఆన్ బహుళ మతాల పట్ల చాలా వాస్తవికతా దృక్పథాన్ని చూపించింది. ఇతర మతాల పట్ల శత్రు వైఖరి ఎక్కడా లేదు. దివ్య ఖుర్‌ఆన్ విభిన్న మతాల పట్ల సుహృద్భావాన్ని ప్రోత్సహించింది. ఇతర మతాలను గౌరవంగా చూడాలని ఇస్లామ్ పేర్కొంది.

ఇస్లామ్ కరవాలంతో విస్తరించిందని చాలా మంది అనుకుంటారు. .. నిజమా... అంటే ఆయన ముస్లిమేతరులందరికీ పెద్ద విరోధిగా ఉండాలి. కాని వాస్తవమేమిటి?

మక్కాలో ఆయనపై శత్రువులు హత్యాయత్నానికి పాల్పడినప్పుడు, మక్కా నుంచి మదీనా తరలిపోక తప్పని పరిస్థితిలో, మక్కా శత్రువుల కంటపడకుండా, ఎడారిదారుల్లో మదీనాకు చేరుకోడానికి ఆయన గైడ్ లా నియమించుకున్న వ్యక్తి ఒక ముస్లిమేతరుడే. అప్పటి పరిస్థితిలో, ఆయన తలపై మక్కా శత్రువులు చాలా పెద్ద బహుమతి ప్రకటించిన నేపథ్యంలో ఒక ముస్లిమేతరుడిని పూర్తిగా నమ్మి తనకు గైడ్‌గా నియమించుకుని ఆయన తన సహచరుడు అబూబక్ర్ (రజి)తో కలిసి మదీనా వెళ్ళారు. ముస్లిమేతరులతో ఆయన సంబంధాలకు ఇంతకు మించి ఉదాహరణ కావాలా? హునైన్ యుద్ధంలో సైనిక సామగ్రి తక్కువగా ఉన్నప్పుడు ఆయనకు వంద కవచాలు ముస్లిమేతరుల నుంచే లభించాయి. వంద కవచాలను ఆయన అద్దెకు తీసుకున్నారు.

ముస్లిములు అబిసీనియాకు వెళ్ళేలా ఆయన ప్రోత్సహించారు. అక్కడి రాజు ముస్లిమ్ కాదు. ఈ వైఖరి ప్రవక్త జీవితకాలమంతా కనిపిస్తుంది. ఆయన విశ్వాసం, విలువల ప్రాతిపదికన సంబంధాలు కొనసాగించేవారు. కేవలం మతప్రాతిపదికన కాదు.

ప్రవక్త మదీనాకు రాకముందు మక్కాలో ఉండేవారు. అక్కడ అప్పట్లో దాదాపు అందరూ ముస్లిమేతరులే, బహుదైవారాధకులే. ప్రవక్త కాలంలో పన్నెండు అతి ముఖ్యమైన రాజకీయ, సామాజిక హోదాలు ఉండేవి. మక్కా పరిపాలన ఈ హోదాల వారే నిర్వహించేవారు. ఇవి వారసత్వంగా పన్నెండు ముఖ్యమైన కుటుంబాలకు లభించేవి. ఇందులో కొన్ని కుటుంబాలు ఇస్లామ్ స్వీకరించాయి. ఉదాహరణకు అబూబక్ర్ (రజి) ప్రారంభకాలంలోనే ఇస్లామ్ స్వీకరించారు. తర్వాత ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించారు. ఉస్మాన్ (రజి) కూడా ఇస్లామ్ స్వీకరించారు. ఇలా కొందరు నాయకులు తమ పూర్వీకుల ధర్మాన్ని వదిలి ఇస్లామ్ స్వీకరించారు. కాని వంశపారంపర్యంగా వారికి లభించిన హోదా అలాగే కొనసాగింది. ఎందుకంటే, అరబ్బు తెగలు వారినే తమ వ్యవహారాలు నడపాలని కోరేవి. అందువల్ల ఇస్లామ్ స్వీకరించిన తర్వాత కూడా వీరు తమ తెగల వ్యవహారాలు చూసేవారు. మక్కా నాయకులకు సహకారం అందించేవారు. ఇది మదీనాకు వలసపోయే వరకు కొనసాగింది. అంటే అంత కాలం మక్కా

పరిపాలన ముస్లిమ్, ముస్లిమేతర సంకీర్ణ వ్యవస్థ ద్వారానే నడిచింది. ప్రవక్త ఎల్లప్పుడు స్నేహ పూర్వకమైన, సుహృద్భావ సంబంధాల కోసమే ప్రయత్నించేవారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాల్లో సహకారాన్నే ప్రోత్సహించారు. ఖురైషులు శత్రుత్వం ఉన్నప్పటికి కూడా తమ ప్రయోజనాల దృష్ట్యా వాటినే అనుసరించారు.

ప్రవక్త యుక్త వయస్సు నుంచి భాగస్వామ్య ప్రాతిపదికన వాణిజ్యం నిర్వహించారు. ఆయన మక్కా వ్యాపారుల సరుకులను సిరియా, ఎమన్ తీసుకువెళ్లేవారు. లాభాల్లో వాటా తీసుకునేవారు. హజ్రత్ ఖదీజా (రజి) సరుకులను కూడా ఆయన అలాగే తీసుకెళ్ళారు. ఖదీజాతో వివాహం తర్వాత భార్యా భర్తలిరువురు సంయుక్తంగా వాణిజ్యం నిర్వహించారు. ప్రవక్తగా నియుక్తులైన తర్వాత ఆయన పూర్తికాలం ప్రవక్త విధి బాధ్యతల నిర్వహణకే వెచ్చించేవారు. వ్యాపారం చేసే సమయం ఆయనకు ఉండేది కాదు. అందువల్ల ఆయన తన సరుకులను ముస్లిమేతర ఖురైష్ వ్యాపారులతో పంపేవారు. ఖురైషేతర ఏజంట్లతో కూడా లావాదేవీలు జరిపేవారు. దీనివల్ల ఆయన ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. వ్యాపారం నిమిత్తం ప్రవక్త తన సరుకులను ముస్లిమేతర వ్యాపారి అబూసుఫియాన్‌తో సిరియా పంపారు. గమనించలసిన విషయమేమంటే, ముస్లిము వ్యతిరేక శక్తులకు నాయకుడు అబూసుఫియాన్. ఒక వ్యాపారిగా అబూసుఫియాన్ చాకచక్యంపై, నిజాయితీపై ఆయనకు చాలా నమ్మకం ఉండేది. ప్రవక్త ముహమ్మద్ (స) సత్యసంధత, నిజాయితీ, మంచి వ్యవహారశైలిని అబూ సుఫియాన్ కూడా చాలా ప్రశంసించేవాడు. ప్రవక్త ముహమ్మద్ ఇస్లామీయ సందేశ ప్రచారం గురించి తెలిసినప్పటికీ అబూసుఫియాన్ ఆయనతో వ్యాపార లావాదేవీలు మానలేదు.

ముస్లిమేతరులతో ఆయన సత్సంబంధాల గురించి అనేక ఉదాహరణలు ఆయన జీవితచరిత్రలో కనబడతాయి. మత సహనం సమాజంలో సుహృద్భావ సంబంధాలకు ఎంతో అవసరం. అలాగే సమాజంలో హేతుబద్ధమైన ఆలోచనలు, ఛాందస వాదం ఉంటే సమాజ ప్రగతి కుంటుపడుతుంది. అహేతుక నమ్మకాలను ప్రవక్త (స) ఖండించేవారు.

ప్రవక్త ముహమ్మద్ (స) కుమారుడు ఇబ్రాహీమ్ చిన్నవయసులోనే చనిపోయాడు. ప్రవక్త అత్యంత విషాదానికి గురయ్యారు. అంత్యక్రియలు జరిగి శ్మశానవాటిక నుంచి వెనక్కి వచ్చిన కొన్ని గంటల్లో సూర్యగ్రహణం సంభవించింది. ఆ సూర్యగ్రహణం ప్రవక్త కుమారుడి మరణం వల్లనే వచ్చిందని, ఇదొక మహత్యమని చూసినవాళ్ళు చెప్పుకోవడం ప్రారంభించారు. దేవుడు తన ప్రవక్తకు దీనిద్వారా ఏదో సందేశం ఇస్తున్నాడని కూడా అనుకున్నారు. ఈ అభిప్రాయాలన్నింటినీ ప్రవక్త ఖండించారు. ఆయన గట్టిగా చెబుతూ "సూర్యచంద్రులు రెండు దేవుడి చిహ్నాలు. ఎవరి మరణం వల్లనో వాటి కాంతి తగ్గదు" అన్నారు. ఆ విధంగా ప్రవక్త ఆ సమయంలో కూడా అనుచరులను సరయిన మార్గంలో శిక్షణ ఇచ్చారు. మూఢనమ్మకాలకు గురికాకుండా చేశారు. వ్యక్తిపూజను తీవ్రంగా ఖండించారు.

ఒకసారి ఒక సహచరుడు ఆయనతో "ఇది దేవుడి అభీష్టమైతే.. దైవప్రవక్త అభీష్టమైతే..." అంటూ చెప్పబోయారు. ఒక్కసారిగా ప్రవక్త ముఖంలో కోపం చోటుచేసుకుంది. ఆయన ఈ మాటలు విని చాలా ఆగ్రహించారు.

"నువ్వు నన్ను దేవుడితో సమానంగా చూపాలనుకుంటున్నావా?" అని తీవ్రంగా ప్రశ్నించారు. "దేవుడి అభీష్టమైతే" అని చెప్పు అంతే అన్నారు.

ఆయన ఇంకా ఇలా చెప్పారు: "క్రయిస్తవులు ఏసుక్రీస్తు విషయంలో చేసిన మాదిరిగా నన్ను ప్రశంసించడంలో హద్దులు మీరవద్దు. నన్ను ఒక దాసుడిగా, దైవప్రవక్తగా మాత్రమే పిలవండి.(అంటే దేవుడి కుమారుడు కాదు, దైవిక లక్షణాలు ఏవీ లేవు)" అని ఖచ్చితంగా చెప్పారు.

వ్యక్తిపూజను మొగ్గలోనే తుంచేసిన ఈ మాటలు నేటి సమాజానికి ఎంతో అవసరం.

అందుకే, ఆయన చనిపోయినప్పుడు ఏర్పడిన అత్యంత విషాదకర వాతావరణంలో, హజ్రత్ ఉమర్(రజి) వంటి వాళ్ళు కూడా ఆయన చనిపోయారంటే నమ్మడానికి సిద్ధంగా లేనప్పుడు అబూబక్ర్ (రజి) నిర్ద్వంద్వంగా "ప్రవక్త ముహమ్మద్ (స)ను ఆరాధించేవారెవరైనా ఉంటే తెలుసుకోండి, ఆయన మరణించారు. దేవుడిని ఆరాధించేవారుంటే, దేవుడు నిత్య సజీవుడు" అని ప్రకటించారు.

దుశ్శకునాలను నమ్మడం కూడా బహుదైవారాధనే అంటూ ఖండించారు ప్రవక్త ముహమ్మద్ (స)

సమాజంలో వివిధ సముదాయాల మధ్య సమానత్వం అనేది నాగరిక సమాజాల లక్షణం. కాని చరిత్రలో కొందరిని నీచంగా చూడడం, కొందరిని గొప్పగా చూడడం జరుగుతూ వస్తోంది. ఇలాంటి దురాచారాలను తుడిచేశారు ప్రవక్త ముహమ్మద్ (స)

అమెరికాలో 1960 వరకు సమానత్వం లేదు. బానిసత్వం ఉండేది. బానిసలను అత్యంత అమానుషంగా చూసేవారు. మనదేశంలోను అంటరానితనం ఉండేది. ఇప్పటికీ దళితులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి. ఈ అసమానతలన్నింటిని నిర్మూలించి నిజమైన సమసమాజాన్ని స్థాపించారాయన. ఆయనకు అత్యంత సన్నిహితుడైన అనుచరుడు హజ్రత్ బిలాల్ (రజి) నల్ల బానిస. మరో అనుచరుడు సల్మాన్ ఫార్సీ కూడా బానిసే. హజ్రత్ బిలాల్ (రజి)కు ఇస్లామీయ చరిత్రలో ఎంత గొప్ప గౌరవం లభించిం దంటే, మక్కా విజయం తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) ఆయన్ను పిలిచి కాబాగృహం పైకి ఎక్కి అజాన్ ఇవ్వమని అన్నారు. అలా మక్కా విజయం తర్వాత కాబా పైన నిలబడి అజాన్ ఇచ్చే గౌరవం లభించిందాయనకు. ఖలీఫాగా హజ్రత్ ఉమర్ (రజి) పాలిస్తున్నప్పుడు హజ్రత్ బిలాల్ (రజి) ఎప్పుడు వచ్చినా ఆయన వెంటనే నిలబడి, ఎదురువెళ్ళి చాలా గౌరవంగా స్వాగతించేవారు.

ప్రవక్త ముహమ్మద్ (స) తన వీడ్కోలు ప్రసంగంలో చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హమైనవి:

''ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే, మీ తండ్రి ఒక్కడే. మీరందరూ ఆదమ్‌కు చెందిన వారు. ఆదమ్ మట్టితో చేయబడ్డారు. జాగ్రత్త! ఒక అరబ్బుకు అరబ్బేతరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపై గాని, తెల్లవాడికి నల్లవాడిపై గాని, నల్లవాడికి తెల్లవాడిపై గాని ఎలాంటి ఆధిక్యతా లేదు. ఆధిక్యత కేవలం దైవభీతి ఆధారం గానే. మీలో అందరికన్నా ధర్మపరాయణుడే అత్యుత్తముడు.''

తెల్లవాళ్ళు, నల్లవాళ్ళన్న వివక్షను శతాబ్దాల క్రితమే నిర్మూలించా రాయన. అందువల్లనే మనకు చరిత్రలో బానిస వంశాల పరిపాలన గురించి వస్తుంది. ఈ బానిస వంశాలన్నీ ముస్లిము లకు సంబంధించినవే. బానిసలను చక్రవర్తులుగా నిలబెట్ట గలిగిన ఘనత ఆయన బోధనలదే.

బ్రిటిష్ మాగ్నాకార్టతోనే మౌలిక మానవహక్కుల భావన ప్రపంచానికి పరిచయమైందని పాశ్చాత్య వ్యవస్థ మనల్ని నమ్మమంటుంది. కాని మాగ్నాకార్ట అనేది ఇస్లామ్ వచ్చిన ఆరు వందల సంవత్సరాల తర్వాత వచ్చిన ఒప్పందం. నిజానికి అప్ప ట్లోనే మత, వర్ణ, ప్రాంత, జాతి, తెగ విచక్షణ లేకుండా ప్రవక్త ముహమ్మద్ స్పష్టమైన మానవహక్కుల ప్రకటన చేశారు. మనిషి నడవడిని బట్టి విలువ ఉంటుందని స్పష్టం చేశారు.

''మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగాను, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువగా గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు. సకల విషయాలు తెలిసిన వాడూను.'' (దివ్యఖుర్ఆన్ 49 : 13)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం కేవలం ముస్లిములను ఉద్దేశించింది కాదు, యావత్తు మానవాళిని ఉద్దేశించింది. మానవ సమాన త్వాన్ని నొక్కి చెప్పింది. మనుష్యులంతా ఒకే తల్లిదండ్రుల సంతానమని, వారి మధ్య జాతి, తెగ, ప్రాంత భేదాలన్నీ కేవలం గుర్తింపు కోసం మాత్రమేనని స్పష్టం చేసింది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ మేకల పాలు పితికేవారు. తన పాదరక్షలు స్వయంగా మరమ్మత్తు చేసుకునే వారు. తన దుస్తులకు అవసరమైన మాసికలు తానే వేసుకునే వారు. భోజనానికి కూర్చున్నప్పుడు తన నౌకరును కూడా తనతో కూర్చుండబెట్టుకునేవారు. బజారుకు వెళ్ళి తనకు కావలసినవి తానే స్వయంగా కొనుక్కొని తెచ్చుకునేవారు. తానే స్వయంగా మోసుకుని ఇంటికి వచ్చేవారు. ఎవరిని కలిసినా ముందుగా తానే సలాము చేసేవారు. కరచాలనం చేసేవారు. ఈ విషయంలో చిన్నా పెద్ద, నల్లవాడు, తెల్లవాడు, స్వతంత్రుడు, బానిస అన్న భేదం పాటించేవారు కాదు. తన అనుచరు లందరితో ఒకే మాదిరిగా వ్యవహరించేవారు. ప్రతి చిన్నా పెద్ద పనిలో వారితో పాటు పాలుపంచుకునేవారు.

హక్కుల గురించిన భావనే లేని కాలంలో ఆయన ద్వారా ప్రాథమిక హక్కులను ప్రసాదించింది ఇస్లామ్.

''... ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే, ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే.'' (దివ్యఖుర్ఆన్ 5:32)

''ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమేతర పౌరుడిని ఎవరైనా అణచి వేతకు గురిచేస్తే, తీర్పుదినాన అతడి పక్షాన నేను వాదిస్తాను'' అని ప్రవక్త (స) చెప్పిన మాటలు కూడా ఇక్కడ గమనార్హమైనవి. అలాగే న్యాయం విషయంలో తన పర భేదాలను పాటించకుండా న్యాయాన్ని నిలబెట్టే సమాజాన్ని ఇస్లాం స్థాపించి చూపించింది. ''న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధు వుల హక్కులు నెరవేర్చండి'' అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు.''

(16: 90)

''ప్రజల మధ్య తీర్పు చెప్పే టప్పుడు న్యాయంగా చేయండి''

(నిసా 58)

"(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి చేరువైనది."(అల్ మాయిద 8)

మదీనా రాజ్యానికి ప్రవక్త ముహమ్మద్ ప్రధాన న్యాయమూర్తిగా కూడా వ్యవహరించారు. ఆయన న్యాయపరిపాలనలో అత్యంత పేరుప్రతిష్ఠలు పొందిన పాలకుడిగా పేరు సంపాదించారు. జాతి, మత, వర్గ దురభిమానాలు లేకుండా అందరికీ సమాన న్యాయం అందించారు. న్యాయం విషయంలో ఆయన శత్రువులు, మిత్రులు అన్న భేదం పాటించలేదు.

"విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి, అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే, కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేద లయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు." (దివ్యఖుర్ఆన్ 4:135)

"తూనికలలో, కొలతలలో తగ్గించి ఇచ్చేవారికి వినాశం ఉన్నది. వారు ప్రజల నుండి తీసుకునే టప్పుడు పూర్తిగా తీసుకుంటారు వారికి కొలిచిగాని తూచిగాని ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక మహాదినంనాడు వారు బ్రతికించి తీసుకురాబడనున్నారని వారికి తెలియదా?'" (అల్ ముతఫ్ఫిఫీన్ : 1-5)

"ప్రజలకు వారి వస్తువులను తగ్గించి ఇవ్వకండి." (షుఅరా: 183)

ప్రతి కేసు ప్రవక్త ప్రత్యేకంగానే విచారించేవారు. నిష్పక్షపాతానికి, న్యాయానికి అత్యున్నత ఆదర్శంగా నిలిచారు. ఆయన చెప్పిన తీర్పులు పరిశీలిస్తే న్యాయ వ్యవహారాల్లో ఎంత అవగాహనతో ఆయన వ్యవహరించారన్నది తెలుస్తోంది.

యూదుల నుంచి కప్పం వసూలు చేయడానికి అబ్దుల్లా బిన్ సెహీ ఖైబర్ వెళ్ళారు. అక్కడ ఆయన హత్య జరిగింది. ఆయన మృతదేహాన్ని ఆయన సోదరుడు చూశారు. ఆయన ప్రవక్త వద్దకు వెళ్ళి యూదులపై ప్రతీకారం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ప్రవక్త అతడితో "యూదులే మీ సోదరుడిని హత్యచేశారని ప్రమాణం చేయగలరా?" అని ప్రశ్నించారు. అతను జవాబిస్తూ హత్య జరగడాన్ని తాను ప్రత్యక్షంగా చూడలేదని చెప్పాడు. అలా అయితే యూదులను ప్రమాణం చేయమని అడుగుదాం అన్నారు ప్రవక్త. ముహీసా మాట్లాడుతూ "వారి ప్రమాణాన్ని ఎలా నమ్మగలం? వారు అబద్ధపు ప్రమాణాలు వందసార్లయినా చేయగలరు" అన్నాడు. నిజానికి ఖైబర్‌లో యూదులు తప్ప మరెవ్వరూ నివసించడం లేదు. అబ్దుల్లాను చంపింది యూదుల్లో ఎవరో ఒకరు తప్ప మరొకరు కాదన్నది స్పష్టంగా తెలుస్తున్న వాస్తవం. కాని ప్రత్యక్షసాక్షులు లేరు. ప్రవక్త యూదులపై ఆరోపణకు స్పందించలేదు. ప్రభుత్వ ధనాగారం నుంచి ఆ హత్యకు పరిహారం చెల్లించారు.

తారిక్ ముహార్బి ప్రకారం ఒకసారి ప్రవక్త ముహమ్మద్ ప్రసంగి స్తున్నారు. మస్జిదులో బనీ తలాబా తెగను చూసిన ఒక అన్సారీ (మదీనా ముస్లిమ్) లేచి "ప్రవక్తా! వీళ్ళు బనీ తలాబా తెగ వాళ్లు, వాళ్ళ పూర్వీకులు నా కుటుంబ సభ్యులను హత్యచేసారు. దానికి ప్రతీకారంగా వారిలో ఒకడికి మరణశిక్ష విధించండి." అన్నాడు. ప్రవక్త జవాబిస్తూ "తండ్రిపై పగను కొడుకుపై తీర్చుకో లేము" అన్నారు. ఈ విధంగా ప్రవక్త న్యాయం విషయంలో దృఢంగా నిలబడి ఒక గొప్ప ఉదాహరణ ఇచ్చారు. తన స్వంత ప్రయోజనాలైనా, తనకు దగ్గరవారి ప్రయోజనాలైనా వేటినీ ఆయన న్యాయం ముందు లెక్కచేయలేదు. తన దగ్గరకు వచ్చిన కేసు మిత్రులు తెచ్చినదైనా, శత్రువులు తెచ్చినదైనా న్యాయబద్ధంగా తీర్పులు చెప్పారు.

ప్రవక్త ఇలా అన్నారు: "న్యాయమూర్తులు మూడు విధాలుగా ఉంటారు. ఒక రకం స్వర్గంలో, మరో రకం నరకంలో ఉంటారు. సత్యాన్ని గుర్తించి ఆ ప్రకారం తీర్పు చెప్పేవారు స్వర్గంలోను, సత్యాన్ని గుర్తించినా అన్యాయంగా తీర్పు ఇచ్చేవారు నరకం లోను, అజ్ఞానంతో ప్రజలపై తీర్పులు జారీచేసేవారు కూడా నరకంలోనే ఉంటారు."

ఇంకా ఆయన ఇలా అన్నారు: "ఆగ్రహంలో ఉన్నప్పుడు న్యాయ మూర్తి తీర్పు చెప్పరాదు."

ఇస్లామ్‌లో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, పాలనా వ్యవస్థకు సంబంధం లేకుండానే వ్యవహరిస్తుంది. న్యాయమూర్తి ఇస్లా మీయ చట్టం షరీఅత్‌ను అమలు చేయడానికి మాత్రమే బాధ్యుడు. ఎలాంటి భయం పక్షపాతం లేకుండా ఆ విధిని నిర్వర్తించాలి. ఆయన అధికార పీఠానికి జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదు. కేవలం దేవుడికి మాత్రమే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. ఇలా స్వతంత్రమైన న్యాయవ్యవస్థ ఉండడం అన్నది ఇస్లామీయ షరీఅత్ ఖచ్చితంగా అమలు కావడానికి తోడ్పడింది. స్వతంత్ర న్యాయ వ్యవస్థను ప్రారంభించిన ఘనత ఇస్లాముకే దక్కుతుంది.




ఎస్.ఎమ్. మలిక్

**దివ్య కుర్‌ఆన్**లో ప్రవక్త ముహమ్మద్(స)ను సంబోధించిన సందర్భాలలో రెండు-

ముహమ్మద్! చెప్పివెయ్యి, 'నేనయితే ఒక మానవ మాత్రుణ్ణి. మీ వంటి వాణ్ణి. నా వద్దకు వహీ (దైవవాణి) పంపడం జరుగుతుంది- మీ దేవుడు ఒక్కగానొక్కడే దైవం అని. కాగా ఎవరయితే తన ప్రభువును కలుసుకోవడాన్ని ఆశిస్తున్నాడో అతను సదాచరణను అవలంబించాలి. మరి దైవదాస్యంలో తన ప్రభువుతోపాటు మరెవరినీ చేర్చరాదు'. (అల్ కహ్ఫ్ : 18: 110)

వాస్తవానికి దైవ సందేశహరునిలో మీ కొరకు ఒక ఉత్కృష్ట మయిన ఆదర్శముంది. (అల్ అహ్జాబ్- 23: 21)

### మానవ మాత్రుడు

ఈ వచనాలలో ప్రకటించిన విషయాలు; ఒకటి, ముహమ్మద్ ప్రవక్త ఓ సాధారణ మనిషి అని, ఆయన ఏదో పౌరాణిక వ్యక్తి కాదు, చారిత్రక వ్యక్తి. ఆయన సమస్త మానవుల్లా ఓ మానవుడే. అయితే ఆయన వద్దకు దైవవాణి వస్తుంది గనక ఆయన దైవ సందేశహరుడుడయ్యారు. లోగడ కూడా మానవ సముదాయాలు ఏర్పడిన ప్రతి చోటా, ప్రతి ప్రాంతంలో దైవం తన సందేశాన్ని ప్రజలకు అందజేయడానికి, ఆయా ప్రజలలో నుంచే ఒకరిని ఎన్నుకుని వారి ద్వారానే ప్రజలందరికీ ధర్మమార్గబోధన చెయ్యటం జరిగిందని చరిత్ర సాక్ష్యం పలుకుతుంది. దైవిక గ్రంథాలూ దీనికి సాక్షీభూతమయి నిలిచాయి. అయినా ఎన్నికయినవారు ఎవ్వరూ అవతార పురుషులూ కారు, దైవాంశ సంభూతులూ కారు. మానవ మాత్రులు. మహనీయ ముహమ్మద్ కూడా అలాంటి మానవుడే. దైవ సందేశహరులు!

క్రీ.శ 571 ఏప్రిల్ 22న అరేబియా ఎడారి నేల, అతి ప్రాచీన నగరం మక్కాలో అబ్దుల్లాహ్, ఆమినా అనే దంపతులకు పుట్టిన అబ్బాయే ముహమ్మద్(స). పుట్టుకకు కొన్నాళ్ళ ముందు తండ్రి, పుట్టిన తరువాత కొన్నేళ్ళకు తల్లినీ కోల్పోయిన అనాథ బాలుడాయన. చిన్నప్పుడు మేకల్ని కాసిన కాపరి, ఎటువంటి అక్షరభ్యాసమూ జరగలేదు, నిరక్షరాసి ముహమ్మద్. అందువల్ల

ఏ పుస్తక పఠనమూ, తాత్విక, దైవిక గ్రంథాలూ చదివి ఎరుగడు. బాల్యం సాధారణ అరబ్బు బాలుర వలెనే సాగింది. అనాథ కావటాన తొలుత తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్, ఆయన తరువాత పెత్తండ్రి అబూ తాలిబ్ పెంపకంలో ఎదిగిన వ్యక్తి ముహమ్మద్.

## శాంతికాముకుడు

పన్నెండేళ్ళ ప్రాయంలో ప్రేమతో పెంచుతున్న పెత్తండ్రి వెంట వ్యాపార బృందంతో కలసి సుదీర్ఘ ప్రయాణాలు చేశారు. అరబ్బుల సాధారణ వృత్తి వ్యాపారంలో అనుభవం గడించారు. మంచి వ్యాపారవేత్తగా పేరుగన్నారు. ముహమ్మద్ సహజంగా స్ఫురద్రూపి, మేధా సంపన్నుడు, వివేచనా తత్పరుడు. వ్యాపారంలో, నలుగురితో మసలుకుంటూ సత్యసంధుడు (సాదిక్) అని, నిజాయితీపరుడు (అమీన్) అనీ అరేబియా అంతటా పేరు గడించారు. ఆయన వ్యాపార దక్షత, నిజాయితీ తత్పరతను గురించి విన్న ఓ ఉన్నత కుటుంబీకురాలు, సంపన్నురాలూ అయిన 'ఖదీజా' అనే వితంతువు తన వ్యాపారాన్ని ఆయనకు అప్పగించారు. ఇంకా ఆయనతోపాటు తన నౌకరును సయితం వెంట పంపించారావిడ.

ఇరువయ్యేళ్ళ వయసులోనుండగా, మక్కా నగరంలో ఓ కలహం కారణంగా కొందరు పెద్దలు కలిసి ఓ ప్రమాణం లేదా ఒప్పందం చేసుకున్నారు. ఆ సందర్భంలో ముహమ్మద్ తానూ ఆ ఒప్పందంలో పాల్గొన్న దూరదృష్టి గల మేధావి. ఆ ఒప్పందంలోని అంశాలు-

➢ బాధితులు ఎవరయినా, తమ వారయినా పరాయి వారయినా వారిని ఆదుకోవాలి.

➢ హక్కులు కోల్పోయినవారు ఎవరయినా సరే, వారికి వారి హక్కులు ఇప్పించాలి.

➢ అత్యాచారుల్ని, వారెవరయినా, దౌర్జన్యం జరపకుండా నిరోధించాలి.

➢ ఆర్థికంగా ఇబ్బందులకు గురయినవారికి, వారెవరయినా, సహాయపడాలి.

➢ ఈ ఆశయాల సిద్ధికి, సమైక్య కృషి సలపాలి, ఎటువంటి త్యాగానికయినా వెరువరాదు.

ఈ ఆశయాలకు కట్టుబడి ఉండేందుకు చేసిన ప్రమాణం లేదా ఒప్పందం ''హిల్ఫుల్ ఫుజూల్'' (పెద్దల ఒప్పందం)ని గుర్తుంచుకుని, తాను పెద్దవారయిన తరువాత కూడా అటువంటి మరే ఒప్పందానికయినా తాను సదా సన్నద్ధమే అని పలికిన శాంతికాముకుడు.

## వివేచనా ధురంధరుడు

మక్కా నగరంలో అప్పటికే దాదాపు రెండున్నర వేల సంవత్సరాల ప్రాచీన మహనీయ ఇబ్రాహీమ్(అ), ఆయన తనయుడు మహనీయ ఇస్మాయీల్ కలసి కట్టిన దైవ గృహం కాబా పడిపోతుందో ఏమో అన్న సంశయంతో దాన్ని పునర్నిర్మించాలని పెద్దలు నిర్ణయించడం వల్ల దాన్ని పడగొట్టి నిర్మాణ కార్యం మొదలెట్టారు జనులు. అప్పుడు ముహమ్మద్ అందరితో కలసి రాళ్ళు మోసారు. ఆ కట్టడంలో, తొలి నాటినుంచి ఓ మూలన ఓ నల్లని రాయి (హజ్రె అస్వద్) ప్రత్యేకంగా ఉంటుంది. నిర్మాణ కార్యక్రమంలో ఆ రాయి అమర్చవలసిన స్థాయి వచ్చినప్పుడు దాన్ని అమర్చే మహత్తును తమ స్వంతం చేసుకోవాలని మక్కా తెగల నాయకులందరూ తామంటే తాము అని ముందుకు వచ్చారు. ఆ వాదులాట బాగా పెరిగి జనం కత్తులూ కటారులూ బయటికి తీసి రక్తపాతం మొదలయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయిదు రోజుల వరకు కొనసాగిన ఈ జగడం అయిదవ రోజున ఒక పెద్ద మనిషి సలహాతో కాస్త నెమ్మదించింది. ఆ సలహా ప్రకారం 'కాబా' ప్రాంగణంలో ఆ రోజు తొల్దొలిగా ప్రవేశించే వ్యక్తి ఇచ్చే పరిష్కారానికి అందరూ సమ్మతించాలని నిర్ణయించుకుని ప్రాంగణ ద్వారాన్ని తదేకంగా చూస్తూ కూర్చున్నారు అందరూ. అప్పుడు ప్రవేశించారు ముహమ్మద్(స).

ముహమ్మద్(స)కు విషయమంతా వివరించి పరిష్కారం చూపమని అభ్యర్థించారు వారు. దానికి ఒక్క నిముషం ఆలోచించి, ఓ పెద్ద దుప్పటిని తెప్పించారు. దుప్పటి వచ్చిన తరువాత తెగల నాయకులందరినీ ఆ దుప్పటిని చుట్టూత పట్టుకోమని కోరారు. రాయిని ఆయన స్వయంగా తెచ్చి ఆ దుప్పటి మధ్యన పెట్టారు. ఇక అందరూ కలసి దుప్పటిని రాయి అమర్చవలసిన చోటికి లేవనెత్తమన్నారు. అప్పుడు దాన్ని తాను తన చేతులారా గోడలో అమర్చవలసిన చోట పెట్టారు. అలా సకల తెగలు ఆ రాయిని అమర్చిన ఘనతకు నోచుకున్నాయి; రక్తపాతం వరకు కొనసాగిన తగవులాట ఆయన చాకచక్యం వల్ల శాంతియుతంగా ముగిసింది. అప్పటికి ఆయన వయసు 35 ఏళ్లే. దైవదౌత్య ప్రకటనకు అయిదేళ్ళు ముందు!

## వహీ అవతరణ

కొన్నాళ్లుగా ముహమ్మద్(స) దైవధ్యానం నిమిత్తం, మక్కా నగరానికి వెలుపల, దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరాన ఓ

కొండ గుహ, హిరాలో గడపడం మొదలెట్టారు. అలా గడుపుతూ ఉండగా ఓ రేయిన ఆయనకు దైవవాణి అందజేయడం జరిగింది. ఆయన్ని దైవం తన సందేశహరునిగా నియమించిన యదార్థమూ తెలుపడం జరిగింది. ఆయన భయాందోళనలకు గురయి తన జీవన సహచారి, 15 ఏళ్లుగా తన మంచీ చెబ్బరలు ఎరిగిన మహిళ, ఖదీజా గారికి అంతా వివరించి తనకు ప్రాణ భయం కలుగుతుందని చెప్పుకున్నారు. ఆ సందర్భంలో ఆవిడ గారు చెప్పిన మాటలు చరిత్ర నమోదు చేసింది-

- ఎంత మాత్రం వీల్లేదు, దైవం మీద ఒట్టు. ఆ స్వామి మిమ్మల్ని వృధా పోనివ్వడు,

- మీరు బంధువుల్ని ఆదరిస్తారు, వారి హక్కుల్ని నిర్వర్తిస్తారు

- అనాథల్ని మీ సంపాదనతో ఆదుకుంటారు

- అతిథులకు మర్యాదలు చేసి గౌరవిస్తారు

- అవసరార్థులకు చేయూతనందజేస్తారు

మీ వంటి వారిని దైవం వృధా పోనిస్తాడా?"

## ఆయన సందేశం

దైవ సందేశహరునిగా ఆయన అందజేసిన సందేశం-

- దేవుడు ఒక్కడే, ఆయనే ఆరాధనలకు, సకల విధేయతలకు ఏకైక కేంద్రం. ఆయన తప్ప వేరెవరూ ఆరాధనకు అర్హులు కారు.

- తాను (ముహమ్మద్) ఆ దేవుని ప్రవక్త, సందేశహరుడు.

తొలి దైవప్రవక్త ఆదమ్(అ) మొదలుకుని లక్షా ఇరువయి నాలుగు వేల మంది ప్రవక్తలు, అందరూ దైవం తరపున అందజేసిన సందేశమే ఆయన అందజేశారు. దేవుడు ఒక్కడే గనక ఆయన సందేశమూ ఒక్కటే కాగలదు. అందరూ బోధించిన ధర్మమూ ఒక్కటే! అదే- దైవ విధేయతా ధర్మం, దైవం సమక్షంలో సర్వం అర్పించుకునే ధర్మం-

ఇస్లామ్! ఇస్లామ్ అంటే దైవానికి సర్వం సమర్పించుకోవడం తప్ప మరేమీ కాదు!!

## నిరక్షరాశి!

దివ్యకుర్ఆన్ ఆయన్ని "నబియ్యున్ ఉమ్మీ" అని ప్రస్తావిస్తుంది. 'ఉమ్మీ' అన్న దానికి చదవనూ వ్రాయనూ నేర్చుకోని వారని భావం. ఈ అర్థంలో ఆయన 'అక్షరాస్యత' తెలియని వారని అర్థం. అందువల్లనే 'హిరా' గుహలో దైవదూత 'చదువు' అని కోరినప్పుడు తనకు చదవను రాదు అని బదులిచ్చారాయన! ఆ నిరక్షరాసి-

- దివ్య కుర్ఆన్ వంటి అపురూప గ్రంథాన్ని అందజేశారు.

- అది దాని సాహితీ ప్రకర్ష మూలంగానే కాదు..

- దాని విషయ వైవిధ్యం దృష్ట్యా మాత్రమే కాదు...

- భాష, భావ ప్రకటనా శైలి రీత్యా కూడా

- అనన్యమయినది,

- అద్భుతమయినది

- అపురూపమయినది!

1500 ఏళ్ళ క్రితమే అది ఛాలెంజి చేసింది-

- దాని వంటి ఒక్క సూరా-

- పోనీ... ఒక్క వచనం- ఎవరయినా రచించి చూపమని!

- ఆ ఛాలెంజి నేటికీ ఛాలెంజిగానే మిగిలిపోయింది!!

ఆ గ్రంథం, దివ్య కుర్ఆన్, కాగితం ముక్కలేని 1500 ఏళ్ళ క్రితం అవతరించింది. నేటివరకు పొల్లుపోకుండా సురక్షితంగా ఉంది.

ఆయన జీవన చరిత్ర, జీవిత వివరాలు, విశేషాలు నేటికీ భద్రంగా, సురక్షితంగా, కొన్ని సంఘటనలు కళ్ళకు కట్టినట్టుగా విశదంగా దర్శనమిస్తాయి.

ఆయన జీవితంలో ఎప్పుడు, ఎక్కడ ఏమి సంభవించిందో- ఎవరయినా తెలుసుకోగోరితే ప్రతి ఒక్క చర్య, ప్రతి సంఘటన భద్రంగా పొందుపరచబడి ఉంది. వివరంగా నమోదయి ఉంది.

## సంస్కర్త

ఆ నిరక్షరాసి-

- ఒక అత్యంత అనాగరిక జాతిని- నాగరికతా భేషజాలకు, సభ్యతా సంస్కృతులకు, ఆనవాలుగా మైలురాయిగా మలిచాడు.

- ఒక అసంఘటిత ప్రజా మూకను- సుసంఘటిత సామ్రాజ్యానికి అధినేతలుగా, సువిశాల భూభాగానికి విజేతలుగా తీర్చిదిద్దాడు.

- నిరక్షరాస్యతతో, అవిద్య, అనాగరికతతో మగ్గుతున్న ప్రజల్ని, ఆ ప్రదేశాన్ని నాగరికతకు మారు పేరుగా, విద్యకు, శాస్త్రీయ పరిశోధనలకు ఆలవాలంగా రూపొందించాడు.

మిగతా 19వ పేజీలో...




**ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**ఇస్లాం**కు పూర్వ అరేబియా అన్యాయం, అజ్ఞానం, అసమానత్వం, స్త్రీలపై దౌర్జన్యం, బలవంతుల అణచివేతలతో నిండిపోయిన చీకటి యుగం. మానవత్వం తన విలువ కోల్పోయి, బలహీనుల అర్తనాదాలు వినిపించని కాలం అది. బలవంతులు బలహీనులను అణగదొక్కేవారు. స్త్రీలు హక్కుల్లేని స్థితిలో ఉండేవారు. ఆడబిడ్డ పుడితే సజీవంగా పాతిపెట్టేవారు. సమాజంలో సమానత్వం, మానవ హక్కులు అనే భావనలు సైతం లేవు. అటువంటి చీకటి కాలంలో ముహమ్మద్ ప్రవక్త (స) వెలుగునిచ్చే దీప స్తంభంలా ప్రభవించారు. మానవాళి విమోచకుడిగా, న్యాయం, సమానత్వం, దయ, కరుణలకు ప్రతిరూపంగా ముహమ్మద్ ప్రవక్త (స) జన్మించారు. ఆయన ప్రభవనంతో సమాజంలో వెలుగులు ప్రసరించాయి. అన్యాయం మీద తిరుగుబాటు, అణగారిన వారికి ఆధారం, స్త్రీలకు గౌరవం, బానిసలకు విముక్తి, ఇవన్నీ ఆయన తెచ్చిన మార్పులు. ఆయన జీవితమే మానవ హక్కులు, సమానత్వపు న్యాయ విప్లవం.

**ఆయన సందేశం ఇదే** : 'మానవులందరూ దేవుని దృష్టిలో సమానులే, ఎవరికీ ఎవరిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. దైవభీతి కలవారే దైవానికి ప్రీతిపాత్రులు.'

## హక్కుల ప్రదాత

మహిళలకు ఆయన ఇచ్చిన గౌరవం విప్లవాత్మకం. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందని ప్రకటించారు. ఆడపిల్ల పుట్టడాన్ని శాపంగా కాక శుభప్రదంగా పేర్కొన్నారు.

బానిస వ్యవస్థను రద్దుచేసే మార్గంలో ఆయన చేసిన కృషి చరిత్రాత్మకం. బానిసను సోదరుడిగా చూడమని, వారిని విముక్తం చేయడం గొప్ప పుణ్యమని బోధించారు.

ప్రవక్త(స) సమాజంలో న్యాయం నెలకొల్పడానికి అద్భుతమైన సూత్రాలు చెప్పారు. 'ఒక అరబ్బుకు అరబ్బేతరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపై కాని, నల్లజాతి వాడికి, తెల్లజాతివాడిపై కాని, తెల్లజాతి వాడిపై నల్లజాతి వాడికి గాని ఎటువంటి ప్రాధాన్యత లేదు. దైవభీతి, విలువల పరంగా తప్ప. మానవులంతా ఒక్కటే. అందరూ ఆదం సంతానమే. ఆదమ్ మట్టితోనే సృష్టించబడ్డారు' అని ఆయన స్పష్టం చేశారు.

ఆయన విప్లవం కేవలం మతపరమైనది కాదు. సామాజిక,

రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటినీ అది పరివేష్టించి ఉంది. దోపిడీ, అన్యాయం, అణచివేతలపై తిరుగుబాటు ఆయన బోధనల్లో ప్రతిధ్వనించింది.

ముహమ్మద్ ప్రవక్త (స) కేవలం ఆధ్యాత్మిక నాయకుడే కాదు, సమాజ నిర్మాత కూడా. ఆయన మదీనాలో స్థాపించిన రాజ్యాంగం మానవ చరిత్రలో తొలి లిఖితబద్ధమైన సామాజిక ఒప్పందం. దీన్నే మదీనా రాజ్యాంగం/ సహీఫతుల్ మదీనా అని కూడా అంటారు. 7వ శతాబ్దిలో దైవప్రవక్త ముహమ్మద్ (స) మదీనాకు వలస వచ్చిన తర్వాత, అక్కడ ఉన్న తెగలు, ముస్లింలు, యూదుల మధ్య ఒక సామాజిక, రాజకీయ ఒప్పందం కుదరడానికి ఈ పత్రాన్ని రచించారు. ఇది మానవ చరిత్రలో మొట్టమొదటి లిఖిత రాజ్యాంగంగా పరిగణించబడుతుంది.

ఇందులో ముస్లింలు, యూదులు, ఇతరులందరికీ సమాన హక్కులు కల్పించారు. భిన్న మతాలు, వర్గాలు కలిసికట్టుగా జీవించగలరని ఆయన ఆచరణలో నిరూపించారు. ఇది ఆధునిక ప్రజాస్వామ్య భావనకు పునాది.

సమాజంలో ధనవంతుడు పేదవాడిని, శక్తివంతుడు బలహీనుడిని, పురుషుడు స్త్రీని, పాలకుడు ప్రజలను సమానంగా చూడాల్సిందేనని ప్రవక్త(స) బోధించారు. దైవప్రవక్త (స) సమాజంలోని పేదలు, బలహీనులు ఆర్థికంగా వెనుకబడకుండా ఉండేలా ప్రత్యేకంగా శ్రద్ధ చూపారు. వడ్డీ (రిబా) ని ఆయన నిషేధించారు, ఎందుకంటే అది ధనవంతుల దోపిడీకి సాధనం. జకాత్, సదఖా వంటి వ్యవస్థలు పేదలకు భరోసా కల్పించాయి. సంపద కేవలం కొద్ది మందికే పరిమితం కాకుండా సమాజంలో సమానంగా ప్రవహించాలని ఆయన సూచించారు. ఇది నేటికీ ఆర్థిక న్యాయం కోసం ప్రేరణాత్మక మోడల్.

మానవ హక్కుల చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్రకటన ఆయన గారి చివరి హజ్ ప్రసంగం. అందులోనే నేటి మానవ హక్కుల చార్టర్‌కు బీజాలు ఉన్నాయి.

దైవప్రవక్త ముహమ్మద్ (స) బోధనలలోని మరో ప్రధాన అంశం సామరస్యత. ఆయన యుద్ధాన్ని కాక, శాంతిని ప్రోత్సహించారు. వివాదాలు, ఘర్షణలను చర్చలు, సంప్రదింపులతో పరిష్కరించుకోవాలని, క్షమ దయలతో ముందుకు సాగాలని పాఠాలు చెప్పారు. ప్రతీకారం కాకుండా క్షమ అనేది మానవ హృదయాన్ని గెలుచుకునే శక్తివంతమైన ఆయుధమని ఆయన ఆచరణాత్మకంగా నిరూపించారు.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన బోధనలు కేవలం ముస్లింలకే పరిమితం కావు. అవి మానవాళి మొత్తానికీ వర్తిస్తాయి. ఆయన సందేశం, ధర్మం, జాతి, వర్గం, వర్ణం, సరిహద్దులను దాటి విశ్వ వ్యాప్త మానవ విలువలుగా నిలిచాయి. అందుకే ఆయనను ముస్లింలు మాత్రమే కాకుండా ప్రపంచంలోని అనేకమంది మానవతావాదులు కూడా గౌరవిస్తారు.

ఇస్లామీయ నాగరికత ఆయన చూపిన మార్గం వల్లే అభివృద్ధి చెందింది. విజ్ఞానం, వైద్యశాస్త్రం, తాత్త్విక ఆలోచనలన్నీ ఆయన బోధనల ప్రభావంతోనే పెరిగాయి. మానవ హక్కులు, సమానత్వం, న్యాయం అనే విలువలు ఆధునిక ప్రపంచానికి పునాది కావడానికి ఆయన సందేశం ఒక ప్రధాన మూలం అయింది.

## ప్రవక్త బోధనల ప్రాధాన్యం

ఈ రోజు ప్రపంచం మరోసారి అన్యాయం, అసమానత్వం, హింస, వివక్షలతో నిండిపోయింది. జాతి, వర్ణం, మతం, లింగం పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. ధనం, శక్తి, అధికారాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమై మానవాళి మళ్లీ దోపిడీకి గురవుతోంది. ఇలాంటి సమయంలో దైవప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు మరింత ప్రాసంగికం అవుతున్నాయి.

❖ ఆయన బోధనలు మనకు చెబుతున్నదేమిటంటే, న్యాయం లేకపోతే సమాజం నిలవదు.

❖ బలహీనులకు ఆధారం లేకపోతే మానవత్వం చనిపోతుంది.

❖ స్త్రీలకు గౌరవం ఇవ్వని నాగరికత ఎప్పటికీ నిలవదు.

నేడు మనం ఎదుర్కొంటున్న ఈ సమస్యలు, సమాజంలో విభజనలు, ద్వేషం, హింస, బలవంతుల దాష్టీకాలు, అణచివేత, అసమానత అన్నింటికీ పరిష్కారం ఆయన చూపిన మానవతా బోధనలలోనే దాగి ఉంది. మనం వాటిని అనుసరిస్తేనే సమానత్వం, శాంతి, సోదరభావం కలిగిన సమాజాన్ని నిర్మించుకోగలుగుతాము.

సీరతున్నబీ సందర్భంగా మనం జరుపుకోవలసింది కేవలం సభలూ, సమావేశాలూ, ర్యాలీలు కాదు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి సమాజాన్ని మార్చే సంకల్పం చేసుకోవాలి. ప్రతి ఒక్కరికి న్యాయం, ప్రతి ఒక్కరికి గౌరవం, ప్రతి ఒక్కరికి హక్కులు కల్పించే సమాజాన్ని నిర్మించడం ద్వారానే దైవ ప్రవక్త(స)కు నిజమైన వారసులం అనిపించుకోగలుగుతాము.

❁



# మహా గొప్ప మానవ సేనాని మహనీయ ముహమ్మద్(స)

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా, శుభవార్త అందజేసే వానిగా, భయపెట్టేవానిగా, దేవుని ఆజ్ఞతో ఆయన వైపున సందేశం అందజేసేవానిగా, వెలుగుతున్న దీపంగా చేసి పంపాము. కనుక విశ్వసించిన వారికి అల్లాహ్ తరపున గొప్ప అనుగ్రహం కలుగు తుందని శుభవార్త విన్పించు.**
**(అల్-అహ్ జాబ్: 45 - 47)**

ఈ వ్యాసాన్ని రాయడానికి ప్రధాన ప్రేరణ- మహనీయ మహమ్మద్ బిన్ అబ్దుల్లా వారి జీవితం గురించి చాలా తక్కువ సత్యాలే మన వరకు చేరాయి. దురదృష్టవశాత్తూ, ఆయన జీవిత చరిత్రను వికృతరూపంలో వక్రీకరించి, అసత్య ప్రచారాల ద్వారా చూపించే ప్రయత్నమే అధికంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి లోనూ జరిగింది. కానీ ఈ మహోన్నత దైవప్రవక్త, దైవ సందేశాన్ని మానవాళికి అందించేందుకు అల్లాహ్ ప్రత్యేకంగా ఎన్నుకున్న నైతిక శిఖరాగ్రం. ఆయన స్వయంగా దేవుడే రూపొందించిన ఆకాశ ప్రణాళికను మానవుల మధ్య అమలు చేయడానికి నియమించబడ్డ ప్రతినిధి. ఆయన ఒక సమగ్ర మార్గదర్శకుడిగా మాత్రమే కాకుండా, ఒక సమర్థవంతమైన నాయకుడిగా, ఒక గొప్ప ఆర్థికవేత్తగా, ఒక ఆదర్శ రాజకీయ పండితునిగా, ఓ గొప్ప సేనాధిపతిగా ఒక అసాధారణ సామాజిక సంస్కర్తగా దర్శనమిస్తారు. ఆయన జీవితపు అన్ని రంగాలను, ఆయన ఆర్థిక పరిపాలనా విధానాన్ని విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరయినా పైకి దృష్టిని సారిస్తే అతనికి అన్ని వైపులా ఆకాశమే ఉన్నట్లు కానవస్తుంది. అలాగే మానవ జీవితంలో ఏ వైపు చూసినా, ఏ కోణాన్ని శోధించినా మానవ సేనాని ముహమ్మద్(స) వేసిన ప్రభావాలు స్పష్టంగా గోచరిస్తాయి. నేడు ఏ ఉన్నత విలువలకు, శ్రేయోసాఫల్యాలకు ప్రాధాన్యం ఇవ్వబడుతోందో అవన్నీ ఆయన(స) తెచ్చిన విప్లవం యొక్క ప్రత్యక్ష పరోక్ష ఫలితాలే. మత సంస్థల్లో వ్యక్తిపూజ బదులు దైవపూజను నెలకొల్పినదెవరు? విశ్వాసాలకు అనుమానాలు, మూఢత్వాల

స్థానే సత్య ప్రాతిపదికను కల్పించిందెవరు? శాస్త్రీయ రంగంలో ప్రకృతి పూజకు బదులు ప్రకృతిని జయించే పాఠం నేర్పిందెవరు? రాజకీయాలలో అనువంశిక రాజరికాల బదులు ప్రజాపరిపాలనా విధానానికి మార్గం చూపిందెవరు? విజ్ఞాన జగత్తులో ఊహలకు బదులు వాస్తవిక దృష్టి అనే ఉరవడిని ప్రసాదించిందెవరు? సామాజిక వ్యవస్థకు అన్యాయం బదులు న్యాయం ప్రాతిపదికను సమకూర్చి పెట్టిందెవరు? ఇవన్నీ మానవుడికి ఇస్లాం ప్రవక్త ద్వారానే లభించాయని సమాధానం వస్తుంది.

ఆయన మకుటం లేని మారాజుగా, సంపదలేని మహారాజుగా, రాజమహల్ ఎరుగని పాలకునిగా జీవితం గడిపారు. దైవప్రవక్త మరణించిన రోజున ఆయన ఇంట్లోని దీపంలో కనీసం నూనె కూడా లేదు. అందుకే గొప్ప వ్యక్తిత్వం కలిగిన, స్వార్థరహితుడైన సంక్షేమ రాజ్య స్థాపకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారు. ప్రవక్త ముహమ్మద్(స) ఒక ఆదర్శవంతమైన సత్య విప్లవ నాయకుడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శ జీవితం ఒక్క పరలోక సాధనకే మార్గదర్శనం కాదు, ఈ లోకంలో విజయ వంతమైన, సమగ్ర జీవితం గడపాలనుకునే ప్రతి మనిషికి ఉత్తమ మార్గదర్శకంగా నిలుస్తుంది. ఆయన ఒక ధార్మిక మార్గదర్శి మాత్రమే కాదు, ఒక విశ్వసనీయ పాలకుడు, ఆదర్శ సేనాని.

ఆదర్శ సేనాని ఎలా ఉండాలి? అతను ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా తన జాతిని సరిదిద్దాలనే, సంస్కరించాలని సత్సంకల్పంతో ముందుకు సాగుతాడు. కాలగమనంలో అతని ఆలోచనలు, ఆచరణలు, నాయకత్వ శైలి ఎప్పటికీ చెరగని ముద్రవేస్తాయి. అచ్చం అలాగే మహనీయ ముహమ్మద్(స) ఎన్నో ఉత్తమ లక్షణాలను తన జీవితంతో మన ముందు ప్రదర్శించారు. ఉదాహరణకు -

### 1. అపూర్వమైన ప్రేమ, దయ, సహానుభూతి

ఒక గొప్ప సత్య సేనానికి గుండెల్లో తన ప్రజల పట్ల ప్రేమ ఉండాలి. ప్రవక్త ముహమ్మద్(స) దయానిధి, శాంతి దూత. చిన్నవారి యెడల అమిత వాత్సల్యం కలవారు. పెద్దవారినీ, బలహీనులనూ ఆదరించే, గౌరవించే, ఆదుకునే, ఆశ్రయం కలిపించే హృదయం ఆయనది. ఖుర్ఆన్ ఆయన గురించి ఇస్తున్న సాక్ష్యం.

(ప్రజలారా!) మీలో నుండే మీ దగ్గరకు దైవప్రవక్త వచ్చాడు. మీరు నష్టపోవడం అతనికి ఎంతో బాధగా ఉంటుంది. మీ శ్రేయస్సునే అతను ఎక్కువగా కోరుకుంటున్నాడు. విశ్వాసుల పాలిట అతను ఎంతో ప్రేమమూర్తి, దయామయుడు. (సూరహ్ తౌబా: 9:128) ఇలాంటి సద్గుణాలు గల, దయ గల హృదయం ఉన్న సేనాని మాత్రమే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవగలడు.

### 2. ధైర్యం, సాహసం, శ్రమశీలత

ప్రతి ప్రజా నాయకుడిలో ప్రధానంగా ఉండాల్సిన గుణం ధైర్యం. సవాళ్లను ఎదుర్కొనే నిబద్ధత. ఈ విషయంలోనూ ప్రవక్త(స) సర్వోన్నత ఉదాహరణ. యుద్ధసమయాల్లో ఎవరైనా భయపడి వెనక్కు తగ్గిన సందర్భాల్లో, సహాబా ఎవరైతే ధైర్యంగా ముందుండేవారో వారు సయితం ప్రవక్త (స) చాటున నిలబడే వారు. ఎందుకంటే ఆయన ధైర్యానికి నిలువెత్తు రూపం.

ఆయన సహచరుడు ఒకరు చెప్పిన సాక్ష్యం: "అల్లాహ్ ప్రమాణంగా చెబుతున్నాను! యుద్ధ తీవ్రత పెరిగినపుడు మేమంతా ప్రవక్త (స) యొక్క ఆశ్రయాన్నే కోరేవాళ్లం. మా అందరిలో గొప్ప ధీశాలి అని పేరుగాంచినవారు సయితం ఆ క్లిష్ట సమయంలో ఆయన చాటున చోటు చూసుకునేవారు." (సహీహ్ ముస్లిం)

ఈ గుణం ప్రతి నాయకుడికి అవసరం. ముందుగా తానే శ్రమించి, ప్రజలకు ఒక ఉదాహరణగా నిలవాలి.నాయకుడు అనగానే కేవలం పదవిని అలంకరించేవాడే కాకుండా, సామాజిక స్పృహ కలిగినవాడని కూడా మనం గుర్తించాలి. కుటుంబానికి నాయకుడు కావాలి, సమాజానికి నాయకుడు కావాలి, ధర్మానికి నాయకుడు కావాలి. మంచి నాయకుడిగా ఎదగాలంటే, మనసులో కరుణ ఉండాలి, చేతల్లో ధైర్యం ఉండాలి, అడుగుల్లో త్యాగం ఉండాలి. ఇవి అన్నీ మనం మహనీయ ముహమ్మద్ (స) జీవితాన్నుంచే నేర్చుకోవచ్చు. ఆయన జీవితం ఒక పాఠశాల. అందులో చదువుకుంటూ, అనుసరిస్తూ, మన జీవితాల్లోనూ మార్పు తీసుకురావాలి.

### 3) మట్టిలో మాణిక్యాలను గుర్తించే నైపుణ్యం

ప్రవక్త ముహమ్మద్(స) తన సహచరుల వ్యక్తిత్వాన్ని గుర్తించ డంలో, వారి నైపుణ్యాలను అంచనా వేయడంలో, వారికి తగిన బాధ్యతలు అప్పగించడంలో అద్భుతమైన ప్రతిభ కలిగిన వారు. ప్రతి వ్యక్తి సామర్థ్యం ఏంటో ఖచ్చితంగా అంచనా వేసి, అతనికి అనుకూలమైన పని అప్పగించేవారు. శక్తి సామర్థ్యం ఉన్నవారికి నాయకత్వ బాధ్యతలు ఇచ్చేవారు; బలహీనులపై అధిక బాధ్యతలు మోపడం అస్సలు చేసేవారు కారు. ఒక సందర్భంలో, ప్రఖ్యాత సహచరుడు అబూ జర్ (ర.అ) నాయకత్వ పదవిని కోరగా, ప్రవక్త(స) ఇలా స్పష్టం చేశారు:

"ఓ అబూజర్! నీవు బలహీనుడివి. నాయకత్వం ఒక బరువుతో కూడిన బాధ్యత. ఇది పునరుత్థాన దినాన, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించని వారికి, అవమానాన్ని, విచారాన్ని కలిగించ గలదు. అదే దాన్ని న్యాయంగా, సమర్థవంతంగా చేపట్టి, అది తనపై మోపిన బాధ్యతను చక్కగా నిర్వర్తించిన వారికి మాత్రం అది గొప్ప గౌరవంగా మారుతుంది." (సహీహ్ ముస్లిం)

దీనివల్ల మనకు అర్థమయ్యేది ఏమిటంటే, నాయకత్వం కోరికలతో పొందే పదవి కాదు. అది నైతిక బాధ్యత, నిస్వార్థ సేవ. నాయకునిగా దూరదృష్టి, వ్యూహాత్మకత. ఒక జయ సేనాని తక్షణ, తాత్కాలిక విజయాన్ని కాక, దీర్ఘకాలిక ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకునే వ్యక్తి. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ సలక్షణంలో అపూర్వంగా నిలిచారు.

ఉదాహరణకు- ఉహుద్ యుద్ధం. ఇది ఒక పర్వత ప్రాంతంలో జరిగిన భీకర యుద్ధం. ప్రవక్త(స) యుద్ధానికి ముందు 50 మంది ధైర్యవంతులను ఒక కీలక గుట్ట వద్ద నిలబెట్టారు. ఆయన వారికి ఖచ్చితంగా ఆదేశించారు: "మీరు ఈ స్థలాన్ని ఎట్టి పరిస్థితిలో అయినా విడిచిపెట్టవద్దు, నేను ఆదేశించే వరకూ అక్కడే ఉండాలి." ఆయనకు ముందుగానే వ్యూహం స్పష్టంగా కనిపించేది. కానీ యుద్ధం మధ్యలో విజయం తలుపు తట్టినప్పుడు, కొందరు సహచరులు ఆ స్థలాన్ని విడిచి వెళ్లారు. ఈ పొరపాటును ఉపయోగించుకుని శత్రువు ఆకస్మికంగా వెనక నుండి దాడి చేశాడు. ఈ సంఘటన ద్వారా మనకు స్పష్టమవుతుంది - మహనీయ ముహమ్మద్(స) కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకులు మాత్రమే కాదు, రాజకీయ, సైనిక, వ్యూహాత్మక నాయకులుగా కూడా అత్యంత శ్రేష్ఠులు.

## 4) పూర్ణ వివేకంతో తీర్మానాలు- నిశిత పరిశోధనతో నిర్ణయాలు

మహనీయ ముహమ్మద్(స) తీసుకున్న ప్రతి నిర్ణయం సమయోచితమైనది, న్యాయబద్ధమైనది, విశ్లేషణతో కూడినదిగా ఉండేది. ముస్లింలు ప్రారంభ కాలంలో బలహీనంగా ఉన్న సమయంలో, బహిరంగంగా తౌహీద్ ప్రసారం చేయకుండా, వ్యూహాత్మకంగా వ్యవహరించారు. దాదాపు 3 సంవత్సరాలు రహస్యంగానే ధర్మప్రచారం సాగింది. అలాగే ఆయనకు ప్రవక్త పదవి ప్రసాదించక ముందే ఒక గొప్ప సంఘటన- హజ్రె అస్వద్‌ను కాబా గృహంలో అమర్చే విషయమయి వివాదం తలెత్తగా, ప్రవక్త (స) తన జ్ఞానం, బుద్ధి, దూరదృష్టితో వివాదాన్ని ఏ ఒక్కరి మనసు నొచ్చుకోకుండా ఎంతో చాకచక్యంగా పరిష్కరించారు. అందుకు ప్రతిస్పందనగా "అల్-అమీన్" అనే విశ్వసనీయత గల వ్యక్తి అన్న అత్యుత్తమ బిరుదు స్వయంగా జాతి జనమే ఇచ్చారు.

మరో గొప్ప ఉదాహరణ- బద్ర్ యుద్ధం తర్వాత పట్టుబడిన ఖైదీల వ్యవహారం. ప్రవక్త (స) ఈ విషయంలో తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేదు. సహచరుల అభిప్రాయం కోరారు. అబూ బక్ర్ (ర.అ): ఖైదీల బంధువుల నుంచి విమోచన ధనం (ఫిద్య) తీసుకుందాం. దాంతో నిధి పెరిగి, ముస్లింల బలాన్ని పెంచుతుంది. పైగా, బంధింపబడిన వారు కూడా ఒక రోజు సన్మార్గం పొంది ముస్లింలవచ్చు అని అభిప్రాయపడ్డారు. వీరు అల్లాహ్ ప్రవక్తకు విరోధంగా పోరాడినవారు. వీరిని శిక్షించాల్సిందే. ఇది సరైన తీర్పు అన్నారు ఉమర్ (ర.అ).

మహనీయ ముహమ్మద్(స) రెండింటినీ పరిగణనలోకి తీసుకుని, కరుణతో కూడిన దృష్టితో అబూ బక్ర్ (ర.అ) సూచనను అమలు చేశారు. (సహీహ్ ముస్లిం)- ఈ ఉదాహరణలు ప్రవక్త (స) యొక్క వివేకం నిండిన నిర్ణయం, పరిణతి, మార్గదర్శత్వానికి సజీవ సాక్ష్యాలు

## 5) ప్రజలతో సత్సంబంధాలు

మహనీయ ముహమ్మద్ (స) ఒక ఆదర్శ సత్య సేనాని మాత్రమే కాదు, ప్రజల హక్కులను గౌరవించే గొప్ప అధినాయకులు కూడా. ఆయన (స) ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని ప్రోత్సహించారు. ప్రతి పౌరుడికి తన నాయకుడిని ప్రశ్నించే హక్కు ఉందన్న సాహసోపేతమైన దృక్పథాన్ని ఆయన సుస్థిరం చేశారు. నాయకుడు తన పదవిని ప్రజల సేవకోసం వినియోగించాలి గానీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదన్న నైతికతను ఆయన ప్రబోధించారు. ముహనీయ ముహమ్మద్ (స) చిన్న పిల్లలతో మాట్లాడేవారు, వారి సమస్యలు తెలుసుకునేవారు, అబద్ధమో అపహాస్యమో కాకుండా, నిజమైన మానవతా బాంధవ్యంతో వారి

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
గీటురాయి

మాటలు వినేవారు. ముష్రికుల విషయంలోనూ, ఆయన(స) హింసను కాకుండా క్షమను ఆధారంగా చేసుకొని మార్గదర్శనం చేశారు. ఆయన స్పష్టంగా ఆదేశించారు: ''కార్మికుడు తన పని పూర్తి చేసిన వెంటనే, అతని చెమట ఆరకముందే అతని జీతం, కూలి అతనికి ఇవ్వండి.'' (సునన్ ఇబ్ను మాజా)

## 6) సమానత్వం, సామాజిక న్యాయం నిజమైన నాయకత్వ లక్షణం

మహనీయ ముహమ్మద్ (స) నాయకత్వంలో ఒక గొప్ప విశిష్టత- సమానత్వానికి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం పెద్ద పీట వెయ్యడం జరిగింది. ఆయన ఎప్పుడూ న్యాయాన్ని, సమత్వాన్ని పాటించేవారు. ఆయన పాలనలో ఏ దేశస్థుడైనా, ఏ రంగు గల వాడయినా, ఏ వర్గానికి చెందిన వాడయినా చట్టం ఎదుట సమానమే. అరబ్బీ కావచ్చు, అరబ్బేతరుడు కావచ్చు, తెల్లవారూ కావచ్చు, నల్లవారూ కావచ్చు- అందరూ ఒక్కటే. న్యాయం, సమానత్వం ఆయన పాలనకు మూలస్తంభాలు. ఆయన జీవితాన్ని అధ్యయనం చేసిన ఇమామ్ ఇబ్ను తైమియా (రహ్మ) అన్న మాట: ఒక ప్రభుత్వం అవిశ్వాస మూలాలు కలదై ఉంది న్యాయ పరిపాలన చేస్తే అల్లాహ్ దాన్ని నడిపిస్తాడు. అదే సత్య బద్ధ విశ్వాస మూలాలు కలిగి ఉన్న ఒక ప్రభుత్వం అన్యాయానికి, దౌర్జన్యానికి బరితెగిస్తే అల్లాహ్ అలాంటి ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం కొనసాగనియ్యడు. ఆయనలోని ఈ విశేష లక్షణాలే అనుచరులను వారి ధన, మాన, ప్రాణాలను సయితం తృణప్రాయం ఇచ్చేలా చేశాయి.

దైవప్రవక్త (స) పవిత్ర జీవితాన్ని ఆకళింపు చేసుకోవటానికి, ఆయన పాద చిహ్నాలలో నడచుకోవటానికి మనిషి రెండు నియమాలకు కట్టుబడి ఉండాలి. అవేమంటే (1) ఆయన (స) యెడల అచంచలమైన ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. ఆయన కోసం తన సర్వస్వాన్నీ అర్పించడానికి మనిషి సిద్ధమై ఉండాలి. కేవలం నోటితో పలికి సరిపుచ్చకుండా ఆచరణలో చిత్తశుద్ధిని కనబరచాలి. ప్రవక్తగారి ప్రత్యక్ష సహచరులు తమ ప్రేమాభిమానాలను క్రియాత్మకంగా రుజువు చేశారు. ఇస్లాం కోసం వారు తమ ధన ప్రాణాలను పణంగా పెట్టారు. కాలవు కాళ నాగులు వారిని ఉరికంభం మీదికి ఎక్కించి, "నీవు నిలబడి ఉన్నచోట ముహమ్మద్ నిలబడాలని నీవు అభిలషిస్తే నీకు ప్రాణ భిక్ష పెట్టబడుతుంది'' అని ఆశ చూపారు. దానికి సమాధానంగా ఆ త్యాగధనులు, "ఆయన (స) కాలిలో ముల్లు గుచ్చుకునే షరతుపై మాకు ప్రాణ భిక్ష లభించినా అది మాకు సహించదు గాక సహించదు'' అని తెగేసి చెప్పారు.

## చివరి మాట

ప్రియమైన ముహమ్మద్(స) ఈ సమస్త సృష్టిలో అత్యుత్తమ గుణాలు కలిగిన మహానుభావులు. ఆయనకు ప్రతి గుణంలో పరిపూర్ణత శిఖర స్థాయిని అల్లాహ్ ప్రసాదించాడు. ఆయనే అతి గొప్ప ప్రవక్త, అత్యున్నత శాసనకర్త, అగ్రశ్రేణి సైన్యాధిపతి, అత్యుత్తమ పాలకుడు మరియు అత్యంత తెలివైన రాజకీయ నాయకుడు కూడా! ❁

## ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)

(13వ పేజీ తరువాయి)

- ఆయన దైవదౌత్య కాలం మొత్తం 23 ఏళ్లు. 23 ఏళ్ళల్లో ఇదంతా ఎలా సాధ్యమయింది...?

మానవ మాత్రుని వల్ల ఇదంతా సాధ్యమా? ... కాని ఆ మానవ మాత్రుని వల్లనే ఇది సాధ్యమయింది!

- ఆయన మానవుడే కాని, దైవప్రవక్త, దైవ సందేశహరుడు. దైవమార్గదర్శకత్వంలో ఇదంతా సాధించగలిగాడు!!

## ఆదర్శం

అందువల్లనే ఆయన జీవితంలో, ఆయన నెరపిన ఉద్యమంలో మనకు ఆదర్శముంది.

వ్యక్తిగతంగా-

1) ఒక ఉత్తమ మానవునిగా, మానవ సోదరునిగా-

2) దయామయుడయిన భర్తగా, తండ్రిగా, ఇంటి యజమానిగా-

3) నిజాయితీ పరుడయిన వ్యాపారిగా

4) ప్రేమ నిండిన గురువుగా, బోధకుడుగా-

5) దూరదృష్టి గల నాయకునిగా-

6) ప్రతిభావంతుడయిన పరిపాలకునిగా-

7) కార్యదక్షత గల సంఘ సంస్కర్తగా

8) నైపుణ్యం, వివేచన గల కార్యనిర్వాహకునిగా

ఆయన జీవితం- మానవుని ప్రతి దశలో ప్రతి రంగంలో, ప్రతి రూపంలో ఓ మహా ఆదర్శం!!

- నేడు కావలసింది

ఆయన జీవితాన్ని తెలుసుకుని, అర్థం చేసుకుని ఆయన ఆదర్శాన్ని మన జీవితాల్లో, చిత్తశుద్ధితో, పటిష్టంగా, పరిపక్వంగా నిలుపుకోవడం.

- అదే నేటి అవసరం-

❁




తస్నీమ్‌జహాన్ ఖాన్

**వివాహ బంధం** అనేది ఒక దైవకానుక. భర్తకు భార్య వరం, భార్యకు భర్త వరం. దైవమిచ్చిన వరాన్ని సంతోషంతో స్వీకరించి, సహృదయంతో మెలగాలి. ఒకరికొకరు తోడూ నీడగా నిలవాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. ఒకరి అభిప్రాయాలకు మరొకరు విలువనివ్వాలి. ఇద్దరూ కలసి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చెయ్యాలి. ఫ్రెండ్లీగా, సరదాగా ఉండాలి. ఒకరి కోసం మరొకరు త్యాగాలు చెయ్యాలి. కోపం, విసుగును దూరం పెట్టి ప్రేమ, ఆప్యాయతల పరిమళాలు ఇంట్లో గుబాళించాలి. ఇంట్లో ఇలాంటి సకారాత్మక వాతావరణం ఉంటే ఆ ఫ్యామిలీ మెంబర్స్ ఎన్నెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించటం చాలా సులువు అయిపోతుంది. నేటి సమాజంలో దాంపత్య జీవితం చాలా ఘోరంగా తయారైంది. పెళ్ళిళ్ళు చేసుకోవడం ప్రాణాలు తోడేయటం లేదా ప్రాణాలు తీసేయటం చాలా కామన్ అయిపోయింది.

దైవప్రవక్త ముహమ్మద్(స) వారి ఉమ్మత్ అయివుండి కూడా చాలా మంది భార్యలు భర్తలను సతాయించుకుని తింటున్నారు. అలాగే భర్తలు భార్యలను వేధిస్తున్నారు. దైవప్రవక్త(స) తమ భార్యల విషయంలో చాలా మృదువుగా వ్యవహరించేవారు. వారి తప్పులను సరిదిద్దేవారు. వారితో చాలా సరదాగా ఉండే వారు. దైవప్రవక్త(స) చిట్టచివరి దైవప్రవక్త, దైవప్రవక్తలందరి నాయకులైనా కూడా తమ ఇంట్లో ఒక విఐపిలాగా కాకుండా సాధారణ వ్యక్తి వలే కుటుంబ సభ్యులతో కలసి మెలసి ఉండేవారు.

కొందరు భర్తలు ఇంట్లో భార్యకు ఏ చిన్న సహాయం కూడా చెయ్యరు. ఇంటి పనులు చేయడం కేవలం భార్య బాధ్యత మాత్రమే అనే ధోరణిలో ఉంటారు. ఇంట్లో ఏ ఒక్క పని విడిచి పెట్టినా, ఏ ఒక్క పని లేట్‌గా చేసినా నానా రభస చేస్తుంటారు. కానీ మన దైవప్రవక్త(స) నడవడిక అలా ఉండేది కాదు. ఆయిషా(రజి)ను కొందరు, ముహమ్మద్(స) ఇంట్లో ఎలా ఉండే వారు? అని ప్రశ్నించారు. దానికి ఆమె ఇలా సమాధానం చెప్పారు : "ఆయన ఓ సాధారణ వ్యక్తిలానే ఇంట్లో మసలుకునే వారు. తమ బట్టలు తామే సర్దుకునేవారు. మేకల నుండి పాలు పితికేవారు. మా పనులలో సహకరించేవారు" అని అన్నారు.

దైవప్రవక్త(స) వారి మొదటి భార్య ఖదీజా(ర) ఆయనకంటే వయసులో చాలా పెద్దవారు. వితంతువు, పిల్లల తల్లి అయినా గానీ దైవప్రవక్త(స) ఆమెను ఎంతో ప్రేమతో ఆదరించేవారు. ఆమెను, ఆమె పిల్లలను చాలా బాగా చూసుకున్నారు. అమ్మ ఖదీజా(రజి) కూడా దైవప్రవక్త(స)ను కళ్ళల్లో పెట్టుకుని చూసు కున్నారు. ఆయన(స)కు ఆర్థికంగా, సామాజికంగా, ధార్మికంగా అన్ని విధాలుగా అమ్మ ఖదీజా(రజి) సహకరించారు. ఇస్లాం

మక్కా నగరంలో తొలి పూత చిగుర్లు తొడుగుతున్న సమయంగా అమ్మ ఖదీజా(రజి) అండదండలు దైవప్రవక్త(స)కు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయి. ఆమె(రజి) త్యాగాల వల్లనే ఇస్లాం తొలి మజిలీ విజయవంతంగా పూర్తి చేసుకోగలిగింది. ఇద్దరిలోనూ ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమ, భరోసా ఉండటం వల్లనే దైవప్రవక్త(స) నలువైపులా శత్రువులు పొంచి ఉన్నా ధైర్యంగా ఉన్నారు. భర్త కంటే వయసులో పెద్ద అయిన భార్యను భర్త ఎలా చూసుకోవాలి, తనకంటే చిన్న వయసు భర్తను భార్య ఎలా చూసుకోవాలి అనేది దైవప్రవక్త(స)- అమ్మ ఖదీజా(రజి)ల దాంపత్యం నుండి పాఠాలు నేర్చుకోవాలి. అమ్మ ఖదీజా(రజి) మరణానంతరం దైవప్రవక్త(స) చాలా ఒంటరి అయిపోయారు. ఇంట్లో మటన్ వండితే అమ్మ ఖదీజా (రజి) స్నేహితురాళ్ళకు కానుకగా దైవప్రవక్త(స) పంపించే వారు. ఆమెను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉండేవారు. ఖదీజా(రజి) గురించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ప్రజలు నన్ను తిరస్కరించినప్పుడు ఆమె నన్ను విశ్వసించారు. ప్రజలు నా మాటలను నమ్మనప్పుడు ఆమె నా పలుకులను బలపరి చారు. ప్రజలు నాకు ఏదీ కాకుండా చేసినప్పుడు, ఆమె తన ధనంలో నన్ను భాగస్వామిగా చేశారు. అల్లాహ్ నాకు ఆమె ద్వారానే సంతానం ఒసగాడు. ఇతర భార్యల ద్వారా కాదు."

అమ్మ ఖదీజా(రజి) ఒక దైవభక్తురాలుగా, ఒక భార్యగా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. హజ్రత్ జిబ్రీల్(అ) దైవప్రవక్త(స) వద్దకు అరుదెంచి, "ఓ దైవప్రవక్తా! అదిగో ఖదీజా(రజి) వస్తున్నారు. ఆమె మీ దగ్గరకు వచ్చిన తరువాత ఆమెకు అల్లాహ్ తరఫున సలాం అందించండి. స్వర్గంలో ఆమె కొరకు ముత్యాల ఓ మహలు గురించి శుభవార్త అందించండి. అందులో ఎలాంటి గలాటా ఉండదని చెప్పండి" అన్నారు. పుణ్యవతుల్లారా! అమ్మ ఖదీజా (రజి)ను ఆదర్శంగా తీసుకోండి.

దైవప్రవక్త(స) భార్యల్లో తొమ్మిది మంది ఆయనకంటే చిన్న వయసు వారు ఉన్నారు. తమ కంటే చిన్న వయసు భార్యలను దైవప్రవక్త(స) ఉత్తమరీతిలో చూసుకున్నారు. వారితో కలసి ఆట ల్లోనూ పాలుపంచుకునేవారు. ఆయిషా(రజి) స్నేహితురాళ్ళు ఇంటికి వచ్చి ఆడుకుంటూ ఉండేవారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇంట్లో ప్రవేశిస్తే వాళ్ళంతా దాక్కునేవారు. దైవప్రవక్త(స) వారిని వెతికి ఆమెతో ఆడుకోమని ప్రోత్సహించేవారు.

దైవప్రవక్త(స) ఒకసారి ఆయిషా(రజి)తో పరుగు పందెం పెట్టు కున్నారు. అప్పుడు ఆయిషా(రజి) గెలిచారు. కొన్ని సంవత్సరాల తర్వాత వారిద్దరూ మళ్ళీ పరుగు పందెం పెట్టుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(స) గెలిచారు. తర్వాత "ఆయిషా! ఇది ఆనాటి ఓటమికి ప్రతీకారం" అని దైవప్రవక్త(స) నవ్వుకున్నారు. ఒక గేమ్‌లో భార్య గెలుపును కూడా ఈనాటి మోడ్రన్, బ్రాడ్ మైండెడ్' అనే ట్యాగ్ గల భర్తలు జీర్ణించుకోలేక పోవటం, ప్రాణాలు హరించటం ఎంత సిగ్గుచేటు.

దైవప్రవక్త(స) భార్యల పట్ల చాలా సహనంతో వ్యవహరించేవారు. వారి మాటలను ఆలకించేవారు. వారికి తగిన సమయం కేటా యించి, వంతుల వారీగా వారి వద్దకు వెళ్ళేవారు. ఇప్పటి భర్తలు మొబైల్‌ఫోన్లలో సమయం గడుపుతున్నారు. రోజంతా భర్త కోసం వేచి ఉండి, సమకూర్చుకున్న వార్తలన్నింటినీ భర్త ముందు బహిర్గతం చెయ్యాలని ఆశతో భార్య మాట్లాడటం ప్రారంభి స్తుంది. ఆమె మాట్లాడుతూనే ఉంటుంది. భర్త ఫోన్ మోగుతుంది, అందులో గంటలు గడిచిపోతాయి. లేదా అతను సోషల్ మీడియాలో బిజీ అయిపోయి వింటున్నట్లు నటిస్తూ ఉంటాడు. ఇదీ నేటి ఇంటింటి బాగోతం!

చాలామంది భర్తలు పెళ్ళి అవగానే భార్య తన సరదాలు, అభిరుచులను పూర్తిగా విడిచిపెట్టాలని పెత్తనాలు చేస్తుంటారు. ఎలాంటి కీడు లేని సరదాలు, అభిరుచులను ఎందుకు బ్యాన్ చెయ్యాలి? అంత కట్టుదిట్టంగా ఆమెను టార్చర్ చెయ్యాలని ఎందుకు చూస్తున్నారు? ఒకసారి పండుగ సందర్భంగా మదీనా నగరంలో కొందరు హబ్షీలు వారి మార్షల్ ఆర్ట్స్ చేస్తున్నారు. దైవప్రవక్త(స) ఆయిషా(రజి)ను తమ వీపు వెనుక నిల్చోబెట్టుకుని ఆమె చూడగలిగినంత సమయం ఆయన(స) చూడనిచ్చారు. ఆమె (ర) చూసి చూసి అలసిపోయి ఇక చాలు అన్నంత వరకూ ఆమె(ర)కు తోడుగా ఆయన(స) అలాగే నిల్చొని ఉన్నారు.

దైవప్రవక్త(స) జీవిత చరిత్రలో ఎక్కడా ఆయన(స) భార్యలు అత్తింటి వేధింపులు ఎదుర్కోలేదు. వరకట్న వేధింపులుగానీ, అదనపు కట్న వేధింపులుగానీ, భర్త బంధువుల వేధింపులుగానీ విశ్వాసుల మాతృమూర్తులకు లేనే లేవు. మరి నేటి దైవప్రవక్త(స) ఉమ్మత్‌లో ఇవన్నీ ఎందుకు కానవస్తున్నాయి? దీనికి బాధ్యులు ఎవరు? ఇంకా ఎంతకాలం ఈ వేధింపులు సాగుతాయి? ప్రజలు మారేందుకు ఎందుకు రెడీగా లేరు? దైవప్రవక్త(స)ను ఆదర్శంగా జీవితపు ప్రతీ అంశంలోనూ తీసుకోవాలి కదా! మన తరాలు ఎలాగూ కలుషితమైపోయాయి. కొత్త తరాలనైనా ఈ బాధల నుండి విముక్తినిద్దాం.

మనం మారాలి, మన భావి తరాలు మారాలి. ఆలుమగల్లో గాఢమైన ప్రేమానుబంధాలు వెల్లివిరియాలి. నేటి సమాజంలో ఒకరినొకరు చంపుకుంటున్న దారుణ, క్రూర పరిస్థితులను మార్చి మళ్ళీ ప్రేమ కుసుమాలు విచ్చుకోవాలి. మానవ సంబంధాలు మళ్ళీ బలపడాలి. వివాహమనే బంధానికి భరోసా ఏర్పడాలి. ఇవన్నీ జరగాలంటే దైవప్రవక్త(స) ఆదర్శ నమూనా అధ్యయనం చెయ్యాలి. దాన్ని పాటించాలి. ప్రతీ భార్య భర్త పవిత్ర జీవితాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే సమాజం నవ వసంతాలతో మెరుస్తుంది. ఈ ఆదర్శ నమూనా విడిచి పెడ్తే ఇక సమాజం శవాలతో, హత్యలతో కుళ్ళి కంపుకొడ్తుంది. ❀




ముహమ్మద్ వహీదుద్దీన్

## ముహమ్మద్(స) ఎవరు?

ఏకైక దేవుడు అయిన అల్లాహ్‌ను మాత్రమే హృదయపూర్వకంగా విశ్వసించేలా సర్వ మానవాళికి పిలుపునివ్వడానికి అల్లాహ్ పంపించిన ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్(స).

అంతిమ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా తెలుపడం జరిగింది : వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది, అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికీ. (అల్ అహ్‌జాబ్ 33: 21)

## జననం

దైవప్రవక్త ముహమ్మద్(స) వంశావళి హజ్రత్ ఇబ్రాహీమ్(అ) దాకా చేరుతుంది. ఆయన(స) ప్రముఖ ఖురైష్ వంశానికి చెందినవారు. కాబా గృహం అర్చకులు ఆయన(స) వంశం వారే. తండ్రి పేరు అబ్దుల్లాహ్, తాత పేరు అబ్దుల్ ముత్తలిబ్. ఆయన(స) మక్కా నగరంలో 22 ఏప్రిల్ క్రీ.శ.571లో అనాథగా జన్మించారు. ఆరు సంవత్సరాల తరువాత తల్లి బీబీ ఆమినా పరమపదించారు. ఎనిమిదవ ఏట వరకు తాత పోషించారు. ఆ తరువాత బాబాయి అబూ తాలిబ్ అల్లారుముద్దుగా పెంచి పోషించారు.

## సత్యసంధునిగా, విశ్వసనీయునిగా

చిన్నతనం నుంచే బాల ముహమ్మద్ సుగుణాల రాశిగా ప్రశంసించబడ్డారు. నీతి, నిజాయితీ, సేవా తత్పరత, సత్య సంధత, విశ్వసనీయత ఆయనకు ఉగ్గుపాలతోనే అలవడ్డాయి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం, నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించడం లాంటి అనేక సుగుణాల రీత్యా ఆయన ప్రజల మనసులు చూరగొని సాదిక్‌గా, అమీన్‌గా అంటే సత్యసంధునిగా, విశ్వసనీయునిగా పిలువబడ్డారు.

## హిరా అనే కొండ గుహలో...

ముహమ్మద్(స) ఏకాంతంలో ప్రజల అజ్ఞానాన్ని, చెడులను చూసి చాలా బాధపడేవారు. ఎక్కువగా మక్కా పట్టణానికి కొంత

దూరంలో ఉన్న హిరా అనే కొండ గుహలో చేరి అల్లాహ్‌ను వేడుకునేవారు. ప్రజలను ఈ చెడుల నుండి కాపాడమని ప్రార్థించారు. ఒక రోజు యధాతథంగా దైవధ్యానంలో ఉండగా అకస్మాత్తుగా ఒక అద్భుత వాణి ప్రతిధ్వనించింది.

"(ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు; నీ ప్రభువు పరమ దయాళువు".

## కారుణ్య ఉద్యమం

దైవ ప్రార్థనలు, దానధర్మాలు, ఉపవాసాలు చేసేలా ప్రజలను ప్రోత్సహించడంతోపాటు మనిషి ఇతరులతో ఎలా వ్యవహరించాలన్నది కూడా విశ్వాస సూత్రాల ప్రకారం ఉండాలని బోధించారు. "మీలో ఉత్తమ వ్యక్తిత్వం కలిగినవారే ఉత్తములు"ని చెప్పారు.

## మృదు స్వభావం

ప్రవక్త(స) ఎంతో మృదువుగా వ్యవహరించేవారు. ప్రతి చిన్న విషయానికి చికాకు, కోపం ప్రదర్శించేవారు కాదు. అందరినీ చిరునవ్వుతో పలకరించేవారు. మీలో పరాక్రమశాలి ఎవరంటే కోపం వచ్చినప్పుడు నిగ్రహం పాటించేవాడు అని మహాప్రవక్త(స) సెలవిచ్చారు.

## మాటల్లో మాధుర్యం

ప్రవక్త(స) మంచి మాట పలకటం దానంతో సమానం అని సెలవిచ్చారు. దైవప్రవక్త(స) తాను ఎవరితో మాట్లాడినా వారి స్థాయి, గౌరవ మర్యాదలను దృష్టిలో పెట్టుకుని కడు జాగ్రత్తగా వ్యవహరించేవారు. ఫలితంగా పరస్పర సంబంధాలు సజావుగా ఉండేవి.

## నడకలో ఆత్మ విశ్వాసం

ప్రవక్త(స) నడకలో ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతూ ఉండేది. హుందాగా, బాధ్యతా భావంతో నిండిన నడక ప్రవక్త(స)వారి స్వంతం.

## అందరికంటే ముందుగా సలామ్

ప్రియ ప్రవక్త(స) సలామ్ చేయడానికి అమితంగా ఇష్టపడేవారు. సలామ్ చేయడంలో అందరికంటే ముందుండేవారు.

## సహనం

మీకు చెడు చేసినవారి పట్ల చెడుగా వ్యవహరించరాదు. వారి పట్ల క్షమాగుణం, దయా స్వభావంతో వ్యవహరించండి అన్నారు దైవప్రవక్త ముహమ్మద్(స).

## క్షమా గుణం

ప్రవక్త(స) అత్యంత క్షమాగుణం కలిగినవారు. దయా స్వభావులు. ఆయనను ఎవరైనా నిందించినా హృదయ పూర్వకంగా క్షమించేవారు.

## మంచి మిత్రునిగా...

దైవప్రవక్త ముహమ్మద్(స) తన సహచర మిత్రులను చాలా ప్రేమించేవారు. ఎప్పుడూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవారు.

## దయార్థ్ర హృదయం

దైవప్రవక్త(స) ఒక విశాలమైన దృక్పథం, దయ గల హృదయం గలవారు. ఆయన గనక కఠిన హృదయులైతే తన ఉద్యమంలో ఎన్నడూ విజయం సాధించేవారు కాదు.

## సమానత్వం

ప్రియప్రవక్త(స) దృష్టిలో మానవులందరూ సమానులే. పేదవాడైనా, ధనికుడైనా, చిన్నవారైనా, పెద్దవారైనా, బానిస, సేవకుడైనా, యజమాని అయినా, అందరినీ ప్రవక్త (స) సమదృష్టితో చూసేవారు. అందరి పట్ల సమభావన కలిగి ఉండేవారు. ఎటువంటి పక్షపాతమూ ఉండేది కాదు.

## నడిచే ఖుర్ఆన్

ప్రవక్త(స) భార్య హజ్రత్ ఆయిషా(ర.జి)ను ఒకసారి దైవప్రవక్త(స) ఎలాంటి వారని ప్రశ్నించినప్పుడు ఆమె జవాబిస్తూ "ఆయన నడిచే ఖుర్ఆన్" అని అన్నారు. అంటే ఆయన దివ్య ఖుర్ఆన్ బోధనలను అత్యంత సూక్ష్మంగా తన జీవితంలో ఆచరించి చూపించారు.

## జ్ఞానం జీవితం- అజ్ఞానం మరణం

అజ్ఞాన అంధకారంలో కూరుకుపోయిన నాటి సమాజంలో ముహమ్మద్(స) జ్ఞాన జ్యోతులను వెలిగించారు. విద్యా కుసుమాలను వికసింపజేశారు. విద్యార్జన ప్రతి ఒక్కరి విధి అని ఆయన నిర్దేశించారు. జ్ఞానం జీవితం- అజ్ఞానం మరణం అని విశదీకరించారు.

## త్యాగశీలి

ఒక విశ్వాసురాలైన స్త్రీ తన స్వహస్తాలతో ఒక దుప్పటిని నేసి

ప్రవక్త(స) వారికి బహుమతిగా అందించింది. నిజానికి ఆ సమయంలో ప్రవక్త(స)కు ఆ దుప్పటి ఎంతో అవసరమై ఉండింది. కాని పక్కనే ఉన్న ఒక సహాబీ 'ఓ దైవప్రవక్తా! దుప్పటి చాలా అందంగా ఉంది. ఈ దుప్పటిని నాకు ప్రసాదించండి' అని అర్థించారు. ప్రవక్త(స) తన అవసరాన్ని కూడా త్యజించి ఆ దుప్పటిని సహాబికి అందించారు.

### నిరాడంబరత

దైవప్రవక్త(స) పరిశుద్ధతను ఇష్టపడేవారు. చాలా నిరాడంబరంగా ఉండేవారు. అతుకులు వేసిన బట్టలు తొడగటాన్ని చిన్నతనంగా భావించేవారు కాదు.

### ధర్మసమ్మతమైన ఆహారం

ధర్మసమ్మతమైన ఆహారమే భుజించేవారు. ఎన్నడూ దేనిలోనూ లోపం వెతికేవారు కాదు. అందరితో కలసి భుజించడాన్ని ఇష్టపడే వారు. చాలాసార్లు ఆకలిదప్పులకు తాళలేక కడుపుపై రాయి కట్టుకునేవారు.

### ఆదర్శ భర్తగా

దైవప్రవక్త(స) తన 25వ ఏట తనకన్నా వయసులో 15 ఏండ్ల పెద్ద, రెండోసారి వితంతువు అయిన హజ్రత్ ఖదీజా(రజి)ను వివాహమాడి స్త్రీ జనోద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆమెతో అత్యంత సంతోషకరమైన జీవితాన్ని గడిపారు.

### సేవాతత్పరత

తాను నడిచే మార్గంలో ముళ్లు పరిచి తనపై కసువు ఊడ్చిపోసే మహిళ అనారోగ్యం పాలై మంచాన పడితే విశాల హృదయంతో ఆమెను పరామర్శించి ఆమె స్వస్థత కోసం దైవాన్ని ప్రార్థించిన మహనీయులు ముహమ్మద్(స).

### సంతానానికి తల్లిదండ్రుల శిక్షణ

పిల్లలను ప్రేమించడం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం, సజ్జనులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేయడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రవక్త(స) తన కుమార్తె ఫాతిమా (రజి)ను అమితంగా ప్రేమించేవారు. ఆమెకు మంచి విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారు.

### పొరుగు వారి హక్కులు

ఇరుగు పొరుగు వారితో మంచిగా ఉండాలని, వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలని, మంచిగా ప్రవర్తించాలని ప్రవక్త(స) సూచించారు.

### అనాథల హక్కులు

అనాథలను ప్రేమించడం, పెంచడం, వారి ఆలనా పాలనా చూడటం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం సాటి మనుషులుగా మన బాధ్యత అని దైవప్రవక్త(స) తెలియజేశారు.

## ప్రవక్త బోధనల అనుసరణే నిజమైన వేడుక

ప్రవక్త ముహమ్మద్(స) జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ముస్లింల హృదయాలలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఇది కేవలం ఒక పండుగ కాదు, మానవాళికి మార్గదర్శకుడైన ప్రవక్త బోధనలను స్మరించుకునే పవిత్ర సందర్భం.

ఖురాన్ (సూరా అల్-అన్బియా 21:107)లో "ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము" అని పేర్కొనబడింది. ఇది ప్రవక్త (స) బోధనల అసలు సారం. ఆయన కరుణ, సహనం, క్షమాగుణం మనిషి జీవితంలోని ప్రతి కోణాన్నీ వెలిగించే దీపాలు. తాయిఫ్ సంఘటనలో రాళ్లతో దాడి జరిగినా, ప్రతీకారం కాక క్షమనే ఎంచుకోవడం, మక్కా విజయానంతరం తన శత్రువులకు సర్వసామాన్యమైన క్షమాభిక్ష పెట్టడం ఆయన ఔదార్యానికి ప్రతీక.

ప్రవక్త (స) బోధనలు ఒక నిర్దిష్ట కాలానికి పరిమితం కాకుండా శాశ్వతమైనవి. వ్యక్తిగతం నుంచి సామాజికం వరకు, ఆర్థికం నుంచి రాజకీయాల వరకు ఆయన మార్గదర్శకత్వం విశ్వవ్యాప్తమైనది. నిజాయితీ, సమగ్రత, ఇతరుల హక్కుల పట్ల గౌరవం ఆయన బోధనలకు సాక్ష్యాలు.

ప్రవక్త(స) పట్ల ప్రేమను చూపే ఉత్తమ మార్గం ఆయన బోధనలను మన జీవితాలలో ఆచరణలో పెట్టడమే. నిజాయితీతో జీవించడం, ప్రతికూల ప్రవర్తనలను దూరం పెట్టడం, మానవాళికి కారుణ్య ప్రతినిధులుగా నిలవడం మన బాధ్యత.

ఈ సందర్భంగా, మనం ఆయన మార్గాన్ని అనుసరించేందుకు కట్టుబడి, సమాజ అభివృద్ధికి, మానవతా విలువల పరిరక్షణకు కృషి చేద్దాం. అదే ప్రవక్త (స) పుట్టినరోజు వేడుకకు నిజమైన అర్థం.

**- షేక్ హసన్**



# మానవతా విప్లవానికి దీపశిఖ

**మదీహా అర్జుమంద్ ఖాన్**

**ప్రపంచమంతా** అంధకారం అలుముకున్నప్పుడు, తూరుపు దిక్కుల నుండి ఒక కాంతి కిరణం ఉదయించింది. అజ్ఞానపు దట్టమైన మబ్బులను చీల్చుకుని, మానవజాతి గుండెల్లో మానవత్వపు జ్యోతి వెలిగించింది. ఆ దివ్య కాంతే ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం. ఆయన జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ కేవలం ఒక ఆచారం కాదు, జగతిని కమ్మిన చీకట్లను చీల్చే వెలుగుల విప్లవం.

ఆయన ప్రభవనకు పూర్వం మక్కా మదీనాలు అజ్ఞానపు బంధనాల్లో చిక్కుకుపోయాయి. అన్యాయం, అసమానత, బలవంతం, దౌర్జన్యం మానవ జీవనాన్ని కుదిపేశాయి. అప్పుడు దైవ కరుణతో మానవాళి మార్గదర్శకుడిగా ముహమ్మద్ ప్రవక్త(స) జన్మించారు. ఆయన జననంతో మానవ హృదయంలో కొత్త ఆశ, కొత్త శాంతి, కొత్త వెలుగు ప్రసరించింది.

ఆయన జన్మదినం మనకు కేవలం ఒక జ్ఞాపిక కాదు. అది మన ఆత్మలో మళ్లీ ఒకసారి కొత్త నిశ్చయాన్ని నింపే ఉత్సవం. మన జీవితాల్లో అన్యాయాన్ని తొలగించి, దయ, కరుణ, సత్యం, న్యాయం పునరుద్ధరించే క్షణం. మనం దీన్ని ఆచారంగా కాకుండా, విప్లవంలా చూసుకోవాలి.

ప్రవక్త మహనీయులు (స) మనకు ఇచ్చిన మొదటి సందేశం, 'మీరు ఎవరి మీదా దౌర్జన్యం జరపకూడదు. ఎందుకంటే వారు మీ సోదరులు.' ఇది మానవ హక్కులకు మూలం. ఆయన బోధనలు మన కాలానికి ఎంత అవసరమో ఆలోచిస్తే ఆశ్చర్యమే కలుగుతుంది. ఈ రోజు కూడా కులం, మతం, జాతి, దేశం పేరుతో మనం విభజనకు లోనవుతున్నాం. ఆయన చూపిన మార్గమే ఆ విభేదాలను తొలగించగలదు.

ముహమ్మద్ ప్రవక్త (స) జీవితం కేవలం ఒక చరిత్ర కాదు, అది ఒక శాశ్వత మార్గదర్శకం. ఆయన చెప్పిన చిన్న చిన్న విషయాలు

**మిగతా 29వ పేజీలో...**

## సర్వమానవాళికి కారుణ్యం

# ముహమ్మద్ ప్రవక్త(స)

యం.డి. మేరాజుద్దీన్

### ముహమ్మద్ ఎవరు?

ముహమ్మద్ ప్రవక్త(స) కామన్ ఎరా ప్రకారం 571వ సంవత్సరం ఏప్రిల్ 22న మక్కాలోని గౌరవప్రదమైన బనూ హాషిం కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లి ఆమినా మూడు నెలల గర్భవతిగా ఉన్నప్పుడే తండ్రి అబ్దుల్లాహ్‌ను కోల్పోయారు. పుట్టుకకు ముందే తండ్రిని కోల్పోయి అనాథ జీవితం గడిపారు. యువ ముహమ్మద్ జీవిక కోసం గొర్రెలను కాసారు. గొర్రెల కాపరిగా ఒంటరితనాన్ని, సహనాన్ని, ధ్యానాన్ని, అప్రమత్తతను నేర్చుకున్నారు.

### కాపరి నుంచి వ్యాపారిగా

కాపరిగా పనిచేసిన తరువాత వ్యాపారిగా మారారు. నిజాయితీ, సత్యసంధతలకు మారుపేరుగా నిలిచారు. ఆయన వ్యాపార బృందానికి నాయకుడిగా ఉండేవారు. మక్కాలో ధనిక పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలు ఆయన వద్ద వస్తువులు దాచుకునేవారు. ఆయన నిజాయితీ, సత్యసంధత అంతగా పేరుపొందాయి. వ్యాపారంలో ఆయన కనబరచిన నిజాయితీ, సచ్ఛీలత ఎందరినో ఆకర్షించాయి. ప్రజలు ఆయనను సాదిక్ (సత్యసంధుడు), అమీన్ (విశ్వసనీయుడు) అని పిలిచేవారు. ఆ సమయంలోనే శ్రీమంతురాలు, వ్యాపారవేత్త అయిన హజ్రత్ ఖదీజా, ముహమ్మద్ దీక్షాదక్షతలను తెలుసుకుని, తన వ్యాపార బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఆయన నిజాయితీకి మెచ్చిన ఆమె, ఆయనను వివాహమాడారు.

### సత్యాన్వేషణ

ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవక్తగా నియమించబడక ముందు అరేబియాలో చెడులు ప్రబలి ఉండేవి. తెగల మధ్య ఆధిక్యత కోసం యుద్ధాలు జరిగేవి. చిన్న చిన్న విషయాలకే రక్తపాతాలు జరిగేవి. అత్యంత ఆటవికమైన పరిస్థితి రాజ్యం చేసేది. మానవాళి పూర్తి చీకట్లలో కొట్టుమిట్టాడుతున్న కాలం అది. చెడులు, రుగ్మతలు, విషాదాలు, పేదరికం, హింసాకాండ ఎటు చూసినా కనిపించేది. మచ్చుకైనా మానవత్వం జాడ కానవచ్చేది కాదు. మక్కాలో ఖురైషులు తాము తయారు చేసుకున్న విగ్రహాలను పూజించేవారు. ఈ విగ్రహాల కోసం ఏకంగా యుద్ధకాండ జరిగేది. మానవ ప్రాణానికి, మహిళలకు విలువ ఉండేది కాదు. ఆ చెడులన్నింటికీ కలత చెందిన

ముహమ్మద్ హిరా అనే గుహలో ఏకాంత ఆరాధనలో గడిపేవారు ఈ విధంగా సత్యాన్వేషణ ప్రారంభించారు. ఒకరోజు రమజాన్ నెలలో హిరా గుహలో దైవవాణి అవతరించింది. చాలా సంవత్సరాల తర్వాత రాత్రి అవతరించిన దైవవాణి ఆయనలో కొత్త లోకాన్ని ఆవిష్కరించింది.

### సఫా కొండ నుండి శాంతి పిలుపు

బహుదేవతలతో అనైక్యంగా ఉన్న ప్రజల్ని ఎలాగైనా ఐక్యం చేయాలని పరితపించేవారు. సంఘర్షణలు, యుద్ధాలు మాన్పించి సమాజాన్ని శాంతివైపు నడిపించాలని కలలు కనేవారు. ఒకరోజు ముహమ్మద్ ప్రవక్త సఫా పర్వతంపైకి ఎక్కి అందరినీ పిలిచి "కొండకు ఆవల ఒక పెద్ద సైన్యం నిలిచి ఉందని, అది మీపైకి దండెత్తడానికి సిద్ధంగా ఉందని నేనంటే నా మాటను నమ్ముతారా???" అని గట్టిగా అడిగారు. "నిస్సంకోచంగా నమ్ముతాం. మిమ్మల్ని సత్యసంధులుగా, విశ్వసనీయులుగానే చూశాం" అని ప్రజలు జవాబిచ్చారు. అప్పుడు మళ్లీ ముహమ్మద్ ప్రవక్త "జనులారా! నేను మిమ్మల్ని విగ్రహారాధన చేయరాదని, కోరుతున్నాను, ఒకే ఒక్క దేవుణ్ణి ఆరాధించాలని అడుగుతున్నాను. మీరు ఇది కాదన్నారంటే భయంకరమైన శిక్షకు గురవుతారు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ముహమ్మద్ ప్రవక్త తొలి సందేశం ఇదే. ఇది విన్న ఖురైష్ ప్రజల కోపం కట్టలు తెంచుకుంది. అడుగడుగునా అవమానాలను ఎదుర్కొన్నారు. క్రమక్రమంగా ప్రవక్తను విశ్వసించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. మొట్టమొదట ఇస్లామ్‌ను స్వీకరించిన వ్యక్తి ముహమ్మద్ (స) జీవిత భాగస్వామి ఖదీజానే కావడం విశేషం.

### చక్రవర్తిగా పేదరికాన్ని అనుభవించారు

ఆయన రాజ్యానికి అధినేత, ప్రవక్త, అరేబియా ద్వీపకల్పానికి పాలకుడు, ప్రధాన న్యాయమూర్తి, సర్వసైన్యాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు సహా పలు పాత్రలు పోషించారు. రారాజుగా అధికారం పొందినా మదీనాలో ఆయన నివసించిన గృహం మట్టి ఇటుకలతో చేసిన సాధారణ ఇల్లు. పైన ఖర్జూరపు ఆకుల కప్పు. ఆయన తుదిశ్వాస విడిచినప్పుడు ప్రపంచానికి వెలుగు పంచిన ఆయన ఇంట చమురు లేనందువల్ల చీకటిలో మగ్గింది.

ఉమర్(రజి) ప్రవక్త ఇంటికి వెళ్లి పరిస్థితిని చూసి ఇలా వివరించారు; "నేను లోపలికి వెళ్లినప్పుడు ఆయన ఒక చాపపై పడుకుని ఉన్నారు. ఖర్జూరపు ఆకులతో నేసిన చాప అది. ఆయన చొక్కా తొడుక్కొని లేరు. ఆయన వీపుపై చాప గుర్తులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒక మూల చెక్క బల్ల ఉంది. కొన్ని బార్లి గింజలు ఉన్నాయి. ఇది చూసిన నేను దుఃఖాన్ని ఆపుకోలేక పోయాను. ఆయన నాతో ఎందుకు బాధపడుతున్నావు అని అడిగారు. రోమన్, పర్షియన్ సామ్రాజ్యాలు సమస్త భోగభాగ్యాలు అనుభవిస్తుంటే మీరు దైవప్రవక్త అయి ఉండి ఇలా ఉండటం ఏమిటన్నారు. ఈ మాటలు విని ఆయన లేచి కూర్చున్నారు. "ఉమర్ నీవు చెబుతున్న మాటలకు అర్థం ఏమిటి? నువ్వు చెప్పేవారికి ఈ ఇహలోకమే దక్కని, మనకు పరలోకం కావాలని నువ్వు కోరడం లేదా?" అని ప్రశ్నించారు. అరేబియా ద్వీప


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

కల్పానికి చక్రవర్తి స్థాయి అందుకున్న ఆయన ఇంట అనేక రోజుల పాటు పొయ్యి వెలిగేది కాదు. కేవలం ఖర్జూరాలు, నీళ్లతో గడిపేవారు. రోజుల తరబడి పస్తులున్నారు.

## ఇంటిపనుల్లో చేదోడువాదోడు

ప్రవక్త ఇంటిలో ఉన్నప్పుడు ఇంటి పనుల్లో పూర్తిగా సహాయ పడేవారు. ఈ విషయాలను వివరిస్తూ ఆయన సతీమణి ఆయిషా ఇలా చెప్పారు; "తన దుస్తులు తానే మరమ్మతు చేసుకునేవారు. తన పాదరక్షలు తానే బాగుచేసుకునేవారు. మేకల పాలు పితికే వారు. చిరిగిన దుస్తులు కుట్టుకునేవారు. బరువులు మోసేవారు..."

## మానవ సేవ

సేవ అనేది కేవలం ముస్లిములకే కాదు అందరికీ అందాలని ముహమ్మద్ ప్రవక్త చెప్పారు. ప్రవక్త (స) ఈ విషయంలో ఇలా అన్నారు : "అన్ని ప్రాణులు దేవుని కుటుంబం. ఈ కుటుంబానికి సేవలందించే మనిషి దేవునికి చాలా ఇష్టమైన వాడు.."

"ఇతరుల పట్ల కరుణ చూపని వ్యక్తిపై అల్లాహ్ కరుణ చూపడు."

"భూమిపై ఉన్న వారి పట్ల కరుణ చూపండి. ఆకాశాన ఉన్న ఆయన మీపై కరుణ చూపిస్తాడు."

ప్రాణులన్నింటినీ ఎలాంటి వివక్షా లేకుండా ఆదుకోవాలని ఈ బోధనలు స్పష్టం చేస్తున్నాయి. సానుభూతి, సహాయం, అవసరం ఉన్న వారెవరికైనా సహాయం చేయాలని ప్రవక్త బోధనలు స్పష్టం చేస్తున్నాయి.

## మంచితనానికి మచ్చు తునక

ప్రతిరోజు ప్రవక్త తన ఇంటి నుంచి కాబా గృహానికి వెళుతున్నప్పుడు ఒక వృద్ధ మహిళ ఆయన దారిలో చెత్తా చెదారం పోసేది. ప్రవక్త తన ముత్తాతల మతాన్ని కాదని ఇస్లామ్ సందేశ ప్రచారం చేయడం ఆమెకు ఇష్టం లేదు. ఒక రోజు ప్రవక్తపై చెత్త పడలేదు. ఆయన ఆమె ఇంటికి వెళ్లారు. ఆయన ఆమె ఇంటికి రావడం చూసి నిర్ఘాంతపోయింది. ఎందుకొచ్చావని అడిగింది. ప్రవక్త ఆమెతో మాట్లాడుతూ, దారిలో చెత్త కనబడ లేదు. మీ ఆరోగ్యం ఎలా ఉందో ఒకసారి చూసి పోదామని వచ్చాను అన్నారు. ఆమె ఈ మంచితనం చూసి ముచ్చటపడింది. తాను చేసిన పనికి సిగ్గుపడింది. ప్రవక్త వ్యక్తిత్వం ఆమెను ఎంతగా ప్రభావితం చేసిందంటే ఇస్లామ్‌ను ద్వేషించిన ఆమె ఇస్లామ్ స్వీకరించింది.

## స్త్రీ జాతి అభివృద్ధికి పునాదులు వేశారు

ముహమ్మద్ ప్రవక్త (స) మహిళలను చాలా గౌరవించేవారు. వారికి గొప్ప స్థానం ఇచ్చి సన్మానించేవారు. అప్పటి వరకు అరేబియాలో గాని, ఇతర దేశాలలోగాని, మహిళల స్థితి చాలా దారుణంగా ఉండేది. మహిళలను కేవలం తమ కామవాంఛ తీర్చే అంగడి సరుకుగా చాలా సమాజాలలో భావించేవారు. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా స్త్రీలకు ఇస్లామ్ ధర్మం ఆస్తి హక్కును ఇచ్చింది. భర్తను కోల్పోయిన స్త్రీలు జీవితాంతం మోడువారిన చెట్టులాగా బ్రతకవలసిన అవసరం లేదని, వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకోవచ్చని ప్రకటించడమే కాదు తాను వితంతువును వివాహమాడి నిరూపించారు ముహమ్మద్ ప్రవక్త. అప్పటికే రెండుసార్లు వివాహం జరిగి, భర్తను కోల్పోయి, వితంతువుగా జీవనం సాగిస్తున్న 40 సంవత్సరాల వయస్సుగల ఖదీజా(రజి) ను వివాహమాడారు. తల్లిపాదాల క్రింద స్వర్గం ఉంది అని ప్రవచించి తన తల్లికి సేవ చేసుకుని స్వర్గాన్ని పొందే అర్హతను సంపాదించుకోవాలని ముహమ్మద్ (స) ప్రబోధించారు. మాతృమూర్తికి మహోన్నత స్థానాన్ని ప్రసాదించారు.

## అమ్మాయి పుట్టుక శుభం

ఆనాటి అరబ్బు సమాజంలో ఇంట్లో ఆడపిల్ల పుట్టుకనే నామోషిగా భావించేవాళ్లు. అప్పుడే పుట్టిన పసికందుల్ని, ముక్కు పచ్చలారని ఆడపిల్లలను సజీవ సమాధి చేసేవారు. ముహమ్మద్ ప్రవక్త (స)గా ప్రభవించిన తరువాత ఈ దురాగతాన్ని రూపుమాపారు. ఆడపిల్ల పుట్టుక ఇంటికి శుభోదయంగా మార్చారు. ఆడపిల్లను పెంచిపోషించి స్వర్గాన్ని పొందే అర్హతను సంపాదించుకోవటానికి తాపత్రయ పడేవారుగా ఆనాటి ప్రజల్లో పరివర్తన తెచ్చారు. మరి నేడు మనల్ని మనం గొప్ప నాగరికులుగా, ఆధునికులుగా చెప్పుకునే నేటి నాగరిక ప్రజల పరిస్థితి చూడండి, గర్భస్థ పిండం ఆడపిల్ల అని తెలిస్తే చాలు, తల్లికడుపులోనే ఆ పసికూనను హతమార్చడానికి వెనుకాడటం లేదు. ఆయన (స) తన నలుగురు ఆడ పిల్లలను ఎంతగానో ప్రేమగా చూసుకునే వారు. నమాజు తరువాత కుమార్తెల చేతులను ముద్దాడేవారు.

ముహమ్మద్ ప్రవక్త (స) చేపట్టింది ఒక సంస్కరణా ఉద్యమం. తన ఆచరణలతో తన జీవితాన్నే ఉదారహణగా మన ముందు ఉంచారు. ఆయన బోధనలు, ఆచరణలు మానవాళికి ఆదర్శనీయం. దేవుడు ప్రజలందరికీ పంపిన ఈ సందేశం నిజ దైవాన్ని తెలుసుకోవాలని, తీర్పు దినాన్ని విశ్వసించాలని తెలిపారు. దేవుడొక్కడే, మనుష్యులొక్కటే అన్న సందేశంతో అనేక దాస్యసృంఖలాలనుంచి విముక్తి చేసి దైవదాస్య మహాభాగ్యాన్ని ప్రసాదించారు. అందుకే ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శనీయం. సర్వమానవాళికి కారుణ్యం. అందుకే ఆయన అందరి ప్రవక్త. ❁

25వ పేజీ తరువాయి...

## మానవతా విప్లవానికి దీపశిఖ

సమాజాలను మార్చే శక్తి కలవి. ఉదాహరణకు, 'మీ పొరుగువారు ఆకలితో ఉంటే, మీరు గనక కడుపారా భోజనం చేస్తే మీలో విశ్వాసం లేదు, మానవత్వం లేదు' అని ఆయన చెప్పారు. ఒక నిజమైన ముస్లిం, ఒక నిజమైన మనిషి ఎలా ఉండాలో మనకు తెలియజేయడానికి ఈ ఒక్క వాక్యం సరిపోతుంది.

ఇస్లాం అంటే భయం కాదు, కరుణ. యుద్ధం కాదు, శాంతి. ద్వేషం కాదు, ప్రేమ. ఇది ప్రవక్త (స) జీవన సందేశం. ఆయన చెప్పిన 'అస్సలాము అలైకుం' అన్న అభివాదం ఒక్కటే చాలు, 'మీపై దేవుని శాంతి వర్షించాలి.' ఒకరు మరొకరికి శాంతిని అందించడం కన్నా గొప్ప విప్లవం ఇంకేదీ ఉండదు.

ప్రవక్త జన్మదినం రోజున చాలామంది మిఠాయిలు పంచుతారు, దీపాలు వెలిగిస్తారు, శాంతి ర్యాలీలు తీస్తారు. ఇదంతా అయన పట్ల ప్రేమతో చేస్తున్నామంటారు. కానీ అంతకంటే గొప్పది, ఆయన బోధనలు మన జీవితాల్లో అమలు పరచడం. పేదవారికి తోడుగా ఉండటం, వారికి సహాయం అందించడం, అన్యాయానికి ఎదురు నిలవటం, సత్యం కోసం త్యాగం చేయటం, ఆయన సందేశాన్ని నలుగురికీ పంచడం.. ఇదీ ప్రవక్త పట్ల నిజమైన ప్రేమకు నిదర్శనం.

నేడు సమాజం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకెళ్తోంది కానీ మనసుల్లో చీకట్లు ఇంకా తొలగనే లేదు. ద్వేషం, అసూయ, కులవివక్ష, అహంకారం పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మనకు గుర్తు చేసేదేమిటంటే, మానవులంతా ఒకే వంశం నుండి పుట్టారు. అందరూ సమానమే, పరస్పరం సోదరులే. ఈ సమానత్వ విప్లవమే మానవజాతికి రక్ష.

ప్రవక్త (స) ముస్లింలకే కాకుండా, మొత్తం మానవాళికి ఒక వరం. ఆయన మదీనాలో నిర్మించిన సహోదరత్వం, వివిధ వర్గాల మధ్య కుదిర్చిన ఒప్పందం, ఇవన్నీ నేటి గ్లోబల్ ప్రపంచానికి ఆదర్శం. ఆయన చూపిన మార్గం మత సహనం, పరులపట్ల గౌరవ భావం.

మన విద్యా వ్యవస్థలోనూ, సామాజిక చైతన్యంలోనూ ఆయన బోధనలకు స్థానం కల్పించాలి. ఎందుకంటే ఈ బోధనలు మతపరమైనవే కాదు, అవి మానవతా సిద్ధాంతాలు. పాఠశాలల్లో పిల్లలకు ఆయన జీవితం చెప్పినపుడు, వారు కేవలం జ్ఞానవంతులు మాత్రమే కాకుండా, మంచి మనుషులుగా పెరుగుతారు.

ఒకసారి ప్రవక్త మహనీయులు (స) ఇలా చెప్పారు: 'మీలో ఉత్తముడు ఎవరంటే, తన భార్యపట్ల, తన కుటుంబం పట్ల ఉత్తమ రీతిలో ప్రవర్తించేవాడు.' ఈ వాక్యం ఈ కాలంలో ఎంత గొప్ప అర్థం ఇస్తుందో మనమందరం ఆలోచించాలి. కుటుంబ విలువలు కూలిపోతున్న సమయంలో, ఈ బోధనే మనకు రక్షణ.

నేటి ముస్లిం సమాజం ప్రవక్త ప్రబోధనలను ఆధ్యాత్మిక విప్లవంలా మలుచుకోవాలి. సత్యం, న్యాయం, కరుణ, సహనం ఇవి మన రోజువారీ జీవితంలో భాగం కావాలి.

ప్రవక్త(స) పలికిన ఒక్కొక్క మాట మనకు గొప్ప పాఠం నేర్పుతుంది, 'విద్య, జ్ఞానం పొందడం ప్రతి విశ్వాసికీ తప్పనిసరి' అని ప్రవక్త (స) చెప్పారు. ఈ మాట ముస్లింలనే కాకుండా, మొత్తం మానవాళిని మేలుకొలుపుతుంది. జ్ఞానం లేని సమాజం ఎప్పటికీ బానిసగానే ఉంటుంది.

ఈ రోజు యువతలో నిరాశ ఎక్కువైపోయింది. వారు తమలో ఉన్న శక్తిని మర్చిపోయారు. ప్రవక్త వారి జీవిత విశేషాలతో వారిని మేల్కొలపాలి. ఒక చిన్న బృందం కూడా ధైర్యంగా నిలబడి చరిత్ర గతినే మార్చివేయగలదు. కాబట్టి యువత తమలోని శక్తిని గుర్తించాలి.

ఈ రోజు ప్రపంచం ముస్లింలను తప్పుగా చూపడానికి ప్రయత్నిస్తోంది. కానీ మన సమాధానం ఒక్కటే, ప్రవక్త (స) బోధనలను మన జీవితంలో చూపించడం. ఒక ముస్లిం నిజాయితీగా, శాంతియుతంగా, కరుణతో ఉంటే ప్రపంచానికి అదొక సంకేతంగా నిలుస్తుంది.

కాబట్టి ప్రవక్త జన్మదిన వేడుకను హంగూ ఆర్భాటాలతో జరుపుకోవడం కాదు, ఆయన సందేశాన్ని, ఆయన బోధనలను సర్వసామాన్యం చెయ్యడానికి ప్రయత్నించాలి. మనలోని స్వార్థం, అసూయ, ద్వేషం అన్నింటినీ తీసేసి, ఆయన బోధనలతో నింపాలి.

మనం ఆయన బోధనలను అనుసరిస్తే, మీలాదున్నబీ కేవలం ఒక ఆచారంగా కాకుండా, ప్రతీ రోజు మానవతా వెలుగు ప్రసరిస్తుంది. మీలాదున్నబీ అనేది గతాన్ని స్మరించుకోవడం కాదు. అది భవిష్యత్తుని నిర్మించుకోవడం.

ప్రవక్త(స) జీవితం, బోధనలు, త్యాగం, కరుణ, సత్యం, సహనం.. ఇవన్నీ మనలోని ప్రతి ఒక్కరికీ ఒక జీవన విప్లవం.

మనలో ప్రతి ఒక్కరూ ఆయన బోధనల్లో ఒక కాంతిరేఖ అయితే, ఈ ప్రపంచం చీకటిని జయిస్తుంది. అందుకని మనం ఆ మహనీయుని జీవన ప్రయాణాన్ని, ఆయన ఆచరణాత్మక ప్రమాణాన్ని, ఆయన గారి జీవన సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి.




హిబా అర్జుమంద్ ఖాన్

**మానవ** జాతి సంస్కరణకు, సముద్ధరణకు భువిపై ప్రభవించిన మహనీయులలో ముహమ్మద్ ప్రవక్త (స) చిట్ట చివరివారు. ఈయన క్రీ.శ. 571 ఏప్రిల్ నెల 22వ తేదీన సోమవారం రోజు అరేబియాలోని మక్కా నగరంలో జన్మించారు. ఆమినా, అబ్దుల్లాహ్ తల్లిదండ్రులు. జననానికి రెండునెలల ముందే తండ్రినీ, ఆరేళ్ళప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. అనాథ అయిన ఆరేళ్ళ బాబును తాతయ్య అక్కున చేర్చుకున్నారు. ఆయన తరువాత ముహమ్మద్ సంరక్షణా బాధ్యతను పెత్తండ్రి స్వీకరించారు.

ముహమ్మద్ ప్రవక్త (స) వారు చదవడం, రాయడం రాని నిరక్షరాసి. అయినా ఆయన బోధనలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. మానవ సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు, సవాళ్ళకు ఆయన పరిష్కారం చూపారు. ఒక కులానికో, మతానికో, ఒక వర్గానికో, ప్రాంతానికో, ఒక దేశానికో ఆయన బోధనలు పరిమితం కాలేదు. సమస్త మానవులూ ఆయన సంబోధితులే. మానవ జీవితంలోని ఏ రంగమూ ఏ దశలోనూ ఆయన మార్గదర్శకానికి వెలుపల లేదు. కుటుంబం, సమాజం, ఉద్యోగం, వ్యాపారం, నైతికం, ఆర్థికం, ఆరోగ్యం, ఆధ్యాత్మికం, రాజకీయం - ఇలా.. అదీ ఇదీ అని కాకుండా, మానవ జీవితంలోని సమస్త రంగాల్లో ఆయన మార్గదర్శకం వహించారు. మనిషి పుట్టింది మొదలు మరణించే వరకు వివిధ దశల్లో, వివిధ రంగాల్లో ఎలా నడుచుకోవాలో, ఏది హితమో, ఏది హితం కాదో ఆచరణాత్మకంగా విశద పరిచారు.

మానవాళి ఈ బోధనలను అనుసరించినంత కాలం సమాజం సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉంది. ఎప్పుడైతే మానవులు దీనికి భిన్నంగా నైతికతకు తిలోదకాలిచ్చి, న్యాయాన్ని, ధర్మాన్ని తుంగలో తొక్కారో, అప్పటినుండి మళ్ళీ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగానే నేడు సమాజంలో నైతిక పతనం కొనసాగుతోంది. బడుగు బలహీన వర్గాల హక్కులు హరించబడుతున్నాయి. అనేక వర్గాల ప్రజలు హక్కుల కోసం రోడ్లెక్కుతున్నారు. సమాజంలో వివక్ష కొనసాగుతోంది. వరకట్న హత్యలు, శిశుహత్యలు సమసిపోలేదు. మహిళలు నేటికీ తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. కుల వివక్ష, అంటరానితనం కనబడుతూనే ఉంది. మద్యం ఏరులై ప్రవహిస్తోంది. మత్తు

పదార్థాలు, మద్యపాన ప్రియత్వం పెరుగుతూనే ఉంది. అపసవ్యమైన ఆర్థిక విధానాల వల్ల పేదవాడు కడు దరిద్రుడుగా, సంపన్నుడు మరింత సంపన్నుడుగా మారిపోతున్నాడు. మహిళా మణుల ధనమాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. కళల పేరుతో, స్వేచ్ఛ పేరుతో స్త్రీని బజారుకీడ్చి, అంగడి సరుకుగా మార్చింది నేటి మన ఆధునిక సమాజం. అస్తవ్యస్త విధానాలవల్ల ఆర్థిక రంగం కుదేలైపోయింది. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాలు కలుషితమయ్యాయి. మోసం, దగా, వంచన, అవినీతి, అక్రమాలు సర్వసాధారణమయ్యాయి. రాజకీయ రంగం అవినీతి, బంధుప్రీతి, అనైతికత, అమానవీయతలతో నిండిపోయింది. రాజకీయాలు ప్రజాసేవ కోసం అన్న పవిత్ర భావన అటకెక్కి, అందిన వరకు పిండుకొనే ఆయాచిత వరంగా మారిపొయ్యాయి.

ఈ విధంగా సమాజంలోని అన్నిరంగాలూ కలుషితమై, భ్రష్టుపట్టి అశాంతి, అలజడి, అభద్రతలతో సతమతమవుతుంటే, మనం సాధించిన ప్రగతికి ఇక అర్థమేముంటుంది?ఈనాడు మనం అనేక రంగాల్లో అద్భుతాలు సాధించామనడంలో ఏమాత్రం సందేహంలేదు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన ప్రగతి అంబరాన్ని చుంబిస్తోంది. కాని నైతికంగా, ధార్మికంగా, విలువల పరంగా మనం ఏ దిశగా పయనిస్తున్నామన్నది ప్రశ్నగానే మిగిలి ఉంది.

కనుక, ఇకనైనా మనం మరిచిపోయిన పాఠాన్ని మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విస్మరించిన మార్గాన్ని అనుసరించాల్సిన ఆవశ్యకత ఉంది. ముహమ్మద్ ప్రవక్త (స) వారి బోధనలు, ఉపదేశాలవైపు మరలవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, ఆ మహనీయులు గొప్ప దైవప్రవక్త అయి ఉండి కూడా ఒక సామాన్యుడిలా, సామాజిక కార్యకర్తలా సమాజానికి సేవ చేస్తూ, ప్రజల్ని సన్మార్గ పథాన నడిపించారు. ఇహపర వైఫల్యాల నుండి రక్షించారు. సమాజంలోని సమస్త అసమానతలు, అమానవీయతలతో పాటు, అన్నిరకాల దుర్మార్గాలు, దౌర్జన్యాలను రూపుమాపారు. మానవులంతా ఒక్కటే, మనిషీ మనిషికి మధ్య ఎలాంటి వ్యత్యాసం, ఆధిక్యతలేదు. అందరూ సమానమే. అంతా ఒక తల్లి దండ్రి బిడ్డలే అన్నది ఆయన సందేశం. ఆధిక్యతకు, గౌరవానికి అసలైన కొలమానం నీతి నిజాయితీ, సత్ ప్రవర్తనలే అనేది ఆ మహనీయుని నిర్వచనం. మానవ సమానత్వానికి, సామరస్యం, సోదరభావాలకు ఇది నిలువెత్తు నిదర్శనం. సాటి మానవుల ధన, ప్రాణాలను హరించడం, వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించడం, వారి మనో భావాలను గాయపరచడం, ఒకరిపై నిందలు వేయడం, చాడీలు చెప్పడం, వారి హక్కులను కాలరాయాలనుకోవడం మహా పాతకాలని, క్షంతవ్యం కాని నేరాలన్న ఆ మహాత్ముని హితోపదేశాలు మానవ హక్కుల పరిరక్షణకు అద్భుతమైన కవచాలు. శ్రామికుల స్వేద బిందువుల తడి ఆరకముందే వారి వేతనం చెల్లించి వేయాలన్న కారుణ్య బోధ కష్టజీవుల పట్ల ఆ మమతల మూర్తికున్న కరుణకు తిరుగులేని నిదర్శనం. కార్మికుల హక్కుల్ని మానవ హక్కులుగా పరిగణించి, పనికి తగిన గౌరవం ఇవ్వాలని, సహేతుకమైన వేతనం నిర్ణయించాలని, ఆ వేతనం వెంటనే చెల్లించాలని పద్నాలుగు వందల యాభై సంవత్సరాల నాడే ప్రవక్త ప్రబోధించారు.

'మీ క్రింది ఉద్యోగులు మీ సోదరులు. దైవం వారిపై మీకు ఒకింత అధికారం ఇచ్చాడు, కనుక మీ సోదరుల పట్ల గౌరవ మర్యాదలతో ప్రవర్తించండి. మీరు తినేదే వారికీ పెట్టండి, మీరు ధరించేదే వారికీ ఇవ్వండి. శక్తికి మించిన భారం వారిపై మోపకండి, అధిక భారం మోయటంలో వారికి సహాయం చేయండి' అని కింది ఉద్యోగులకు సోదర సమాన హోదా ప్రసాదించారు.

ప్రవక్త (స) సేవకులను తన కుటుంబ సభ్యులుగా చూసేవారు.


గీటురాయి

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు!

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

బ్యాంక్ అకౌంట్ వివరాలు

GEETURAI WEEKLY
Central Bank of India, Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

వారిపట్ల ఎన్నడూ కఠినంగా వ్యవహరించేవారు కాదు. వారిలో ఎవరైనా వ్యాధిగ్రస్తులైతే స్వయంగా వెళ్లి పరామర్శించేవారు. వారి ఆరోగ్యం కోసం దుఆ చేసి, ఆర్థిక సహాయం అందించేవారు.

ప్రవక్త మహనీయులు అనుచరులకు, కార్మికులకు వారి శక్తికి మించిన పని చెప్పేవారు కాదు. పని ఎక్కువగా ఉండి వారు దాన్ని చేయలేకపోతే, స్వయంగా తను ఆ పనిలో పాలు పంచుకొని సహకరించేవారు.

మహిళలను గౌరవించాలని, వారిపట్ల చులకనభావం కూడదని ముహమ్మద్ ప్రవక్త(స) విస్పష్టంగా ప్రకటించారు. తల్లిపాదాల క్రింద స్వర్గం ఉన్నదని చెప్పి స్త్రీజాతి ఔన్నత్యాన్ని శిఖర స్థాయికి చేర్చారు. తల్లిదండ్రులు తమ సంతానానికి మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని, భావితరాల సంక్షేమానికి ఇది చాలా అవసరమని నొక్కి వక్కాణించారు. విద్యనేర్చుకోడానికి అవసరమైతే చైనా దేశమైనా వెళ్ళమని విద్యా విజ్ఞానాల ప్రాముఖ్యతను తెలియజేశారు. పారేనది ఒడ్డున ఉన్నప్పటికీ నీటిని వృథాచేయరాదని, వృక్ష సంపదను నాశనం చేయకూడదని, ప్రకృతి సమతుల్యతకు, మానవాళి మనుగడకు ఇవి అత్యంత అవసరమని ఉద్బోధించారు. ప్రళయం ముంచుకొస్తున్నప్పటికీ, మీ చేతిలో ఒక మొక్క ఉంటే ముందు దాన్ని నాటండని పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటి చెప్పారు. మొక్కలు నాటడం సదఖా అని కూడా ప్రవక్త మహనీయులు ఉపదేశించారు.

అందుకే, 'ధర్మబోధకులందరిలో అధికంగా సాఫల్యాన్ని పొందిన ప్రవక్త 'ముహమ్మద్ 'మాత్రమేనని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా ఘనంగా కీర్తించింది. కనుక ఈనాటి పరిస్థితులు, పరిణామాల దృష్ట్యానైనా ముహమ్మద్ (స) ప్రవక్త వారి బోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం ఆధునికత, శాస్త్ర విజ్ఞానమొక్కటే సర్వరోగ నివారిణి కాదు. దాంతోపాటు నైతిక, మానవీయ విలువలను ప్రోదిచేసే దైవప్రవక్తల ఉపదేశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. శాస్త్ర విజ్ఞానానికి ఆధ్యాత్మిక దృక్పథం జోడించి విలువల పునర్నిర్మాణానికి పూనుకోవాలి. ఈ విషయంలో ముహమ్మద్ ప్రవక్త (స) వారు తన 23 ఏళ్ళ దైవదౌత్య కాలంలో సాధించిన అపూర్వ విజయ సాఫల్యాలను, ఆయన నిర్మించిన సుందరమైన సత్ సమాజాన్ని గమనంలోకి తీసుకోవాలి. తద్వారా నేటి మన సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అధిగమించి, నైతిక, మానవీయ విలువలతో నిండిన సంక్షేమ రాజ్యాన్ని పునర్ నిర్మించుకోవచ్చు. ❁

## హృదయాల విజేత
# ముహమ్మద్ ప్రవక్త(స)

అరబ్బు దేశం మొత్తం అంధకారంలో
కొట్టుమిట్టాడుతున్నప్పుడు
అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)
పవిత్ర మక్కా నగరంలో జన్మించారు
పుట్టక ముందే తండ్రి అబ్దుల్లాహ్‌ను కోల్పోయారు
పుట్టిన తర్వాత తల్లి బీబీ ఆమినాను కోల్పోయారు
బాబాయి అబూ తాలిబ్ తన సొంత కొడుకులా
అల్లారు ముద్దుగా పెంచి పోషించినారు
ప్రవక్తకు పూర్వమే ప్రజలందరిలో
అమీన్‌గా, సాదిక్‌గా పేరుగాంచారు
బహుదైవారాధన మహాపాపం అంటూ
అల్లాహ్ వైపునకు పిలుపునిచ్చారు
మరుభూమిగా మారిన ఎడారిలో
సత్యధర్మాన్ని పరిపూర్ణం చేశారు
తల్లిదండ్రుల సేవయే దైవసేవ అని
వారితో సత్ప్రవర్తన కలిగి ఉండాలని హితవు పలికారు
పుట్టిన ఆడపిల్లలను సజీవ సమాధి చేసే మూఢులకు
ఆడపిల్లలే స్వర్గానికి దారులన్నారు
రెండోసారి వితంతువు అయిన హజ్రత్ ఖదీజా(ర)ను
వివాహమాడి వితంతు జనోద్ధరణకు శ్రీకారం చుట్టారు
మానవుల్లోని శత్రు బంధాలను తెంచివేసి
పవిత్రమైన మానవ బంధాలు పూయించారు
జనోద్ధరణకై దీపంలా కరిగిపోతూ
సమాజంలో వెలుగు నింపారు
సర్వ మానవాళిచే ఇదే మీకు
కోటి కోటి శతకోటి సలాములు

**- అజ్రా నిషాత్, టీచర్,**
**సిద్దిపేట**




ముహమ్మద్ గౌస్ ఖాన్

**సర్వమానవుల** సాఫల్యం కోసం పంపించబడిన దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల దైవప్రవక్తలలో మొట్ట మొదటి వారు హజ్రత్ ఆదం (అలై) కాగా, చిట్ట చివరివారు మహనీయులు ప్రవక్త ముహమ్మద్ (స).

తల్లిదండ్రులు, భార్యాభర్తలు, సంతానము, ఇరుగు పొరుగు, మిత్రులు ఇంకా ఊరూ వాడలతో కలిసి మెలిసి జీవించడాన్ని "సంఘ జీవితం" లేదా "సామాజిక జీవితం" అని అంటాము. ప్రవక్త (స) సంఘ జీవితానికి ఎంతో ప్రాధాన్యత నిచ్చారు. వారు ఈ విషయమై సమాజములో ప్రతి ఒక్కరి హక్కులు, బాధ్యత లను చాలా స్పష్టంగా తెలియజేశారు. ఆయన(స) తెలిపిన ప్రతి వాక్కు ప్రతి ఒక్కరికీ ఆదర్శం.

తల్లిదండ్రుల సేవ గురించి ప్రస్తావిస్తూ మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు: తల్లిదండ్రులను గౌరవించడం, వారికి సేవ చెయ్యడం, వారి ఆజ్ఞలను శిరసావహించడం సంతాన బాధ్యత అవుతుంది. ఒక వ్యక్తి ప్రవక్త (స) దగ్గరకు వచ్చి "ఓ దైవప్రవక్తా! నా సేవకు అందరికంటే ఎక్కువగా హక్కుదారులెవరు?" అని అడిగాడు. దానికి ఆయన(స) "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. అతను తిరిగి "ఆ తరువాత ఎవరూ" అని అడిగాడు "నీ తల్లి" అని సమాధానం వచ్చింది. తిరిగి అతను "ఆ తరువాత" అని అడగ్గా, తిరిగి "నీ తల్లి" అనే సమాధానం పలికారాయన. అతను నాలుగోసారి అడగ్గా "నీ తండ్రి", ఆ తరువాత బంధువులు, స్నేహితులు అని సమాధానమిచ్చారు ప్రవక్త (స). (బుఖారి, ముస్లిం, అబూ హురైరా)

మరో సందర్భంలో "తల్లిదండ్రులను సంతోష పెట్టడమంటే అల్లాహ్‌ను సంతోష పెట్టడం. వారిని బాధ పెట్టడమంటే అల్లాహ్ ఆగ్రహాన్ని చవిచూడటం" అని ప్రవక్త (స) తెలిపారు.

దైవప్రవక్త(స) ఒకసారి "వాడి ముక్కుకు మన్ను తగల" అని మూడు సార్లు అన్నారు. "ఓ దైవప్రవక్తా! ఎవడు వాడు" అని అక్కడున్న వారు అడిగారు. దానికి ఆయన (స) "తన తల్లిదండ్రు లలో ఒక్కరినో లేక ఇద్దరినో వృద్ధాప్యంలో చూసి (వారి సేవ చేసి) స్వర్గంలో ప్రవేశించనివాడు" అని సమాధానమిచ్చారు.

సంతానం పట్ల తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తూ ప్రవక్త(స) ఇలా తెలిపారు: "పిల్లలను ప్రేమించడం, మంచి విద్యా బుద్ధులు నేర్పించడం, సజ్జనులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చెయ్యడం తల్లిదండ్రుల బాధ్యత." ఆయన (స) తన కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి)ను ఎంతగానో ప్రేమించేవారు. ఆమెకు మంచి సంస్కారం ఇచ్చి ఎంతో ఉత్తమంగా తీర్చిదిద్దారు.

"తండ్రి తన సంతానానికి బహూకరించే వాటన్నింటిలో శ్రేష్ఠమైన

కానుక ఉత్తమమైన చదువు సంస్కారాలే" అని దైవ ప్రవక్త (స) బోధించారు. (సయీద్ బిన్ ఆస్, మిష్కాత్)

మరో సందర్భంలో ఆయన (స) ఇలా తెలిపారు. "తండ్రి తన సంతానానికి మంచి సభ్యతా సంస్కారాలు నేర్పించడం ఒక "సా" దానము చెయ్యడం కంటే ఉన్నతమైనది" సంతానానికి సాధారణ విద్యతో పాటు ధార్మిక విద్యను అందించడం చాలా అవసరం.

అఖ్రా బిన్ హాబిస్(రజి) ఒకసారి ప్రవక్త(స) దగ్గరకు హాజర య్యాడు. అప్పుడు ఆయన (స) తన మనమడు ఇమాం హసన్(రజి)ను ముద్దాడుతున్నారు. ఈ సన్నివేశం అతనికి వింతగా కనిపించి "ఓ ప్రవక్తా! మీరు పిల్లలను ముద్దాడుతారా, నాకు పది మంది పిల్లలు ఉన్నారు. నేనెప్పుడూ వారిని ముద్దాడలేదు" అని అన్నారు. ప్రవక్త(స) అతని వైపు చూసి "అల్లాహ్ నీ హృదయం నుండి పిల్లల ప్రేమాభిమానాలను తొలగించి వేస్తే నేనేమి చెయ్యగలను" అని అన్నారు.

భార్యాభర్తల హక్కులు, బాధ్యతలను వారిరువురూ గుర్తుంచు కోవడం చాలా అవసరం. కుటుంబ జీవనం భార్యా భర్తల పవిత్ర బంధంతో ప్రారంభమవుతుంది. భార్యాభర్తలిద్దరూ తమ సాంసారిక జీవితం, దాని నియమాలు, బాధ్యతల్ని సరిగ్గా అర్థం చేసుకొని నడుచుకుంటే ఆ కుటుంబం మూడు పువ్వులు, ఆరు కాయల్లా వర్థిల్లుతుంది.

"తమ భార్యల ఎడల మంచిగా మెలిగే వారే, మీలో అందరికంటే మంచి నడవడిక గలవారు" అని ప్రవక్త(స) భర్తలకు గుర్తు చేశారు. ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త (స)ను "భార్యకు తన భర్తపై గల హక్కు ఏమిటి?" అని అడగ్గా ఆయన(స) ఇలా బోధించారు. "అతను తినేదే ఆమెకూ పెట్టాలి. అతను తొడిగినది ఆమెకూ తొడిగించాలి. ఆమెను ముఖంపై కొట్ట రాదు. ఆమెను శాపనార్థా లతో తిట్టకూడదు. ఆమెతో దూరంగా మెలిగినా అది ఇంటి వరకే" అని అన్నారు . (అబూదావూద్)

హజ్రత్ అబూహురైరా (ర) ఇలా ఉల్లేఖించారు. "ఒక విశ్వాసి విశ్వాసురాలైన తన భార్యను అసహ్యించుకోకూడదు. ఆమెలోని ఏదయినా ఒక గుణం తనకు నచ్చకపోయినా, మరెన్నో ఇతర గుణాలు తనకు నచ్చవచ్చు" అని దైవప్రవక్త (స) ప్రబోధించారు. (ముస్లిం-అబూహురైరా)

ఒక సహాబీ ఎల్లప్పుడూ దైవారాధనలో నిమగ్నమై ఉండేవారు. ఆయన దైవారాధనలో ఎంతగా లీనమై ఉండే వారంటే, భార్యను కూడా అసలు పట్టించుకునేవారు కాదు. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రవక్త(స) ఆ సహాబీని పిలిపించి "నీపై నీ భార్య హక్కు కూడా ఉంది" అని గుర్తు చేశారు.

ప్రవక్త (స) భర్తలకు తమ బాధ్యతలను గుర్తు చేస్తూనే, భర్తల విషయంలో భార్యల బాధ్యతలను కూడా గుర్తు చేశారు.

ప్రవక్త (స) ఇలా తెలిపారు: దైవభీతి, ధర్మపరాయణతల తరువాత ఒక విశ్వాసికి ఉత్తమురాలైన భార్యకన్నా మించిన సంపద ఏదీ లేదు". ఒకరు ప్రవక్త (స)ను అడిగారు. "ఉత్తమ మహిళ ఎవరు" అని. దానికి ఆయన (స) ఇలా తెలిపారు : "ఏ మహిళయితే భర్త తన వైపు చూసినప్పుడు అతన్ని ప్రసన్నం చేస్తుందో, ఎవరయితే భర్త ఏదయినా చెయ్యమన్నప్పుడు ఎదురు చెప్ప కుండా చేస్తుందో, ఎవరయితే తన విషయంలో, తన సొత్తు విషయంలో తన భర్త మనస్సు నొప్పించే వైఖరి అవలంబించదో ఆమె ఉత్తమ మహిళ". (నసాయి, అబూహురైరా)

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స) ఇలా తెలిపారు : "ఒక మనిషి అల్లాహ్‌కు తప్ప మరో మనిషి ముందు సజ్దా (సాష్టాంగపడటం) ధర్మ సమ్మతం కాదు. ఒక వేళ అలా చెయ్యడానికి అనుమతి ఉంటే భర్త ముందు సజ్దా చెయ్యమని భార్యకు ఆజ్ఞ ఇవ్వబడేది".

బంధువుల హక్కుల విషయంలో ప్రవక్త ముహమ్మద్ (స) చాలా జాగ్రత్తగా ఉండేవారు. ఆయన(స) బంధువుల హక్కులను స్వయంగా నెరవేరుస్తూ, అలాగే ఇతరులకు కూడా "మీరు మీ బంధువుల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉండండి. వారి హక్కులను పూర్తిగా నెరవేర్చండి" అని తాకీదు చేసేవారు. ప్రవక్త(స) తన కుటుంబ సభ్యులను ప్రేమించినట్లుగా ఇతరులు ఏ ఒక్కరూ అలా ప్రేమించడం నేను చూడలేదు అని హజ్రత్ అనస్(రజి) తెలిపారు.

"ఎవరయితే తన సంపద, ఆయుష్షు వృద్ధి కావాలని కోరు కుంటారో వారు తమ బంధువులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలి" అని ప్రవక్త (స) తెలిపారు. బంధవులు చేసిన మేలుకు బదులుగా మేలు చెయ్యడం సంపూర్ణంగా "సిలారహ్మీ" కాజాలదు. ఉత్తమమైన "సిలారహ్మీ" అంటే - "తమ బంధువులు తమతో సంబంధాలు తెంపుకున్నా వారు మాత్రం వారితో వారి బాంధ వ్యాన్ని పెంపొందించుకుంటూ, వారి హక్కులను నిర్వర్తిస్తూ ఉండాలి" అని ప్రవక్త(స) ఉపదేశించారు.

(బుఖారి-ఇబ్ను ఉమర్)

పొరుగు వారి హక్కుల విషయంలొ ప్రవక్త(స) ఇలా తాకీదు చేశారు : "తల్లిదండ్రులు, బంధుమిత్రుల తరువాత ఇరుగు పొరుగు వారితో మంచిగా ఉండాలి. అలాగే వారితో సత్సంబం ధాలు ఉంచుకొని, మంచిగా మసలుకోవాలి."

ఒకసారి అబూజర్ (రజి) కు ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు. "అబూజర్! నీవు ఏదయినా కూర వండినప్పుడు అందులో కాస్త నీరు ఎక్కువగా పోయి, నీ పొరుగు వారిని కూడా కనిపెడుతూ ఉండు." (ముస్లిం)

దైవప్రవక్త(స) మహిళలను ఉద్దేశించి, "ఓ మహిళల్లారా! పొరుగింటి వనితకు ఇచ్చేందుకు ఏ కానుకనూ తక్కువైనదిగా భావించకండి. అది ఒక మేక కాలి డెక్కయినా సరే" అన్నారు. (బుఖారి)

ఇబ్ను అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు. "తాను కడుపు నిండా భుజించి, తన ప్రక్కన ఉండే పొరుగు వాడు పస్తుగా ఉండటాన్ని సహించే వ్యక్తి విశ్వాసి కాజాలడు" అని ప్రవక్త (స) బోధించారు.

"ప్రళయ దినాన ప్రప్రథమంగా విచారణకు హాజరు అయ్యేవారు ఇద్దరు పొరుగువారే" అని మహనీయులు ముహమ్మద్ (సఅస) తెలిపారు. (మిష్కాత్ )

బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన అనాథల గురించి ప్రవక్త(స) ఇలా బోధించారు : "అనాధలను ప్రేమించడం, వారిని పెంచడం, వారి ఆలనా పాలన చూడటం, మంచి విద్యాబుద్ధులు నేర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత".

"ఏ ఇంటిలో ఒక అనాథ ఉండి, అతని పట్ల సవ్యంగా ప్రవర్తించడం జరుగుతుందో అదే ఉత్తమ గృహం. మరి ఏ ఇంటిలో ఒక అనాథ ఉండి, అతని పట్ల చెడుగా ప్రవర్తించడం జరుగుతుందో ఆ ఇల్లు అన్ని ఇళ్ళలోకెల్లా చెడ్డ ఇల్లు" అని ప్రవక్త (స) తెలిపారు.

హజ్రత్ అబూహురైరా(రజి) గారి ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "ఒక వ్యక్తి ప్రవక్తతో తన హృదయ కాఠిన్యాన్ని గురించి ప్రస్తావించాడు. దానికి ఆయన "అనాథ తల నిమురు, ఆర్తునికి భోజనం పెట్టు" అని ఉపదేశించారు. (మిష్కాత్)

భర్త చనిపోయిన స్త్రీని వితంతువు అంటాము. అలాంటి స్త్రీలను ఆదరించడం, వారి సేవ చేయడం, వారి అవసరాలను తీర్చడం ఎంతో పుణ్యకార్యం. "వితంతువులు, నిరుపేదల కొరకు శ్రమించే వాడు దైవ మార్గములో నిరంతర కృషి సలిపే వానికి సమానం. రాత్రంతా దైవ సన్నిధిలో నిలబడి ప్రార్థన చేసినప్పటికీ అలసట చెందని వానితో సమానం. పగటి పూట ఏమీ తినకుండా ఎడ తెరిపి లేకుండా ఉపవాస వ్రతం పాటించే వానితో సమానం" అని దైవ సందేశహరులు (స) అన్నారు. (బుఖారి, ముస్లిం)

సమాజంలోని అగత్యపరులు, నిరుపేదలను ఆదుకోవడం, వారి కోసం శ్రమించడం, వారి అవసరాలను తీర్చడం ఎంతో పుణ్య కార్యం. అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) తన సమయాన్ని ఎక్కువగా ఇలాంటి సమాజ సేవలోనే వెచ్చించేవారు.

"ఎవరయితే తన సోదరుని అవసరాన్ని తీరుస్తాడో, అతని అవసరాన్ని అల్లాహ్ తీరుస్తాడు. ఎవరయితే ఒకరిపై ఆసన్నమైన కష్టాన్ని దూరం చేస్తాడో, ప్రళయ దినాన అతనికి ఎదురయ్యే కష్టాన్ని అల్లాహ్ దూరం చేస్తాడు. ఎవరయితే ఒకరి లోపాలను మరుగు పరుస్తాడో, అల్లాహ్ ప్రళయ దినాన అతని తప్పిదాలను కప్పి పుచ్చుతాడు" అని ప్రవక్త (స) బోధించారు.

ఒకసారి ప్రియ ప్రవక్త (స) హజ్రత్ అబూజర్ (రజి)తో ఇలా అన్నారు : "ఓ అబూజర్! దారి తప్పిన వారికి అంధులకు దారి చూపడం, దారిలో ఉన్న రాయీరప్ప మరియు ముళ్ళను తొలగించడం వల్ల పుణ్యం వస్తుంది. ఎందుకంటే దీని వల్ల సమాజానికి మేలు జరుగుతుంది".

"ఎవరయితే అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసిస్తారో, వారు తమ అతిథిని ఆదరించి సత్కరించాలి" అని ప్రవక్త (స) ఆదేశించారు.

ఆయన (స) ఇంకా ఇలా తెలిపారు : అతిధి కోసం మొదటి రోజు విందు, సత్కారింపుల దినం. ఆ రోజు అతిధికి వీలయినంత స్వాదిష్ఠమైన అన్న పానీయాలు సమకూర్చాలి. ఆతిథ్యం మూడు రోజులు. రెండవ, మూడవ రోజు కోసం అంతగా శ్రమించ వలసిన అవసరం లేదు. మూడు రోజుల తరువాత అతిథికి చేసే సేవలు "సదఖా" (దానం)గా పరిగణించబడతాయి. ఇంటి వారిని కష్టపెట్టే వరకు బస చేయడం అతిథికీ ధర్మ సమ్మతం కాదు. (బుఖారి, ముస్లిం)

ప్రవక్త(స) అల్లాహ్‌ను విశ్వసించేవారు. ఆయన పైనే భారం మోపే వారు. అల్లాహ్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటించేవారు. జీవితములోని ప్రతి క్షణం ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. ఎల్లప్పుడూ తన ఉమ్మత్ గురించే ఆలోచించేవారు. ఆయన ప్రతి చర్య గ్రంథస్థం చేయబడింది. అవి మన కోసం మన రాబోవు తరాల కోసం మార్గదర్శకం. వారి అనుచరులు ఆ రోజుల్లో ఉన్నారు. ఈ రోజుల్లోనూ ఉన్నారు. వారి క్రియాశీలక చర్యలు నాడూ ప్రకాశించాయి. నేడూ ప్రకాశిస్తున్నాయి. రేపూ ప్రకాశిస్తాయి. ఆయన సర్వమానవుల కోసం సన్మార్గం చూపించడానికి పంపించబడిన ఆదర్శప్రాయమైన దైవప్రవక్త. ❀



# సమగ్ర జీవితానికి సంపూర్ణ స్వరూపం

# ముహమ్మద్ ప్రవక్త (స)

**షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం**

**సృష్టి** జీవరాశులలో అత్యుత్తమ జీవి మనిషి. సృష్టిలోని చరాచర రాశులన్నీ మానవ సేవ కోసం సృష్టించబడ్డాయి.

పరీక్ష కోసం మానవులకు మాత్రమే మంచీ చెడుల విచక్షణా జ్ఞానం ఇచ్చి, తన ఇష్టం వచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ప్రసాదించ బడింది.

చావు పుట్టుకల నడుమ మానవ జీవిత మర్మాన్ని వివరించి మనిషిగా ఎలా జీవించాలో, ఎలా జీవిస్తే ఇహపరాల జీవితం సాఫల్యం అవుతుందో ఆచరణాత్మకంగా తెలియజేయడానికి లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తలు పంపబడినట్లు ఇస్లాం చెబుతుంది.

అలా వచ్చిన సందేశహరులలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చివరి వారు. ఆయన జీవితం ప్రళయం వరకు వచ్చే మానవులందరికీ ఆదర్శం.

ఒక్క విగ్రహం లేదు, కనీసం చిత్రపటం లేదు. అయినా విశ్వ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది ఆయన అంటే ప్రాణం, ఆయన ప్రతి బోధన వారికి ఒక నిర్దిష్టమైన గీత. ఎందుకంటే ఆయన మానవ జీవితంలోని ప్రతి రంగాన్ని ఆచరణాత్మకంగా సంస్కరించారు.

శాస్త్ర సాంకేతికంగా ఎంతో ఎదిగినా నేటి మానవుల మధ్య అసమానతలు కొనసాగుతునే ఉన్నాయి. ఎన్ని సంస్కరణలు చేసినా ఎందరో మహనీయులు కృషి చేసినా నేటికీ ఈ అసమానతలను దూరం చేయలేకపోయారు.

కానీ 1500 సంవత్సరాల క్రితమే మానవ సమానత్వం కోసం కృషి చేయడమే కాదు అలాంటి సమాజాన్ని నెలకొల్పారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ఈ సృష్టికి సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే. మానవులందరూ ఒకే జంట ఆదం, హవ్వాల సంతానం. కనుక మీరంతా పరస్పరం సోదరులు. కులం మతం వర్గం వర్ణం, ప్రాంతం ప్రాతిపదికగా మీలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ కాదు. మీలో ఎవరైతే నైతికంగా ఉన్నతులో వారే దేవుని దృష్టిలో గొప్పవారు, ఉన్నతులు

అని చాటి చెప్పి సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పిన మహనీయుడు ఆయన.

కేవలం చాటి చెప్పడమే కాదు, ఆచరణాత్మకంగా ఆచరించే సమాజాన్ని జాగృతం చేసారు.

ధనవంతులు, పేదవారు, పలుకుబడి కలవారు, రాజు -బంటు, తెల్లవారు - నల్లవారు అనే భేదభావం లేకుండా ఒకే వరుసలో భుజానికి భుజం కలిపి ఆరాధన (నమాజ్) చేసే పద్ధతి స్థాపించారు.

మక్కా విజయం తరువాత ఉన్నత జాతి వారిగా భావించే ఖురేషీల ముందు ఒక నీగ్రో జాతికి చెందిన బానిస హజ్రత్ బిలాల్ రజిఅల్లాహు అన్హూ చేత, మొట్టమొదటి సారిగా పవిత్ర కాబా మీద నిలబడి అజాన్ (నమాజ్) పిలుపును ఇప్పించి, మానవ జాతిలో హెచ్చుతగ్గులు లేవు అని చాటిచెప్పారు.

మూఢ నమ్మకాలకు మూర్ఖత్వానికి మూలం అజ్ఞానం.

జ్ఞానవంతులు మాత్రమే సృష్టి రహస్యాన్ని, తన జీవిత మర్మాన్ని తెలుసుకోగలరు.

కనుక స్త్రీ పురుషులు తప్పనిసరిగా జ్ఞానాన్ని ఆర్జించాలని చాటి చెప్పడమే కాకుండా జ్ఞానార్జనకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

“తల్లిదండ్రులు తమ సంతానానికి ఇచ్చే అత్యుత్తమ బహుమానం చక్కని చదువు సంస్కారాలే”

జ్ఞాన సముపార్జన కోసం ఎంతదూరం వెళ్ళవలసి వచ్చినా వెళ్ళండి, ఇది గొప్ప ఆరాధన అని తెలిపారు.

ఆనాడు యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన వారిలో ఎవరైనా విద్యావంతులు ఉంటే, పరిహారంగా చదువు చెప్పాలని కోరారు. విద్యాభివృద్ధికై మస్జిదె నబవీ ముందు “సుఫ్ఫా” అనే వేదిక ఏర్పాటు చేసి వయోజన విద్య ఏర్పాటు చేశారు.

1500 సంవత్సరాల క్రితమే స్త్రీలకు సైతం విద్య నేర్చుకోవడం కోసం ఏర్పాట్లు చేశారు. ఆయన శ్రీమతి హజ్రత్ ఆయిషా స్వయంగా గొప్ప విద్యావంతురాలు. అనేక మంది ప్రముఖులు ధార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆమెను సంప్రదించేవారు.

ఇలా స్త్రీ విద్యకై 1400 సంవత్సరాలకు పూర్వమే బీజం వేశారు.

ఆనాడు ఒక వైపు విశ్వ విఖ్యాత గ్రీకు, రోమ్ నాగరికత సంస్కృతి, మరోవైపు మక్కా అజ్ఞానులు స్త్రీలను ఒక ఆట బొమ్మగా, విలాస వస్తువులుగా చూసేవారు.

ఆడపిల్ల పుట్టడమే అవమానంగా భావించే వారు. ఆడపిల్ల పుడితే సజీవ సమాధి చేసేవారు. అలాంటి సమయంలో భ్రూణ హత్య మహా పాపం అని, ముగ్గురు లేదా ఇద్దరు ఆడపిల్లలను పెంచి పోషించి వారి బాగోగులు చూసుకునే వారికి అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు అని , తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది అని, భార్య నోటికి అన్నం ముద్ద అందించడం కూడా పుణ్య కార్యమే అని, మహిళలను గౌరవించండి ఆమె మీ తల్లి, చెల్లి, కూతురు అని తెలిపి స్త్రీ సంక్షేమానికి నాంది పలికారు ప్రవక్త ముహమ్మద్ (స)

ఇరువై అయిదు సంవత్సరాల నవ యవ్వనంలో నలభై సంవత్సరాల వితంతువును వివాహం చేసుకుని వితంతు వివాహానికి ఆనాడే ఆచరణాత్మకంగా నాంది పలికారు ఆయన. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించారు.

మానవ అసమానతలకు మూలం వడ్డీ. పేదవారిని పీల్చి పిప్పి చేసి ఎప్పటికీ ఎదగకుండా చేసే దుర్మార్గపు చర్య.

అందుకే ఇస్లాం మతంలో వడ్డీని నిషేధించడం జరిగింది.

వడ్డీ ఇచ్చేవారిని, తీసుకొనేవారిని, వాటి లావాదేవీలు వ్రాసేవారిని, సాక్షులను ప్రవక్త ముహమ్మద్ (స) శపించారు.

ఎట్టిపరిస్థితుల్లోనూ వడ్డీ సరికాదని హితవు పలికారు.

## జకాత్ విధిగా చెల్లించవలసిన దానం

ధనవంతులు తమ మిగులు ధనంలో రెండున్నర శాతం జకాత్ స్వచ్ఛందంగా ఇవ్వాలి. ఆ ధనాన్ని నిరుపేదలకు, వితంతువులకు, అనాథలకు, విద్యా వ్యాప్తికి సమాజ అభివృద్ధికి వినియోగించాలి.

నేటి ఈ జకాత్ లక్షలాది మంది అవసరాలకు ఉపయోగపడుతోంది.

ఆయన ఈ లోకాన్ని వీడి సుమారు 14 వందల సంవత్సరాలు గడిచినా నిజమైన విశ్వాసులు ముస్లింలు నేటికీ వడ్డీ దరిదాపుల్లోకి కూడా వెళ్ళరు.

నేడు లేని డాబుసరికి పోయి చాలా దేశాలు, కుటుంబాలు వడ్డీ ఊబిలో కూరుకుపోతున్నాయి. ఆర్థికంగా వెనుకబడి పోతున్నాయి.

ఉన్నంతలో సర్దుకుపోవాలి అని, నిరాడంబరంగా ఉన్నంతలో జీవించాలని కోరారు ప్రవక్త ముహమ్మద్(స).

మద్యం, జూదం, అశ్లీలత లాంటి అధర్మ పనులను ఆనాడే నిషేధించి సత్ సమాజ నిర్మాణం చేశారు.

మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి ఎవరి హక్కులు, బాధ్యతలు వారు దైవానికి భయపడుతూ నిర్వర్తించాలని ఆజ్ఞాపించారు.

సృష్టికర్త తరువాతి స్థానం మనల్ని కని పెంచి పోషిస్తున్న తల్లిదండ్రులది.

అందుకే ఇలా బోధించారు : "తల్లిదండ్రుల పట్ల మంచితనంతో వ్యవహరించాలి. వారి సేవలోనే స్వర్గం దాగివుంది."

"మీ ఆయువు ఆరోగ్య ఐశ్వర్యాల వృద్ధి తల్లితండ్రుల దీవెనలలో ఉన్నాయి"

"ప్రేమ ఆప్యాయతలతో తల్లి వైపు ఒకసారి చూస్తే ఒక పవిత్ర హజ్ చేసినంత పుణ్యం లభిస్తుంది"

"బంధు విచ్ఛిత్తికి పాలుపడడం మహా పాపం"

"బంధుత్వ సంబంధాలను పటిష్టం చేసేందుకు కృషి చేయడం మహా పుణ్య కార్యం."

"మీ పొరుగువారు ఆకలితో అలమటిస్తున్నా మీరు కడుపు నిండా తిని నిదుర పోతే మీరు విశ్వాసులే కాదు'.

"కూలి వాని చెమట ఆరక ముందే అతని కూలి చెల్లించి వేయండి.."

"ఒక పనికి ఒప్పుకున్నప్పుడు దానిని సక్రమంగా చేయాలి."

అలాగే పాలకులు పాలితుల మధ్య సంబంధాలను కూడా సంస్కరించారు.

"దేవుడు ఎవరిని ప్రజల పాలకునిగా చేస్తాడో అతడు వారి బాగోగులను దృష్టిలో ఉంచుకొని వారిని సంరక్షించకపోతే ఆ పాలకుడు స్వర్గ పరిమళాన్ని ఆఘ్రాణించలేడు" అని వక్కాణించారు.

"ప్రళయ దినాన అల్లాహ్ దృష్టిలో క్రూరుడు, అన్యాయపరుడైన పాలకుడు అతిదూరంగా ఉంటాడు. ఆయనకు ప్రియమైనవాడు న్యాయశీలుడైన పాలకుడు అతి దాపులో ఉంటాడు. ఆరోజు అల్లాహ్ దృష్టిలో అతినీచుడు దుష్టపాలకుడే."

"ఫలానా పాలకుడు దుష్టపాలకుడు, దౌర్జన్యపరుడు అని తెలిసి కూడా అతనికి ప్రోత్సాహమిచ్చేవాడు, మద్దతునిచ్చేవాడు ముస్లిమ్ కానేరడు."

## వ్యాపార విషయాల్లో

❖ "మోసం, అబద్ధం, కల్తీ, బ్లాక్ మార్కెటింగ్, చేసేవారు నరకంలోకి పోతారు".

❖ "నీతి నిజాయితీ గల వ్యాపారి రేపు స్వర్గంలో నాతోపాటు ఉంటాడు".

❖ "లంచం ఇచ్చేవారు, పుచ్చుకునే వారు, ఇద్దరూ నేరస్తులే"

ఇలా జీవితానికి సంబంధించిన ప్రతి రంగాన్ని సంస్కరించడమే కాదు, 23 సంవత్సరాల కాలంలో ఒక సర్వోన్నత సామ్రాజ్యం నిర్మించారు ఆయన. ఈనాడు కాస్తోకూస్తో మంచి మానవత్వం, నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం సాటి మనిషి మీద జాలి, దయ మిగిలి ఉన్నాయి అంటే ఆ మహనీయుని సంస్కరణల ఫలితమే.

ఇలా ఆయన 15 వందల సంవత్సరాలకు పూర్వమే సామాజిక, ఆర్థిక, రాజకీయ విద్యా రంగాల్లో ఆచరణాత్మక మార్పు తీసుకువచ్చిన ఏకైక సంస్కర్త,

నేటి యుగంలో సంస్కర్తలుగా కీర్తించబడుతున్నవారు కేవలం ఏదో ఒక రంగంలోనే సంస్కరణ కోసం కృషి చేసారు.

కానీ ప్రవక్త ముహమ్మద్ (స) జీవితపు అన్ని విభాగాలలో సంస్కరణ సాధ్యం అని క్రియాత్మకంగా రుజువు చేశారు.

అందుకే ప్రసిద్ధ చరిత్రకారుడు, పరిశోధకుడు మైకేల్ హెచ్. హార్ట్ మానవ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన 100 మంది మహనీయులలో ప్రవక్త ముహమ్మద్ (స)కు మొదటి స్థానం ఇచ్చాడు.

మీరు స్వతహాగా ఒక క్రైస్తవుడు అయి వుండి ముహమ్మద్ ప్రవక్తకు మొదటి స్థానం ఎందుకు ఇచ్చారు? అని అడుగగా, "ఏ కోణంలో చూసినా ఆయనను మించిన అర్హులు నాకు కనిపించలేదు. ఒక తండ్రిగా, భర్తగా, స్నేహితుడిగా, సైన్యాధ్య క్షుడిగా, రాజనీతి చాణక్యుడిగా, రాజ్యాధినేతగా, సకల రంగాల్లో మానవ సమాజాన్ని ఆయనలా ప్రభావితం చేసిన వారు చరిత్రలో నాకు ఇంకెవ్వరూ కానరాలేదు. అందుకే ఆయనకు మొదటి స్థానం ఇచ్చాను" అని అన్నారాయన.

అందుకే వేల సంవత్సరాలు గడిచినా విశ్వ జనాభాలో నాలుగో వంతు ప్రజలు తు.చ తప్పకుండా ఆయన మార్గాన్ని అనుసరిస్తు న్నారు.

ప్రసిద్ధ తత్వవేత్త బెర్నార్డ్ షా అన్నట్లు, నేడు ప్రపంచ సమస్య లన్నింటికీ సమాధానం కేవలం ముహమ్మద్ ప్రవక్త మార్గాన నడవడంలో తప్ప మరో మార్గంలో లేదు.

"ఇస్లాం విశ్వవ్యాప్తం అయింది కత్తితో కాదు. మంచి, సమానత్వం, అన్నింటి కన్నా ముఖ్యంగా ముహమ్మద్ ప్రవక్త నైతిక ఆచరణ" అని జాతిపిత మహాత్మాగాంధీ కొనియాడిన మహనీయుడు ఆయన.

ముస్లింలారా! మీరు నిజంగా ఆయనను ప్రవక్తగా దైవ సందేశ హరునిగా నమ్ముతున్నట్లయితే, ఆయన అడుగుజాడల్లో నడవాలి. ❁

# అలనాటి ఆయన(స) ప్రవచనాలు నేడూ శిరోధార్యమే

అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్

**మండువేసవిలో** ఏసీ రూమ్‌ను అతుక్కుని హాయిగా సేద తీరుతున్న వేళ వాట్సప్‌లో వచ్చిన మెసేజ్ నిద్రను చెదరగొట్టింది. తక్షణమే మిత్రుడు వెంకట్ గుర్తుకు రాగానే ఫోన్ కలిపాను. ''హలో మిత్రమా! భార్య, పిల్లలతో ఊటికెళ్తున్నా.. టికెట్లు కూడా బుక్ చేసుకున్నానని చెప్పావుగా? ఏమైంది'' వెటకారం, వినోదాన్ని కలగలిపి ప్రశ్నించాను.

''ఆ... ఇంకేం ఊటి? ఏదో దిక్కుమాలిన ట్రైనింగ్ అని మెసేజ్ వచ్చిందిగా...'' నిరుత్సాహంగా బదులిచ్చాడు వెంకట్.

♦♦♦

వెంకట్ నాకు మంచి మిత్రుడు. ఇద్దరం ఒకేసారి టీచర్ ట్రైనింగ్ చేశాం. ఒకేసారి ఉద్యోగంలో చేరాం. మంచీచెడు కలిసి పంచుకుంటాం. రమజాన్ పండుగ నాడు అతను రావడం, నేను ఉగాది నాడు అతన్ని కలవటం మా ఇద్దరికీ మామూలే. అలాగే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల చిరు పుస్తకాలు, కరపత్రాలు అప్పుడప్పుడు అతనికి ఇవ్వడం కూడా జరుగుతుంది.

♦♦♦

ఈ వేసవిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. మిత్రుడు వెంకట్ టూర్ ప్లాన్ వాయిదా వేసుకున్నాడు. ఇక ప్రతి రోజూ ఇద్దరం కలిసి ట్రైనింగ్‌కు హాజరవుతున్నాం. మొదటి రోజు శిక్షణలో శిక్షణ లక్ష్యాలు: బోధనలో మెళకువలు, డిజిటల్ బోర్డ్‌ను ఎలా ఉపయోగించాలి, షీ టీమ్స్, డ్రగ్స్, ఫోక్సో చట్టాల అవగాహనపై శిక్షణ అంటూ స్పెషల్ టీచర్ వివరిస్తుంటే... ఇదేదో బాగానే ఉందనిపించింది.

♦♦♦

చూస్తుండగానే నాలుగు రోజులు గడిచాయి. చివరి రోజు.. మహిళా ఎస్ఐ మధులిక, అడ్వకేట్ శారద మేడం, క్రైమ్ టీమ్ సభ్యులు వచ్చారు. మహిళా ఎస్ఐ మధులిక మాట్లాడుతూ, ''నేడు సమాజంలో ఆడవారి పట్ల లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయి. బాల్యం నుండే డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారు. వావి వరుసలు మాయమవుతున్నాయి. మీరు ఉపాధ్యాయులు, సమాజంలో మీ విలువ, గౌరవం గొప్పది. మీరు తలచుకుంటే తరాల తలరాతను మార్చగలరు. ప్రస్తుతం వచ్చిన చట్టాలను మీకు చెప్పి మీ ద్వారా తరగతి గదుల్లో చెప్పిస్తే సమాజ సంస్కరణ జరుగుతుందనే ఉద్దేశ్యంతో వచ్చాము'' అంటూ మేడం మైక్‌ను లాయర్ శారద గారికి ఇచ్చారు. లాయర్ గారు మాట్లాడుతూ.. ''అసలు 'ఫోక్సో' చట్టం గురించి చాలా మందికి తెలియదు. అది తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అమ్మాయిలపై లైంగికంగా దాడి చేస్తేనే నేరం అనుకుంటున్నారా? కాదు.. ఏ స్త్రీల వైపైనా కనీసం 8 సెకన్లు రెప్పవాల్చకుండా చూసినా 'ఫోక్సో' చట్టం అమలు చేయవచ్చు'' ఆశ్చర్యం, అద్భుతం... ఆ క్షణమే నా రోమాలు నిక్కబొడిచాయి. హృదయం ద్రవించింది. నా అంతరాత్మ నన్ను వెక్కిరించింది. బాధతో నా కళ్ళు చెమ్మగిల్లాయి. నా కాళ్ళ క్రింద నేల కంపించింది.

కారణం...?! దాదాపు 1500 సంవత్సరాల క్రితమే ఆ మహాప్రవక్త (సఅసం) 'ఫోక్సో'ను మించిన చట్టం చెప్పారు. ''పర స్త్రీని చూసినప్పుడు నీ చూపులు క్రిందికి వాల్చుకో'' ''పరాయి స్త్రీని చూస్తే తొలిచూపు నీది.. రెండవ చూపు షైతాన్‌ది'' అని సెలవిచ్చారు. 'తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది' అని, 'పొరుగు వారు ఆకలితో ఉండగా నీవు కడుపు నిండా తింటే నీవు విశ్వాసివి కాజాలవు'. అలాగే 'కూలివాని చెమట ఆరకముందే అతని కూలి చెల్లించాలి'. ఇలాంటి అనేక సూక్తులు ఎన్నో విన్నాం. పెడచెవిన పెట్టాం. కాని ఆ సూక్తుల్ని ఆధారంగా చేసుకుని నేటి ఆధునిక చట్టాలు తయారు చేస్తున్నారంటే.. ఆ మహాప్రవక్త(స) బోధించిన ఇస్లాం మతం ఎంత సత్యమైనది? అందుకే మరోసారి నా అంతరంగం...

**'చెడులన్నింటినీ రూపుమాపే ఇస్లామే శరణ్యం.**

**లేదంటే నీ బ్రతుకంతా అరణ్యం'** అంటూ సాక్ష్యం పలికింది.

❀



# దైవ ప్రవక్త(స) తన గృహ సీమలో

**నసీరా బేగం**

**కారుణ్యమూర్తి** మహాప్రవక్త ముహమ్మద్(స) రాత్రీ పగలు రెండింటినీ మూడు భాగాలుగా విభజించేవారు. ఒక భాగం దైవారాధన కోసం, మరొక భాగం తమ ఇంటి వారి కోసం, ఇంకొక భాగం ప్రజల కోసం. ఈ విధంగా అందరి హక్కులనూ చక్కగా విభజించి పాటించేవారు.

దైవప్రవక్త(స) అర్థరాత్రి లేదా మూడో వంతు రాత్రి మేల్కొనేవారు. చక్కగా వుజూ చేసుకుని తహజ్జుద్ నమాజు చేసుకునేవారు. ఈ నమాజులో ఖియామ్, రుకూ, సజ్దాలు సుదీర్ఘమైనవిగా ఉండేవి. ఇంకా దైవనామాన్ని అధికంగా స్మరించేవారు. ఫజ్ర్ నమాజ్ సమయం కాగానే మస్జిద్‌కు వెళ్ళి ఫజ్ర్ నమాజును చేసేవారు. ఆ తరువాత చాష్త్ నమాజ్‌ను ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేవారు. ఇంటికి రాగానే తినడానికి టిఫిన్ ఉందా? అని అడిగేవారు. ఉంటే తినేవారు. లేకుంటే, ''ఫరవాలేదు. ఈ రోజు ఉపవాస సంకల్పం చేసుకుంటాన''ని అనేవారు. ఇంటి పనులలో భార్యలకు తోడ్పడేవారు. తన పనులు తానే చేసుకునేవారు. ఉదాహరణకు చినిగిపోయిన బట్టలకు అతుకులు వేసుకోవటం, చెప్పులు తెగిపోతే కుట్టుకోవటం, మేకల పాలు పితకటం వంటివి. జుహ్ర్, అసర్ నమాజు సమయాలలో నమాజులను ఆచరించేవారు. ఆ తరువాత తన సహచరులతో సమావేశమయ్యేవారు. హితబోధలు చేసేవారు. దైవ సందేశాన్ని చేరవేసేవారు. అస్ర్ నమాజు ముగించుకుని తమ భార్యలందరి వద్దకు వెళ్ళి కొద్దిసేపు అక్కడ గడిపి వారి క్షేమ సమాచారాలను తెలుసుకునేవారు. తరువాత మగ్రిబ్ నమాజు చేసేవారు. ఏ భార్య దగ్గర గడిపే దినమో అక్కడ రాత్రి గడిపేవారు. ఆ తరువాత ఇషా నమాజు ముగించుకుని నిదురపోయేవారు. నిదురపోయే ముందు ఖుర్ఆన్ గ్రంథాన్ని పారాయణం చేసేవారు. (తిర్మిజీ)

దైవప్రవక్త(స) వద్దకు పగటి నిర్ణయ సమయాలలో సహాబా హాజరయ్యేవారు. ఆయన(స) వారితో సందేశ కార్యక్రమాల గురించి, ఇతర విషయాల గురించి సంభాషించేవారు. వారు వాటిని ప్రజలకు చేరవేసేవారు. మధ్యలో అగత్యపరులెవరైనా అవసరాలను తీసుకొస్తే వెంటనే అక్కడి నుంచి లేచి వెళ్ళి వారి అవసరాలను పూర్తి చేసేవారు. మంచి విషయాలను ప్రోత్సహించేవారు. చెడు విషయాలను అయిష్టపడేవారు. హితబోధ చేసే విషయంలో ఎటువంటి అశ్రద్ధను చూపేవారు కాదు.

ఆయన(స) భార్యలందరినీ ప్రేమగా, సమానంగా చూసుకునేవారు. ప్రయాణానికి ముందు లాటరీ తీసి ఎవరి పేరు అందులో వచ్చిందో ఆమెను తీసుకుని ప్రయాణం చేసేవారు. ఇంటి వాతావరణాన్ని చక్కగా, ఆహ్లాదకరంగా ఉంచేవారు. భార్యల వయసును దృష్టిలో ఉంచుకుని మసలుకునేవారు. హజ్రత్ ఆయిషా(ర) గారి చిన్న వయసును దృష్టిలో ఉంచుకుని ఆమె(ర) బొమ్మలతో ఆడుకుంటూ ఉంటే ఆడుకోనిచ్చేవారు. ఆమె(ర) గారితో ఆడుకోవటానికి స్నేహితురాళ్ళు ఆమె(ర) గారి ఇంటికి వచ్చేవారు. కాని దైవప్రవక్త(స) గారు ఇంట్లోకి రావటాన్ని చూసి అటూ ఇటూ వెళ్ళి దాక్కునేవారు. కాని దైవప్రవక్త(స) వెతికి వెతికి ఒక్కొక్కరిని ఆమె(ర) వద్దకు ఆడుకోమని పంపేవారు.

ఒకసారి నీగ్రో జాతి ప్రజలు కొందరు పండుగ రోజున విన్యాసాలు చేస్తూ ఉంటే ఆయన(స) గారు తన దుప్పటిని అడ్డుపెట్టి నుంచొని మరీ ఆమె(ర)గారికి చూపించారు. ఒకవేళ ఎవరైనా చిన్న వయసు గల స్త్రీని గనక వివాహం చేసుకుంటే ఆమె భావాలను, ఆమె కోరికలను దృష్టిలో ఉంచుకోవాలని బోధించారు. హజ్రత్ ఆయిషా(ర)

ఆయన గారికి కథలు కూడా చెప్పేవారు. ఆమె(ర) గారు నీళ్ళు త్రాగుతూ ఉండగా ఆమె(ర) గారి నుంచి నీళ్ళ పాత్ర లాక్కుని, ఆమె నీరు త్రాగిన చోటే తన పెదవులను తగిలించి మరీ తాగేవారు. ఆమె(ర) గారు తింటున్న మాంసపు ముక్కను తీసుకుని ఆమె(ర) తిన్న చోటి నుండే ఆయన(స) గారు కూడా తినేవారు. ఆమె(ర) గారిని దిండుగా చేసుకుని ఆనుకుని కూర్చునేవారు. ఆమె(ర) గారితో పరుగు పందాలను పెట్టుకునేవారు. ఒకసారి ఆమె(ర) గారు గెలిస్తే, మరొకసారి దైవప్రవక్త(స) గారు గెలిచారు.

"స్త్రీ పక్కటెముక నుంచి పుట్టించబడింది. దాన్ని సరిచేస్తే అది విరిగిపోతుంది. అలానే వదిలేస్తే వంకరగానే ఉండిపోతుంది. కనుక ఆమె పట్ల ఉత్తమంగా వ్యవహరించండి" అని ఆయన(స) సెలవిచ్చారు. ఇంకా ఆయన(స) తమ వయసుకన్నా పెద్దవారైన భార్య హజ్రత్ ఖదీజా(ర)ను కూడా అమితంగా గౌరవించేవారు. ప్రేమించేవారు. ఆమె(ర) గారు మరణించిన తరువాత కూడా ఆయన(స) ఆమె గారిని మరువలేకపోయేవారు. ఆమె(ర) గారి జ్ఞాపకం రాగానే ఎంతో బాధపడేవారు. ఆమె(ర) గారి స్నేహితుల ఇంటికి కానుకలు పంపేవారు. ఇదేవిధంగా భార్యలందరినీ ప్రేమించేవారు. వారితో సరదాగా, సంతోషంగా ఉండేవారు. వారితో సలహా సంప్రదింపులు జరిపేవారు. ఎవరి మనసునూ ఎంతమాత్రమూ నొప్పించేవారు కాదు. ఎవరికైనా ఎవరి ద్వారానైనా ఏదైనా బాధ కలిగితే ఓదార్చేవారు. తన స్వహస్తాలతో వారి కన్నీళ్ళను తుడిచేవారు. ఈ విధంగా ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా ఉంచేవారు. గృహ వ్యవహారాలలో ఎంతగా లీనమై ఉన్నప్పటికీ అజాన్ అవ్వగానే నమాజు కోసం మస్జిద్‌కు వెళ్ళిపోయేవారు. అజాన్ అవ్వగానే మేమెవరో ఆయన ఎవరో అన్నట్లుగా అయిపోయేవారు దైవప్రవక్త(స) అని స్వయంగా హజ్రత్ ఆయిషా(ర) సెలవిచ్చారు.

ఒకసారి దైవప్రవక్త(స) సమక్షంలో భార్యలు హెచ్చు స్వరంతో మాట్లాడుతూ ఉండగా, మహనీయ ఉమర్(రజి) అక్కడికి ఏతెంచారు. ఉమర్ కంఠస్వరం వినగానే సతీమణులంతా భయంతో అక్కణ్ణుంచి తుర్రుమన్నారు. ఈ వైనాన్ని గమనించిన ఉమర్(రజి), "ఓయీ ఆత్మ ద్రోహులారా! మీరు భయపడాల్సింది నాకు కాదు, దైవప్రవక్త(స)కు" అని చెప్పినప్పుడు, "దైవప్రవక్త మీలాగా కరకు స్వభావం కలవారు కాదు కదా?" అని వారు లోపలి నుంచి సమాధానమిచ్చారు. ఈ వైనాన్ని గమనించిన దైవప్రవక్త(స) ముసిముసిగా నవ్వారు.

దైవప్రవక్త(స) తన సంతానాన్ని కూడా అమితంగా ప్రేమించేవారు. ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టే ఆ సమాజంలో నలుగురు ఆడపిల్లలకు తండ్రి అయినందుకు ఆయన(స) అదృష్టంగా భావించారు. వారిని ప్రేమగా పెంచి పెద్దచేశారు. వారి వల్ల కలిగిన పరీక్షలను ఎదుర్కొన్నారు. వారి మరణంపై సహనం వహించారు. ప్రవక్త(స) గారి జీవిత కాలంలోనే కుమార్తెలు, కుమారులు మరణించినప్పుడు ఆయన(స) గారి కళ్ళ నుంచి బాధతో ధారాపాతంగా కన్నీళ్ళు ప్రవహించాయి. అప్పుడు ఆయన(స) సెలవిచ్చారు : "కన్నీళ్ళు ప్రవహించటం కారుణ్యానికి సంబంధించినది. కళ్ళు కన్నీళ్ళు ప్రవహింపజేస్తున్నాయి. హృదయం బాధపడుతూ ఉంది. కాని నోటితో మాత్రం నేను నా ప్రభువు ఇష్టపడిన మాటనే పలుకుతాను".

దైవప్రవక్త(స) కుమార్తె హజ్రత్ ఫాతిమా(ర) ఆయన(స) గారి కొన్ని నెలల తరువాత పరమపదించారు. కుమార్తె హజ్రత్ ఫాతిమా(ర) అంటే దైవప్రవక్త(స)కు అమితమైన ప్రేమ. ఆమె(ర) గారిలో దైవప్రవక్త(స) పోలికలు అధికంగా ఉండేవి. ఆమె(ర) గారు దైవప్రవక్త(స) వద్దకు వచ్చినప్పుడు ఆయన(స) లేచి వెళ్ళి ఆమె(ర) గారిని ఆహ్వానించేవారు. ఆమె నుదుటిని ముద్దాడేవారు. తాను కూర్చున్న చోట ఆమె(ర) గారిని కూర్చోబెట్టేవారు. ఒకసారి హజ్రత్ ఫాతిమా(ర) తండ్రి దగ్గకు వచ్చారు. కాని ఆయన(స) ఇంట్లో లేరు. తిరిగి వెళ్ళిపోయారు. ఈ విషయాన్ని హజ్రత్ ఆయిషా(ర) దైవప్రవక్త(స)కు తెలియజేశారు. దైవప్రవక్త(స) వెంటనే కూతురి ఇంటికి వెళ్ళారు. ఆ దంపతులు (అలీ, ఫాతిమా) అప్పుడే పడకపై పడుకోవటానికి వెళ్ళారు. తండ్రిని చూసి కూతురు లేవబోయారు. కాని దైవప్రవక్త(స) ప్రేమగా లేవనివ్వలేదు. ఇద్దరి మధ్య కూర్చుని మాట్లాడారు. అప్పుడు దైవప్రవక్త(స) గారి పవిత్ర పాదాల చల్లదనాన్ని తన హృదయంలో ఆస్వాదించాను అని అల్లుడైన హజ్రత్ అలీ(ర) సెలవిచ్చారు.

అంతేకాదు, దైవప్రవక్త(స) మనవలు, మనవరాళ్ళను కూడా ఎంతో ప్రేమించేవారు. ఒకసారి ఇసా నమాజు సమయంలో మనవణ్ణి హసన్ లేదా హుసైన్‌ను ఎత్తుకుని మస్జిద్‌లోకి ప్రవేశించారు. బాబును దగ్గరగా కూర్చోబెట్టుకుని నమాజు చేయించటం ప్రారంభించారు. నమాజులో ఒక సజ్దాలో ఎక్కువ సమయం ఉండిపోయారు. నమాజు అయిపోయిన తరువాత ప్రజలు ఇలా విన్నవించుకున్నారు : ఓ దైవప్రవక్తా(స)! మీరు సుదీర్ఘమైన సజ్దాను చేసినందుకు మేము భయపడ్డాము. ఏదైనా ఆపద వచ్చి పడిందా... లేదా వహీ అవతరిస్తూ ఉందా? అని. దానికి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "లేదు, నేను నమాజు చేస్తూ ఉండగా నా మనవడు నా వీపుపై ఎక్కి కూర్చున్నాడు. నేను అతను దిగేవరకు వేచి ఉన్నాను". ఒకసారి మనవరాలైన చిన్నారి ఉమామా(ర)ను కూడా మస్జిద్‌కు తీసుకుని వచ్చారు. ఖియామ్‌లో ఉన్నప్పుడు ఉమామాను భుజాలపై కూర్చోబెట్టుకునేవారు. రుకూ, సజ్దాలు చేసేటప్పుడు క్రిందికి దింపేవారు.

ఈ విధంగా దైవప్రవక్త(స) ప్రవక్తా పదవీ బాధ్యతలను నెరవేరుస్తూ, అందులో ఎదురయ్యే ఒడిదుడుకులను కష్టాలను ఎదుర్కొంటూ ఇంటి వారి బాధ్యతలను నెరవేర్చారు. ఏనాడూ ఆయన ఇంటివారిపై చిర్రుబుర్రులాడలేదు. వారి హక్కులను వారికి ఇచ్చారు. ఒక మంచి భర్తగా, ఒక మంచి తండ్రిగా, ఒక మంచి తాతగా, ఒక మంచి మామగా, ఒక మంచి బంధువుగా ఆచరించి చూపించారు. ❀

# ఆయన (స) జీవితమే సందేశం

**అర్షియా**

**కార్మికుల** హక్కుల గురించి 1400 ఏండ్ల క్రితమే మాట్లాడిన అభ్యుదయ వాది, ఆడ పిల్లలకు విద్య నేర్పించిన సంస్కరణ శీలి, మానవాళికి ఉత్తమ నైతిక జీవన మార్గాన్ని బోధించిన ప్రబోధకుడు ప్రవక్త ముహమ్మద్(స). మదీనాలో ఒక శ్రేయో రాజ్యాన్ని స్థాపించి ఎన్నో కుట్రలు, దాడులను తట్టుకొని కొద్ది కాలంలోనే ప్రపంచ మంతటా ఒక గొప్ప ఆధ్యాత్మిక సామ్రాజ్యాన్ని ఆయన విస్తరించారు. జీవితాంతం ధర్మబద్ధంగా జీవించి తన జీవితాన్నే మానవాళికి సందేశంగా అందించిన మహనీయ పరిపాలకుడు, ప్రవక్త ఆయన. చక్రవర్తిగా ఉన్నా పేదరికాన్ని అనుభవించిన నిరాడంబరుడు. అనాథలను, వితంతువులను ఆదరించాలని ఆచరించి చూపిన కారుణ్య మూర్తి. మనుషులంతా సమానమేనని.. అందరికీ జీవించే హక్కు, న్యాయం పొందే హక్కు ఉందని చాటి చెప్పిన ప్రజాస్వామిక వాది. ఆయన తన రాజ్యంలోని ప్రజల కోసం ప్రజా వైద్య వ్యవస్థను స్థాపించారు. మదీనాలో రెగ్యులర్ మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. వాణిజ్యంలో ఎవరి గుత్తాధిపత్యం లేకుండా చేశారు. పేదలు, బలహీనుల కోసం పింఛను వ్యవస్థను ప్రవేశపెట్టారు.

అరబ్బు ద్వీపకల్పంలో శాంతి భద్రతలను స్థాపించడానికి ఆయన తన జీవిత కాలంలో కేవలం 95 రోజులు మాత్రమే యుద్ధాలు చేశారు. దుర్మార్గం, అణచివేతలు అన్యాయాలను తుదముట్టించి మంచితనం, ధర్మం, న్యాయం, శాంతి సౌహార్ధతలు వర్ధిల్లేలా చేశారు. మక్కాను జయించినప్పుడు తనను కష్టాలపాలు చేసినవారు ఎదురుపడినా వారిపై పగ సాధించకుండా సర్వ సామాన్యమైన క్షమాపణ ప్రకటించారు.

ప్రవక్త నిరాడంబరత, త్యాగ నిరతిని, స్థిరచిత్తాన్ని జాతిపిత మహాత్మా గాంధీ తన యంగ్ ఇండియా పత్రికలో ప్రశంసించారు. నిజమైన దైవాన్ని తెలుసుకోవాలని, తీర్పు దినాన్ని విశ్వసించాలని సమస్త మానవాళి కోసం ప్రవక్త ముహమ్మద్(స) దైవ సందేశాన్ని తీసుకొని వచ్చారు. మనుషుల జీవితాలను సంపూర్ణంగా అన్ని రంగాల్లో సంస్కరించారు. ఆయన కృషి వల్ల మనుషుల ఆలోచనా విధానం మారింది. అలవాట్లు, ఆచరణలు, ఆచారాలు, సంప్రదాయాలు మంచి మార్గం వైపు మరలాయి. నిజం చెప్పాలంటే ప్రవక్త ముహమ్మద్(స) కృషి వల్ల సర్వ మానవాళికి సరికొత్త జీవన విధానం లభించింది. అల్లాహ్(దేవుడు) తప్ప మరో ఆరాధ్యుడు లేడు, అల్లాహ్ పట్ల విధేయత చూపాలని ఆయన మానవాళికి సందేశం ఇచ్చారు. ఆయన సందేశాన్ని పాటించి అల్లాహ్ అభీష్టానికి అనుగుణంగా మన సంపూర్ణ జీవితాన్ని మలచుకొనే ప్రయత్నం చేయాలి. ముహమ్మద్ (స) చిట్టచివరి ప్రవక్త, మానవాళికి మార్గదర్శనం చేసిన మహోపకారి. ఆయన ఆదర్శ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన సందేశాన్ని ఆచరిస్తూ మనం మన జీవితాలను ధన్యం చేసుకోవాలి.

## ముహమ్మద్ ప్రవక్త (స) సువర్ణ సూక్తులు..

1. తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది. తండ్రి స్వర్గానికి ద్వారం. కన్నవారి సేవలోనే ముక్తిమోక్షాలున్నాయని సంతానానికి సూచించారు.

2. కూలీవాని చెమట చుక్కలు ఆరకముందే వారి వేతనాన్ని ఇచ్చేయండి' అని చెప్పి శ్రామికులకు అండగా నిలిచారు.

3. భార్యపట్ల సద్భావంతో మెలగండి. ఆమెతో కఠినంగా మాట్లాడవద్దు. స్త్రీలకూ ఆస్తిలో వాటా ఇవ్వాలి అని చెప్పి మహిళల గౌరవాన్ని పెంచారు.

4. పెద్దలను గౌరవించనివాడు, పిల్లలను ప్రేమించనివాడు నా వాడు కాడని చెప్పారు.

5. నీతి, నిజాయితీగా వ్యాపారం చేయండి. కొలతలు తూనికల్లో మోసానికి పాల్పడకండి. ప్రళయదినాన ఎలా సంపాదించామో, ఎలా ఖర్చు చేశామో అల్లాహ్‌కు లెక్కచెప్పాల్సి ఉంటుందని ప్రజల్ని అప్రమత్తం చేశారు.

6. విద్యాజ్ఞానాలే తమ సంతానానికి ఇచ్చే విలువైన కానుకలు అని చెప్పి నైతిక విలువలను ప్రోత్సహించారు.

7. పొరుగింటి వారికివ్వడానికని ఇంట్లో కూర వండేటప్పుడు కాసిన్ని నీళ్లు ఎక్కువ పోయండి అని చెప్పి ఇరుగు పొరుగు వారి హక్కుల్ని గుర్తుచేశారు.

8. ఖర్చులకు పోనూ ఏడాదిపాటు మిగిలి ఉన్న సంపదలో నుంచి రెండున్నర శాతం విధిగా పేద ప్రజల కోసం ఖర్చుచేయాలన్నారు. ఈ దానాలకు తమ దగ్గరి బంధువులు ఎక్కువ హక్కుదారులని చెప్పారు.

9. తమ సంపదలో సమృద్ధి జరగాలని, ఆయుష్షు పెరగాలని కోరుకునేవారు బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని చెప్పి బంధుత్వ సంబంధాల గొప్పతనాన్ని వివరించారు.

10. పొరుగువాడు ఆకలితో ఉంటే తాను మాత్రం కడుపారా భుజించేవారు ముస్లిములు కారు అని చెప్పి ఆకలి బాధ తీర్చడం ఎంత పుణ్యప్రదమో వివరించారు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**